ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు

: fb.com/vaartha Digital



నేటి మీ కపిల్‌చిట్స్ తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం



Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-11-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 279 పేజీలు: 12 వెల: 6.50




ఆదివారం పాట్నాలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో మంత్రి లోకేష్ భేటీ అయిన దృశ్యం

## కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో మంత్రి లోకేష్ భేటీ

### బీహార్‌లో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన మంత్రి

**విజయవాడ,నవంబరు9,ప్రభాతవార్తప్రతినిధి :** కేంద్ర విద్యాశాఖ మంత్రి, బీహార్ బిజెపి ఎన్నికల ప్రచార కర్త ధర్మేంద్ర ప్రధాన్‌తో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాట్నాలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. బీహార్‌లో ఎన్‌డిఎ విజయం కోసం ప్రధాన్ అహరహం శ్రమిస్తున్నారు. గతేడాది హర్యానా, ఒడిశా ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయంలో ప్రధాన్ కీలక పాత్ర వహించారు. ఇప్పుడు బీహార్‌లో ఎన్‌డిఎ విజయం కోసం తీవ్రంగా కృషిచేస్తున్నారు. బీహార్‌లో మరోమారు ఎన్‌డిఎ సర్కారును గెలిపించేందుకు ప్రధాన్ చేస్తున్న నిర్మాణాత్మక కృషిని మంత్రి లోకేష్ >>2

# పేదల ఇంటివద్దకే వైద్యసేవలు

**5 కోట్ల మంది ప్రజల హెల్త్ కార్డులు ఆన్‌లైన్**

**ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికే 'సంజీవని'**

**శంకర ఐ ఫౌండేషన్ సేవలు నిరుపమానం**

**సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ కేంద్రం ప్రారంభించిన సిఎం చంద్రబాబు**




ఆదివారం శంకర ఆస్పత్రిలో ఐ కేర్ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, నవంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** అనారోగ్యమే నిజమైన పేదరికమని, అందుకే ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని శంకర కంటి ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఐదు దశాబ్ధాలుగా శంకర ఆస్పత్రి పేదలకు ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందని ముఖ్యమంత్రి అన్నారు. శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో నడుస్తున్న శంకర కంటి ఆస్పత్రిలో నూతన భవన నిర్మాణ ప్రారంభోత్సవంలో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానని, నిస్వార్థంగా సేవలు చేసే ఇలాంటి సంస్థలకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు.

రాబోయే రోజుల్లో ఆరోగ్యం విషయంలో ప్రపంచానికి ఎపి ఒక రోల్ మోడల్‌గా ఉంటుందనే అభిప్రాయాన్ని సిఎం చంద్రబాబు వ్యక్తం చేశారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు శంకర్ కంటి ఆసుపత్రి చేస్తున్న కృషిని అభినందిస్తున్నానని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం సంజీవని పథకాన్ని తీసుకువచ్చింది. రాష్ట్రంలో ఉన్న 5 కోట్ల మంది హెల్త్ రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతాం. ఈ పథకం ద్వారా ప్రతి పేదవాని ఇంటి వద్దకే వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటి వరకూ దాదాపు 32,000 వైద్య శిబిరాలను నిర్వహించి 30 లక్షల మందికి కంటి శస్త్రచికిత్సలు చేసిన ఘనత శంకర కంటి ఆసుపత్రికి దక్కుతుంది. భవిష్యత్తులో వైద్యసేవలను అందరికీ చేరువచేసే విధంగా కృషి చేస్తాం" అన్నారు. >>2

## ఎస్ఐ, కానిస్టేబుళ్ల భర్తీకి ఉత్తర్వులు జారీ

**విజయవాడ,నవంబరు9,ప్రభాతవార్తప్రతినిధి:** పోలీస్ కానిస్టేబుళ్లు, సబ్ఇన్స్పెక్టర్(ఎస్ఐ) పోస్టుల భర్తీకి సంబంధించి ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఆ మేరకు ప్రభుత్వ కార్యదర్శి వాడ్రేవు వినయచంద్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పోలీసు శాఖలో స్పెషల్ పోలీసు విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అనుమతిని ఇవ్వాలని కోరుతూ డిజిపి హరీష్‌కుమార్ గుప్తా ప్రభుత్వానికి లేఖ రాసారు. ఈ అంశాన్ని పరిశీలించిన తరువాత సిఎం చంద్రబాబు ఆర్థిక శాఖకు సంబంధిత లేఖను పంపించారు. ఈ శాఖ అన్ని >>2

## అమరావతిలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం

### మొత్తం 3.50 కి.మీ దూరం

**విజయవాడ, నవంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర రాజధాని అమరావతిలో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించనున్నారు. రాజధాని నుండి మహానగరం విజయవాడకి నేరుగా కనెక్టివిటి ఏర్పాటు చేసే చర్యల్లో భాగంగా దీనిని చేపట్టనున్నారు. మొత్తం 3.50 కిలోమీటర్ల దూరం కారిడార్‌ను నిర్మించనున్నారు. ఇందులో అమరావతి నుండి విజయవాడ వైపు మొదటి ర్యాంపు 232 మీటర్ల దూరం ఉండనుంది. గుంటూరు వైపు నుండి అమరావతికివచ్చే రెండోర్యాంపు 280 మీటర్లదూరం నిర్మించనున్నారు. విజయవాడ నుండి అమరావతివైపు మూడోర్యాంపు 115 మీటర్లదూరం నిర్మిస్తారు. 2.46 కిలోమీటర్ల దూరం ఎలివేటెడ్ >>2



కుంకీ ఏనుగుకు ఆహారం తినిపిస్తున్న డి. సిఎం పవన్ కల్యాణ్

## మియావకీ ఫారెస్ట్ ప్లాంటేషన్‌కు శ్రీకారం

**ముసలమడుగు కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రం సందర్శన**

**కుంకీ ఏనుగుల ప్రదర్శనను తిలకించిన డి. సిఎం పవన్**

**కుంకీల బాధ్యత చూసే మావటీలకి రూ.50 వేలు బహుమానం**

**పలమనేరు, నవంబరు 9 ప్రభాతవార్త:** మదపుటేనుగుల దాడుల నుంచి పంట పొలాలను, మనుషులను రక్షించేందుకు ప్రత్యేకంగా కర్ణాటక రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చిన కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖమంత్రి పవన్ కల్యాణ్ ఆదివారం సందర్శించారు. చిత్తూరు >>2






ఆదివారం అంగోలాలోని లువాండ చేరిన రాష్ట్రపతి ముర్ముకు అక్కడి సైనికాధికారులు ఘనంగా స్వాగతం పలికిన దృశ్యం

# ఫారెస్ట్ ప్లాంటేషన్‌కు శ్రీకారం

>> జిల్లా, పలమనేరు నియోజకవర్గం, ముసలమడుగు వద్ద ఉన్న శిక్షణ కేంద్రానికి విచ్చేసిన ఆయన ఏనుగుల శిక్షణ, సంరక్షణ తదితర అంశాలను స్వయంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. కర్ణాటక నుంచి తెచ్చిన నాలుగు కుంకీ ఏనుగులతోపాటు గతంలో ఇదే శిక్షణ కేంద్రంలో ఉన్న మూడు కుంకీలు ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాయి. శిక్షణలో కుంకీ ఏనుగులు చూపుతున్న మెలకువలు, జీవితం జరిగిన అపరేషన్లు అమ్యూజుకల వారికి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కుంకీ ఏనుగులు ప్రత్యేకంగా ప్రదర్శన ఆకట్టుకుంది. క్రమపద్ధతిగా కుంకీ ఏనుగులు వరుసగా వచ్చి ఘీంకారం చేస్తూ పవన్ కళ్యాణ్‌కి సెల్యూట్ చేశాయి. అనంతరం అడవిలో లభ్యమయ్యే వివిధ రకాల కలపను ఏనుగుల సహాయంతో ఎలా బయటకు తీసుకువస్తాయి ఏనుగుల చేత ప్రదర్శించారు. మానవ, ఏనుగుల మధ్య ఘర్షణ తలెత్తినప్పుడు మదపు టేనుగుల గుంపు, నివాసాలు, పంట పొలాల వైపు వస్తున్నప్పుడు వాటిని ఎలా నియంత్రించాలో ప్రత్యక్షంగా కుంకీ ఏనుగుల చేత చేయించిన ప్రదర్శన ఆకట్టుకుంది. మదపుటేనుగులను అదుపు తప్పినప్పుడు వాటికి ఓ ప్రత్యేకంగా మత్తు ఇచ్చి వాటి కోపాన్ని ఎలా అతిపెరిస్తారు అన్నది మావటీలు పవన్ కళ్యాణ్‌కి చూపించారు. మత్తు ఇచ్చే ఇంజెక్షన్ గన్‌ను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా కుంకీ ఏనుగులు చేసిన ప్రదర్శనను ఉప ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఏనుగులకు ఆయన స్వయంగా బెల్లం ఆహారం అందించారు. అనంతరం గజరాజుల ఆశీర్వచనం తీసుకున్నారు.

**ముసలమడుగు ఏనుగుల క్యాంపు ప్రారంభోత్సవం**

అనంతరం అటవీశాఖ ఆధ్వర్యంలో ముసలమడుగులో ఏర్పాటుచేసిన నూతన ఏనుగుల క్యాంపును డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. అందుకు సంబంధించిన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఏనుగుల క్యాంపులో ఏర్పాటు చేయనున్న గజారామం నగర వనానికి పునాదిరాయి వేశారు. సొరకత్తితో పనిచేసే వేదరే ఆటవీ ఏనుగుల నిరోధక కంచె నిర్మాణానికి పవన్ కళ్యాణ్ భూమిపూజ చేశారు.

**మియావాకీ తరహా ప్లాంటేషన్‌కి శ్రీకారం**

తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలు పెంచడం ద్వారా అడవిని పెంపొందించే మియావకీ తరహా ప్లాంటేషన్‌కు, ముసలమడుగు కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్ర వద్ద డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. ఉసిరి మొక్కను నాటి పవన్ కళ్యాణ్ ఈ దట్టమైన అడవుల పెంపకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. మీటరకు ఒక్కటి చొప్పున నాటిన మియావకీ ప్లాంటేషన్‌ను స్వయంగా మొబైల్‌లో వీడియో తీసుకున్నారు. మధ్యన పొదలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**మావటీలకి ఉప ముఖ్యమంత్రి రూ.50 వేలు బహుమానం**

కర్ణాటక ప్రభుత్వం నుంచి కుంకి ఏనుగులను స్వీకరించేటప్పుడు వీటిని జాగ్రత్తగా చూసుకుంటామని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చెప్పారు. ఆ విధంగానే పలమనేరు ఎలిఫెంట్ క్యాంపులో మావటీలు.. కుంకీల సంరక్షణ బాధ్యతలు చూసుకుంటున్నారు. వారి పని తీరు మెచ్చుకుంటూ, పవన్ కళ్యాణ్ తన సొంత డబ్బులు రూ.50 వేలు బహుమానంగా అందించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ దూడీ, అనంతపురం, తిరుపతి ఫారెస్ట్ కన్జర్వేటర్లు యశోద బాయి, చిత్తూరు డిఎఫ్ఓ సుబ్బురాజు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భారత్‌పై దాడులకోసం పాక్‌లో రహస్య ఆర్మీ!

**న్యూఢిల్లీ, నవంబరు 9:** భారతదేశంలో దశాబ్దాలుగా జరుగుతున్న ఉగ్రవాద కార్యకలాపాల వెనుక పాకిస్థాన్‌కు చెందిన ఇంటర్‌సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ)లోని ఓ రహస్య విభాగం కీలక పాత్ర పోషిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఎస్–1 అనే కోడ్ పేరుతో పనిచేస్తున్న ఈ యూనిట్, 1993 ముంబై వరుస పేలుళ్ల నుంచి ఇటీవల జమ్మూకశ్మీర్‌లోనిపహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడి వరకు అనేక దుశ్చర్యలకు సూత్రధారి అని భారత నిఘా వర్గాలు గుర్తించాయి. నిఘా వర్గాల సమాచారం ప్రకారం, ఎస్1 అంటే సబ్ వెర్షన్ 1. పాకిస్థాన్‌లో సరిహద్దు ఉగ్రవాదాన్ని నడిపించే అతిపెద్ద శక్తి ఇదేనని తెలుస్తోంది. ఈ రహస్య విభాగానికి పాకిస్థాన్ సైన్యానికి చెందిన ఒక కల్నల్ స్థాయి అధికారి నాయకత్వం వహిస్తుండగా, గాజీ 1, గాజీ 2 అనే కోడ్ పేర్లతో ఇద్దరు అధికారులు క్షేత్రస్థాయి ఆపరేషన్లను పర్యవేక్షిస్తున్నారు. ఇస్లామాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ యూనిట్ కార్యకలాపాలకు అవసరమైన నిధులను ఎక్కువగా మాదకద్రవ్యాల విక్రయం ద్వారానే సమకూర్చుకుంటున్నట్లు సమాచారం. ఈ ఎస్1 యూనిట్‌లోని సిబ్బంది అన్ని రకాల బాంబులు, ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌ల (ఐఇడి) తయారీలో నిపుణులు. చిన్నపాటి ఆయుధాలను వాడటంలోనూ వీరికి పూర్తి నైపుణ్యం ఉంది. అంతేకాకుండా, భారతదేశంలోని చాలా ప్రాంతాలకు సంబంధించిన సమగ్రమైన మ్యాప్‌లు వీరి వద్ద ఉన్నాయని నిఘా వర్గాలు భావిస్తున్నాయి.

గత 25యేళ్లుగా ఈవిభాగం చురుగ్గా పనిచేస్తున్నప్పటికీ, దీని పూర్తి కార్యకలాపాల స్వరూపాన్ని భారత భద్రతా ఏజెన్సీలు ఇటీవలే డీకోడ్ చేయగలిగాయి. కేవలం భారత్‌లో దాడులు చేయడమే లక్ష్యంగా పనిచేసే ఎస్–1, పాకిస్థాన్‌లోని జైషే మహమ్మద్, లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి అన్ని ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కలిగిఉంది. ఈ యూనిట్ సిబ్బంది ఉగ్రవాద శిక్షణా శిబిరాల్లో పొడవాటి గడ్డాలు పెంచి, స్థానిక సంప్రదాయ దుస్తులు ధరించి ఉగ్రవాదులతో కలిసిపోతారు. తాము ఎస్–1 విభాగానికి చెందిన వారమన్న విషయాన్ని అత్యంత రహస్యంగా ఉంచుతారు. శిక్షణ తీసుకుంటున్న ఉగ్రవాద గ్రూపులకు కూడా తమ ట్రైనర్లు ఎవరనేది తెలియకుండా జాగ్రత్త పడతారు. గడిచిన రెండు దశాబ్దాల్లో ఎస్1 వేలాది మంది ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చిందని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# పేదల ఇంటివద్దకే వైద్యసేవలు

>> **దృష్టిని ప్రసాదిస్తూ మానవాళికి అద్భుతమైన సేవ..**

మానవ సేవనే మాధవ సేవ అని నమ్ముతుంది కాబట్టే...కంచి పీఠం దేశ వ్యాప్తంగా కంటి ఆస్పత్రులు స్థాపించి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తోంది. జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యులు స్థాపించిన కంచి పీఠం ఆది నుంచి హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడుతోంది. అందులో భాగంగానే ఆది శంకరాచార్యులు దేశంలోని నాలుగు ప్రాంతాల్లో నాలుగు పీఠాలను స్థాపించారు. హిందూ ధర్మాన్ని తిరిగి బలమైన శక్తిగా మలిచారు. 1977లో ప్రారంభమైన శంకర కంటి ఆస్పత్రి సామాన్యులకు సైతం నేత్ర చికిత్సలను అందుబాటులోకి తెచ్చింది. త్వరలో జరిగే స్వర్ణోత్సవ కార్యక్రమానికి నేను హాజరవుతాను. 50 ఏళ్ల వ్యవధిలో దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో 14 ఐ హాస్పిటల్స్ నిర్మించడం సాధారణ విషయం కాదు. ఇప్పటి వరకు 30 లక్షల మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు, 70 లక్షల మంది చిన్నారులకు కంటి పరీక్షలు చేయడం గొప్ప విషయం. దేశవ్యాప్తంగా 2,268 మంది సిబ్బంది పనిచేస్తుండగా 2,576 పడకలు ఉన్నాయి. ఇంత గొప్ప సేవా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న శంకర ఆస్పత్రిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. 2003 నుంచి గుంటూరులోని శంకర కంటి ఆస్పత్రి సేవలు అందిస్తోంది. ఈ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఇప్పటికి 4 లక్షలకు పైగా ఉచిత కంటి శస్త్రచికిత్సలు, 9లక్షల మందికి పరీక్షలు నిర్వహించారు. 300 పడకల సామర్థంతో, రోజుకు 2,500 నుంచి 3,000 వరకు రోగులకు సేవలు అందిస్తున్నారు. శంకర యొక్క గ్రామీణ సేవా ప్రాజెక్ట్ 'గిఫ్ట్ ఆఫ్ విజన్' కింద ఇప్పటివరకు 32,000కు పైగా కంటి శిబిరాలు నిర్వహించడం వారి సేవా గుణానికి నిదర్శనమని సిఎం చంద్రబాబు అన్నారు.

**పేదలకు సేవ చేసే సంస్థలకు ఎల్లప్పుడూ సహకారం..**

జగద్గురు శ్రీఆదిశంకరాచార్య ఆకాంక్షించినట్టు పేదరికంలేని సమాజమేలక్ష్యంగా ముందుకెళ్తున్నాం. రాష్ట్రంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలి. వినూత్నంగా యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తెస్తున్నాం. ప్రతి ఒక్కరికీ రూ. రెండున్నర లక్షల ఆరోగ్య భీమా, ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల వరకు విలువైన వైద్య సేవలు ఈ పాలసీ కింద అందిస్తాం. టాటా సంస్థ సహకారంతో డిజిటల్ నెర్వ్ సెంటర్ 'సంజీవని' కేంద్రాలు త్వరలో రాష్ట్రమంతటా ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ రూపొందిస్తున్నాం. ప్రజల ఆరోగ్యం కాపాడడానికి శంకర కంటి ఆస్పత్రిసేవలను స్వాగతిస్తున్నానని సిఎం చంద్రబాబు తెలిపారు.

**కంచి కామకోటి పీఠం సేవలు అద్వితీయం..**

ఆధ్యాత్మికంగా భక్త జనావళి శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నారు. ధర్మం, జ్ఞానం, సేవ మూల సిద్ధాంతాలుగా శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ పీఠాన్ని కొనసాగిస్తున్నారు. సామాజికంగాను పేదలను, ఆపన్నులను ఆదుకునేందుకు కంచి కామకోటి పీఠం విశేషంగా పని చేస్తోందన్నారు. అంతకుముందు ఆస్పత్రిలోని శంకర ఆస్పత్రిలోని పలు విభాగాలను సిఎం చంద్రబాబు సందర్శించి వాటి వివరాలు తెలుసుకున్నారు. శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీకి సిఎం చంద్రబాబు నాయుడు ముకుళిత హస్తాల నమస్కరించి ఆయన ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం సిఎం చంద్రబాబుకు శాలువా తంజావూరు పెయింటింగ్‌ను ఆస్పత్రి నిర్వాహకులు బహుకరించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్, ఎమ్మెల్యేలు, శంకర ఐ ఫౌండేషన్ ప్రతినిధులు హాజరయ్యారు.

# ధర్మేంద్ర ప్రధాన్‌తో మంత్రి లోకేష్ భేటీ

>> అభినందించారు. బీహార్‌లో మరోమారు ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పాటు కాగలదన్న నమ్మకాన్ని లోకేష్ వ్యక్తంచేశారు. ఇక ఆయన మీడియాతో మాట్లాడుతూ బీహార్ బిజెపి ఎన్నికల ప్రచార బాధ్యతలు చూస్తున్న ధర్మేంద్ర ప్రధాన్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయినట్లు లోకేశ్ తెలిపారు. బీహార్‌లో ఎన్డీఏ కూటమి విజయం కోసం ప్రధాన్ అహరహం శ్రమిస్తున్నారని ఆయన కొనియాడారు. 'గతేడాది జరిగిన హర్యానా, ఒడిశా ఎన్నికల్లో బిజెపి గెలుపులో ప్రధాన్ కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు బీహార్‌లో మరోమారు ఎన్డీఏ సర్కారును గెలిపించేందుకు ఆయన చేస్తున్న నిర్మాణాత్మక కృషిని ఈ సందర్భంగా అభినందించాను" అని లోకేశ్ పేర్కొన్నారు. బీహార్‌లో మరోసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని నారా లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఎన్డీఏ పాలన వైపే మొగ్గు చూపుతున్నారని, ఎన్నికల ఫలితాలు కూటమికి అనుకూలంగా ఉంటాయని విశ్వాసం వ్యక్తం చేశారు. మంత్రి లోకేష్ వెంట ఎంపీలు సానా సతీష్, గంటి హరీష్, కలిశెట్టి అప్పలనాయుడు ఉన్నారు.

## డిసిఎం పవన్ కాన్వాయ్ తగిలి మహిళకు గాయాలు



**పలమనేరు, నవంబరు 9, ప్రభాతవార్త:** చిత్తూరుజిల్లా పలమనేరులో కుంకీ ఏనుగుల శిక్షణకార్యక్రమంలో పాల్గొన్న డిసిఎం పవన్ కల్యాణ్ తిరుగుప్రయాణంలో కాన్వాయ్‌లో కారు ఓ మహిళకు తగిలింది. ఆదివారం ఉదయం ఏకంగా ఆ కారుచక్రం మహిళ కాలుపై వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. పలమనేరు పర్యటనలో అపశృతి చోటుచేసుకుంది. పవన్ తిరుగుప్రయాణంలో ఆయన్ను చూసేందుకు అభిమానులు పెద్దఎత్తున గుమికూడారు. అక్కడ వారినిపోలీసులు అదుపుచేయలేక హేమలత అనే మహిళకు తగిలి కాలుకి బలమైనగాయాలయ్యాయి. సెక్యూరిటీ సిబ్బంది తోసేయడంతో ఆమె కాలు విరిగింది. పలమనేరు ఆస్పత్రిలో ఆమె కాలుకి శస్త్రచికిత్స చేసివైద్యులు చికిత్స అందిస్తున్నారు.

# ఉత్తర్వులు జారీ

>> అంశాలను క్షుణంగా పరిశీలించిన మీద ఎస్ఐ పోస్టులు 26, కానిస్టేబుళ్ల పోస్టులు 291 ఖాళీల భర్తీకి ప్రభుత్వం అనుమతినిస్తూ జీవో జారీ చేసింది. ఇక పోలీసు శాఖ ఈ దిశలో ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టాల్సి ఉంది.

## వారం - వర్జ్యం

10-11-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
షష్ఠి రా. 10.13
పునర్వసు సా. 6.54, విశాఖ కార్తె
వర్జ్యం : రా. 2.44–తె. 4.18
దు.వ. 12.16–1.02
2) మ. 2.33–3.19
రాహుకాలం – ఉ. 7.30–9.00

## వార్తాఫలం

**మేషం :** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది. మిత్రులతో ఏర్పడినమాట పట్టింపులు తీరుతాయి.

**వృషభం:** ఆస్తి వివాదాలు, కోర్టు కేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. కొత్త కార్యక్రమాలు చేపట్టినా సంతృప్తికరంగా సాగవు.

**మిథునం:** ఊహించని విధంగా ఉద్యోగావకాశాలు పొందుతారు వస్తులాభం. ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది.

**కర్కాటకం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి.

**సింహం:** ఋణబాధల నుండి విముక్తి పొందుతారు. ఇంటర్వ్యూలకు హాజరవుతారు. మీ మాటకు పలుకుబడి పెరుగుతుంది.

**కన్య:** దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి. పనులు సకాలంలో పూర్తిచేస్తారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**తుల :** పొదుపు పథకాలు విజయ వంతంగా పూర్తిచేస్తారు. వాహనాలు కొనుగోలు చేస్తారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

**వృశ్చికం:** సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. గృహం కొనుగోలు యత్నాలు చేస్తారు. అనుకోని సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

**ధనుస్సు:** నూతన వ్యాపారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం శ్రేయోదాయకం. పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**మకరం:** రాజకీయ రంగాలలోని వారికి ప్రభుత్వ పరంగా ఆహ్వానాలు అందుతాయి. కొత్త కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా పూర్తి చేస్తారు.

**కుంభం:** ముఖ్య వ్యవహారాలన్ని గౌరవ మర్యాదలకు, ప్రతిష్ఠకు ఎక్కువ విలువను ఇస్తారు. సంఘంలో ప్రత్యేక గుర్తింపు పొందుతారు.

**మీనం:** మీ శత్రు వర్గం యొక్క పురోగతి తాత్కాలికమేనని గుర్తించండి. నమ్మిన వ్యక్తులే సమస్యలు సృష్టించవచ్చు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ముగిసిన జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్9:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ప్రధాన పార్టీలతో పాటు అన్ని రాజకీయ పార్టీల ప్రచారం ఆదివారం సాయంత్రం ముగిసింది. బరిలో ఉన్న అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్దేశించేందుకు ఇక ఓటరు తీర్పే మిగిలి ఉంది. ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు మొత్తం 58 మంది పోటీ పడుతున్న ఈ ఉపఎన్నికల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. సాధారణ ఎన్నికల్లో కంటే ఈ ఉప ఎన్నికలో ఓటింగ్ శాతం పెరుగుతుందని ఎన్నికల సంఘం భావిస్తోంది. ఈనెల 11న జరిగే పోలింగ్ నిర్వహణ కోసం ఎన్నికలఅధికారి ఆర్వీ కర్ణన్ ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు జరిగాయి. కాంగ్రెస్ తరఫున సిఎం ఎ.రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్,డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలంతా విస్తృతంగా ప్రచార చేశారు. బిఆర్ఎస్ నుంచి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు,మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు విస్తృతంగా ప్రచారం చేశారు. బిజెపి నుంచి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు,నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు.

# బీహార్ అభివృద్ధికి యువత ఎన్డీయేను గెలిపించాలి

**గుంటూరు, నవంబరు 9, ప్రభాతవార్త ప్రతినిధి:** వికసిత్ భారత్ లక్ష్యసాధనలో బీహార్ పాత్ర చాలా కీలకమైంది. బీహార్ సర్వతో ముఖాభివృద్ధికి మరోమారు బీహార్ యువత ఎన్డీయేను గెలిపించాల్సిందిగా ఎపి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పాట్నా వెళ్లిన లోకేష్... అక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... నేను ఆంధ్రప్రదేశ్ మంత్రిగా ఇక్కడకు రాలేదు. బాధ్యతాయుతమైన భారతీయుడిగా ఇక్కడకు వచ్చాను. బీహార్‌లో జరగబోయే ఈ ఎన్నిక భారత రాజకీయాల్లో ఎంతో కీలకమైందన్నారు. బీహార్ యువత మరోమారు ఎన్డీయేని ఎందుకు గెలిపించాలో చెప్పడానికే ఇక్కడకు వచ్చానని తెలిపారు. మూడు కారణాలతో ఇక్కడ ప్రజలు ఎన్డీయేని గెలిపించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 2019లో 'ఒక్క ఛాన్స్' పేరుతో వైఎస్సార్సీ ప్రభుత్వానికి అవకాశం ఇవ్వడం వల్ల శాంతిభద్రతలు క్షీణించి పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయాయన్నారు. దానివల్ల మారాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, అటువంటి పరిస్థితులు బీహార్‌లో తెచ్చుకోవద్దని బీహార్ యువతకు విజ్ఞప్తి చేస్తున్నా అని పేర్కొన్నారు.

బీహార్ అభివృద్ధి కోసం ఎన్డీయేను మరోమారు గెలిపించాలని, బీహార్‌లో మూడు కారణాల వల్ల ఎన్డీయేని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. లీడర్ షిప్ ట్రాక్ రికార్డు – స్వచ్ఛమైన, అవినీతిరహిత పాలన కోసం ఎన్డీయేని గెలిపించాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ బీహార్ రూపురేఖలు మార్చేశారని, బీహార్‌లో నాని (నరేంద్ర మోడీ జీ, నితీష్ కుమార్ జీ) నాయకత్వం ఉందన్నారు. ఎపిలో నరేంద్ర మోడీ, నాయుడు నాయకత్వం ఉందని తెలిపారు.

విజన్, సమర్థతతో వారు పాలన చేస్తున్నారని, ప్రధాని మోడీ వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో బీహార్ పాత్ర చాలా పెద్దదని పేర్కొన్నారు. బీహార్ ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే ఆయన లక్ష్యమన్నారు. రెండో విషయానికొస్తే... డబుల్ ఇంజన్ సర్కారు – బీహార్,

## 'ఒక్కఛాన్స్' పేరుతో ఎపి నష్టపోయింది

### బీహార్‌లో అటువంటి పరిస్థితి రావద్దు: మంత్రి లోకేష్

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే భాగస్వామ్య ప్రభుత్వాలు ఉండటం వల్ల కేంద్రబడ్జెట్‌లో భారీగా నిధులు లభిస్తున్నాయని. మౌలిక సదుపాయాలు, విద్యాసంస్థలకు కేంద్రం సహకరిస్తోందన్నారు. అంతేగాక కేంద్రం తీసుకునే విధానపరమైన నిర్ణయాల్లో రాష్ట్రాల్లో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల భాగస్వామ్యం ఉంటుందన్నారు. ఎన్డీయే ప్రభుత్వంలో శాంతిభద్రతలు ఉండటంతో పెద్దఎత్తున అభివృద్ధి సాధించడానికి ఆస్కారమేర్పడుతుంది. చివరగా మూడో కారణం..ప్రభుత్వాల కొనసాగింపు చాలా ముఖ్యమన్నారు. గుజరాత్, ఒడిశా రాష్ట్రాలు ప్రభుత్వాల కొనసాగింపు వల్ల పెద్దఎత్తున అభివృద్ధి సాధించాయని, బీహార్ లో జంగిల్ రాజ్ పాలన పోయి నితీష్ కుమార్ ప్రభుత్వం వచ్చాక శాంతిభద్రతలు బాగుండటంతో పాట్నా ఎంతో అభివృద్ధి సాధించిందని బీహార్ ఇండస్ట్రీ అసోసియేషన్ నాయకులు చెప్పారన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో మా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త నినాదం ప్రకటించారని, అందుకు తగ్గట్టుగానే మైక్రో, స్మాల్, మీడియం పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తు న్నారన్నారు. బీహార్‌లో ఒక పార్టీ ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామని చెబుతోందని, ఆచరణ సాధ్యం కాని హామీలను బీహార్ యువత నమ్మవద్దన్నారు. ఎన్డీయే భాగస్వామిగా చెబుతున్నామని. రాష్ట్రాలు బలంగా ఉంటేనే భారతజాతి బలోపేతమవుతుందన్నారు. ప్రధాని మోడీ బీహార్ రూపురేఖలు మార్చేశారన్నారు. సమావేశంలో బీహార్ స్టేట్ మీడియా విభాగం హెడ్, ఎమ్మెల్సీ సంజయ్ మయూక్, పార్లమెంటు సభ్యులు సానా సతీష్, గంటి హరీష్, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం పెదకాకాని శంకర ఆసుపత్రిలో శ్రీ విజయేంద్ర సరస్వతిస్వామి ఆశీస్సులు తీసుకుంటున్న సిఎం చంద్రబాబు

# ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం!

>> కారిడార్ ఏర్పాటు చేస్తారు. దీనిలో రైల్ ఓవర్ బ్రిడ్జి 99.6 మీటర్లు ఉండనుంది. మొత్తం ప్రాజెక్టులో ఒక మేజర్, ఒక మైనర్ వంతెనలు ఉండనున్నాయి. రెండోచోట్ల వాహనాలకు వీలుగా అండర్‌పాస్‌లు కల్పిస్తారు. ఒకచోట ట్రంపెట్ ఇంటర్ ఛేంజ్ నిర్మించనున్నారు. ఉండవల్లి సమీపంలోని కొండవీటి వాగు లిఫ్ట్ సమీపంలో ప్రారంభమయ్యే ఈ కారడార్ మణిపాల్ ఆస్పత్రి వద్ద 16వ నెంబర్ జాతీయ రహదారితో కలవనుంది. ఈ మేరకు ఆర్వీ అసోసియేట్స్ రూపొందించిన మాస్టర్‌ప్లానులో పొందుపరిచారు.

దీని ప్రకారం ఉండవల్లి సమీపంలోని కొండవీటివాగు లిఫ్ట సమీపంలో ఉన్న గుంటూరు పంపింగ్ స్టేషన్ ట్యాంకు వెనుకభాగం నుండి కారిడార్ ప్రారంభమవుతుంది. ఇక్కడ దీనికి జంక్షన్ ఏర్పాటు చేయనున్నారు. అక్కడ నుండే రెండోవైపు ప్రస్తుతం కొండవీటివాగుకు కృష్ణాపశ్చిమ కాలువ దగ్గర నిర్మించిన గేట్ల పక్కనే మరో స్టీల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. దీనికోసం ఇటీవల పిల్లర్లు కూడా వేశారు. ఈ బ్రిడ్జి కెఎల్‌రావు కాలనీ వైపు పాత జాతీయ రహదారిపై దిగుతుంది. దీనికోసం అక్కడ నివాసాలు ఖాళీ చేయాలని ఇటీవల మున్సిపల్ అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు. కృష్ణా పశ్చిమ కాలువపై ఉండవల్లి వద్దనున్న వంతెన మీదుగా నిర్మాణం జరుగుతుంది. సీతానగరం కొండకు దక్షి ణ భాగానికి ఆనుకుని బోట్‌యార్డు మీదుగా. కొల్‌కతా చెన్నై ట్రంక్‌రైల్వే లైను దాటుకుని కారిడార్‌ను నిర్మించనున్నట్లు మాస్టర్ ప్లానులో చూపించారు. దీనికోసం అక్కడ ఆర్ఓబి నిర్మించనున్నారు. అనంతరం ఎన్‌టిఆర్ కట్టమీదుగా మణిపాల్ ఆస్పత్రి వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై కలుపనున్నారు. దీనికోసం అక్కడ ట్రంపెట్ సర్కిల్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు త్రీఆర్మ్ రోడ్డు నిర్మిస్తారు. దీనిలో ఒకటి విజయవాడ వైపుకు, రెండోది గుంటూరువైపుకు అనుసంధానం చేయనున్నారు.

# రాష్ట్రానికి అతిపెద్ద ఆర్థిక వనరు వ్యవసాయమే: సిఎం చంద్రబాబు

**విజయవాడ నవంబరు 9, ప్రభాతవార్త ప్రతినిధి :** రైతు సంక్షేమానికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సిఎం చంద్రబాబు మీడియాతో నేడు ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ రైతాంగ సంక్షేమం ఇతర అంశాలపై మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు, రాష్ట్రానికి,దేశానికి వ్యవసాయమే అతిపెద్ద ఆర్థిక వనరు అనే విషయం ప్రభుత్వం విస్మరించదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఎప్పుడు అధికారంలో ఉన్నా రైతు సంక్షేమం కోసమే పనిచేస్తుంది. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోంది. రైతుకు ఆదాయం పెరగాలంటే ఖర్చు తగ్గి ఉత్పత్తి పెరగాలి. 2014–2019 మధ్య కాలంలో వ్యవసాయ రంగం జిఎస్‌డిపిలో 16.6 శాతం వృద్ధి రేటు సాధించింది. గత ఐదేళ్ల పాలనలో 10 శాతానికి తగ్గిపోయింది. 2024–25లో 15.45 శాతానికి పెంచాం. గత ప్రభుత్వ అసమర్థ పాలనతో రైతులు రోడ్డున పడ్డారు. రబీలో 48 లక్షల ధాన్యం కొనుగోలుకు రూ. 6 వేల కోట్లు మాత్రమే చెల్లించి రూ. 1,674 కోట్లు బకాయిలు పెట్టారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ బకాయిలు క్లియర్ చేశాం. 2024 -25లో 55 లక్షల 79 వేల టన్నుల ధాన్యాన్ని రూ. 12,857 కోట్లకు కొనుగోలు చేశాం. 8 లక్షల రైతులకు 24 గంటల్లోనే వారి అకౌంట్లకు నగదు జమ చేశాం. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.7 వేలు జమ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం సహకారంతో టెక్నాలజీ వినియోగించి ఇటీవల తుఫాను నష్టాన్ని గణనీయంగా తగ్గించాం. విపత్తుల్లో నష్టపోయిన రైతులకు 2014–19లో హెక్టారుకు రూ. 20 వేలు అందిస్తే గత ప్రభుత్వం దాన్ని రూ. 17 వేలకు తగ్గించింది. ఎన్డీయే ప్రభుత్వం రాగానే రూ. 25 వేలకు పెంచాం. మూడేళ్ల పంటల బీమా సొమ్ము ఎగ్గొట్టినవారు విమర్శలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే 95 శాతం పంట బీమా చెల్లించాం. మామిడికి రూ. 240 కోట్లు అదనంగా గిట్టుబాటు ధర ఇచ్చాం. పొగాకుకు రూ. 273 కోట్లు ఖర్చుచేశాం. కోకోరైతుకు రూ. 14 కోట్లు ఇచ్చాం. కాఫీకి 50 కేజీల చొప్పున ఎకరాకు రూ. 5 వేలు ఇచ్చాం. మిర్చికి రూ. 130 కోట్లు, టమాటాకు రూ. 12 కోట్లు, ఉల్లి దెబ్బ తిన్న చోట హెక్టారుకు రూ. 50 వేల చొప్పున రూ.100 కోట్లు వ్యయం చేశామని ముఖ్యమంత్రి వివరించారు. సమర్థ నీటి నిర్వహణ, ముందస్తు చర్యల వల్ల రిజర్వాయర్లు 95 శాతం నిండాయి. గత ప్రభుత్వంలో రిజర్వాయర్ల గేట్లను కూడా నిర్వహించలేకపోయారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో జలాశయాలను పూర్తిచేశాం. రాయలసీమలో కరువును జయించాం. రైతులు పండించిన పంటకు గిట్టుబాట ధర కల్పిస్తున్నాం. డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ ఇస్తున్నాం. ఎస్సీ,ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీ, మిగిలిన వారికి 50 నుంచి 90 శాతం సబ్సిడీ ఇస్తున్నాం. కౌలు రైతులు అధైర్యపడొద్దు. ఆత్మహత్యలు చేసుకోవద్దు. అన్ని విధాలా ఆదుకుంటాం. మారిన ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల మార్పిడి చేసుకోవాల్సిన అవసరం ఉంది. మనం పండించిన పంటలను కొన్ని దేశాలు దిగుమతి చేసుకోవడానికి ఇష్టపడటం లేదు. అందుకు కారణం రసాయన ఎరువుల వాడకమే. సేంద్రీయ వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు, పంటలకు సేంద్రీయ ఎరువులను మాత్రమే వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు సూచించారు. జాతీయంగా, అంతర్జాతీయంగా ఎక్కువ డిమాండ్ ఉన్న ఉత్పత్తులపై అధ్యయనం చేసి, ఎగుమతులకు అనుగుణంగా ఉన్న పంటలనే సాగు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. పంటల డిమాండును ముందే అంచనావేసి అందుకు అనుగుణంగా సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు ఆదేశాలు జారీచేసామన్నారు. రైతులు ప్రధానంగా కేంద్రం ప్రారంభించిన పూర్వోదయ పథకాన్ని అర్హులైన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని చంద్రబాబు తెలిపారు. ఉండవల్లి నివాసంలో ఉద్యాన పంటలు, మైక్రో ఇరిగేషన్, ఫిషరీస్, ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చంద్రబాబు శనివారం చర్చించారు. పూర్వోదయ మిషన్‌లోభాగంగా వ్యవసాయ అనుబంధరంగాల్లో రూపొందించాల్సిన ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు. ఉత్పత్తులకు విలువ జోడించడం ద్వారా మార్కెట్ పరిధిని విస్తరించాలి. ప్రధాన పంటలతో పాటు అంతరపంటల ద్వారా కూడా రైతుల ఆదాయం రెట్టింపు చేయొచ్చు. మన వాతావరణంలో పండించగలిగే పంటల్ని అధ్యయనంచేసి, వాటిపై రైతులకు అవగాహన కల్పించాలి అని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతి రైతునూ పరిశ్రమలకు అనుసంధానం చేసేలా ప్రణాళికలు రూపొందించే దిశలో కార్యచరణ చేపట్టామన్నారు.. ఈ విధంగా చేసినట్లయితే ఏ విధమైన పంటనష్టం వాటిల్లదని చంద్రబాబు అధికారులకు తెలిపారు. ఈమేరకు ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను ప్రోత్సహించాలని అన్నారు. వీటికి కేంద్రం ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. ఉద్యానరంగ రైతులు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఇలా అందరికీ కలిసొచ్చేలా ఓ వర్క్‌షాప్ నిర్వహించే ఆలోచన జరుగుతుందన్నారు. అన్ని రకాలైన ఉత్పత్తులకు సర్టిఫికేషన్, ట్రేసబులిటీ వచ్చేలా చూడాలన్నారు.,.

రాష్ట్రంలో ఆక్వాకల్చర్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు సీఎం తెలిపారు. ఆక్వా ఉత్పత్తుల సాగు అంతకు రెట్టింపయ్యేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. రైతు సేవాకేంద్రాల పరిధిలో ఏయే పంటలు ఉన్నాయనే విషయాన్ని విశ్లేషించి, రైతులకు అవగాహన కల్పించేలా కేంద్రాల్లోని సిబ్బందిని సన్నద్ధం చేయాలన్నారు.

# 'సర్'పై అధికారులకు శిక్షణ

## రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్

**విజయవాడ,నవంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) – 2026 అమలు కోసం ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు ఎన్నికల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసరు వివేక్ యాదవ్ తెలిపారు. ఆయన అన్ని జిల్లాల అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ప్రధాన ఎన్నికల అధికారి, సాంకేతిక బృందంతో కలిసి 2022 రోల్‌తో 2025 ఓటర్ల మ్యాపింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎపి స్వాన్ నెట్‌వర్క్ ద్వారా ఇఆర్ఓఎస్, ఎఇఆర్ఓఎస్, బిఎల్ఓలు, సూపర్ వైజర్లకు సంబంధిత ఇఆర్ఓ/ఎఇఆర్ఓ కార్యాలయాల నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 11, 12, 13, 14 తేదీల్లో ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. 11న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు, 12న కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, ఎన్‌టిఆర్, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాలకు, 13న గుంటూరు, బాపట్ల,పల్నాడు, ప్రకాశం, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, 14న కర్నూలు, నంద్యాల, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎన్నికల అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. షెడ్యూల్ ప్రకటించిన తేదీల్లో ఆయా ఎన్నికల అధికారులు వారివారి స్థానాల్లో తప్పనిసరిగా వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరుకావాలని వివేక్ తెలిపారు.

10-11Pg3exHMNWJQE 3_10-11Pg3exHMNWJQE.qxd 09/Nov/25 11:07 PM Page 1



# మాజీ పోలీసు అధికారుల చుట్టూ పరకామణి వివాదం!

### నేడు సిఐడి విచారణకు ఇద్దరు సిఐలు, ఒక ఎస్ఐ

### కర్త,కర్మ,క్రియలెవరనేది నేడు వెలుగుచూసే అవకాశం



**తిరుపతి,నవంబరు 9ప్రభాతవార్తప్రతినిధి:** దేవునికి భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించే తిరుమలలోని పరకామణిలో 2023లో విదేశీకరెన్సీ చోరీ కేసు వివాదంలో ఇప్పుడు పూర్వ తిరుమల పోలీస్ అధికారులను సిఐడి విచారణ చేయనుంది. ఈ చోరీ కేసులో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారు,ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తరువాత నిందితుడ్ని అరెస్టుచేయకుండా 41ఎ నోటీస్ ఇచ్చి పంపడం వెనుక ఉన్న కారణాలు ఏంటనే కోణంలో విచారణ సాగనుందనేది తెలుస్తోంది. సాధారణంగా చిన్నదొంగతనం చేస్తేనే నిందితుడ్ని అరెస్ట్చేసి జైలుకు పంపే పోలీసుఅధికారులు ఏకంగా టిటిడి పరకామణిలో 920 అమెరికన్ డాలర్లు చోరీచేసిన కేసులో ఎందుకు ఉదాసీనంగా వ్యవహరించాల్సి వచ్చిందనేది ఇప్పుడు సర్వత్రా అనుమానం వ్యక్తమవుతోంది. దీంతో అప్పట్లో టిటిడిలో ఉన్న ఓ ఉన్నతాధికారి, సివిఎస్ఒ, పరకామణి ఏవిఎస్ఒలతోబాటు గతంలో తిరుమల వన్టౌన్ సిఐగా పనిచేసిన జగన్మోహన్‌రెడ్డి, టూటౌన్ సిఐ చంద్రశేఖర్, ఎస్ఐ లక్ష్మిరెడ్డిలను హైకోర్టు ఆదేశాలతో సిఐడి అధికారులు విచారణకు రావాలని నోటీసులు ఇచ్చారు. నేడు తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి గృహంలో పోలీస్ అధికారులను సిఐడి పలు ప్రశ్నలు సంధించి సమాచారం రాబట్టనుంది. నిందితుడైన సివి రవికుమార్ చోరీచేస్తూ పట్టుబడిన ఉదంతంలో గత ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్ లోక్అదాలత్‌లో కేసు రాజీచేసుకోవడం వెనుక దాగివున్న అసలు కథను ఇప్పుడు గుట్టు విప్పడానికి చూస్తున్నారు. గత రెండురోజుల క్రిందట నిందితుడు సివి రవికుమార్ అతని కుటుంబసభ్యులను సమగ్రంగా సిఐడి చీఫ్ రవిశంకర్‌అయ్యన్నార్, ఎస్పీ,డిఎస్పీల బృందం వేర్వేరుగా విచారణ చేపట్టి అనేక కోణాల్లో సమాధానాలు రాబట్టింది. ఆ సమాధానాలతో ఇప్పుడు పోలీస్ అధికారులను విచారణ చేస్తున్నారు.ఇప్పటికే రవికుమార్ వినియోగించిన సెల్‌ఫోన్‌నంబర్‌పై ,అతని కుటుంబసభ్యుల ఫోన్‌కాల్స్‌పై, వాట్సాప్ ఛాటింగ్‌లు, ఆస్తుల రిజిస్ట్రేషన్ పత్రాల వివరాలు, ఆస్తుల క్రయవిక్రయాలకు సంబంధించిన అన్ని రికార్డులను సిఐడి స్వాధీనం చేసుకుని పరిశీలిస్తోంది. 2023లో హుండీకి సమర్పించుకునే విదేశీ కరెన్సీని రవికుమార్ చేతివాటం చూపి చోరీచేశాడనే కోణంలో గత ఏవిఎస్ఒ ఫిర్యాదుపై నమోదైన 24/2023 ఎఫ్ఐఆర్ కేసును తిరిగి పునర్విచారణ చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. అలాగే పూర్వ ఏవిఎస్ఒ సతీశ్‌కు నోటీసులు పంపి విచారణ చేయడానికి సిఐడి రంగం సిద్ధం చేసుకుంటోంది. 2023మేనెల 20వతేదీ ఛార్జిషీట్ ఫైల్ చేశారు.అయితే ఈ కేసును అప్పటి టిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు, కొందరు పోలీస్ అధికారులు మధ్యవర్తిత్వం జరిపి అదే సంవత్సరం సెప్టెంబర్ 9వతేదీ లోక్‌అదాలత్‌లో 582 కేసుగా విచారణ సాగించి రాజీచేసుకున్నారనేది ,తదనంతరం జరిగిన లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, ఎరవకి ఎంత ముట్టిందనేది ఇప్పుడు సిఐడి నిగ్గుతేల్చాల్సిన విషయం. ఏళ్ళతరబడి పరకామణిలో పనిచేసిన రవికుమార్ ఎంత కాలంగా ఈ తతంతంగం నడిపించాడు, భారీ మొత్తంలో దేవుని సొమ్మును చోరీచేసుకెళ్ళాడనేది రెండవదఫా విచారణలో తేల్చనున్నారు. నేడు పోలీస్ అధికారులను విచారణ చేయనున్న సిఐడి బృందం ఆ తరువాత కేసు రాజీ వెనుక ఉన్న పాత్రధారులు ఎవరనేది, ఏమేరకు చేతులుమారి, ఎందరు లబ్ధిపొందారనేది తేలిపోనుంది. తీగలాగితే డొంక కదలనుందనేది టిటిడి వర్గాల్లో సంచలన చర్చనీయాంశంగా మారింది.

# ఇళ్ల దరఖాస్తులకు గడువు 30 వరకు పొడిగింపు

**విజయవాడ,నవంబరు9,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో సొంతిల్లు లేని పేదలకు శాశ్వత గృహాలను అందించే క్రమంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. అర్హత కలిగిన వారికి ఇళ్ల మంజూరు చేయడానికి వీలుగా దరఖాస్తు గడువును మరింత పొడిగించింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తి ఇళ్లను పూర్తి చేయించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. దీనిలో భాగంగా వీటికి అదనపు సాయం ప్రకటించింది. మరోవైపు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద ఆసక్తి, అర్హత కలిగిన వారికి ఇళ్లను మంజూరు చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. దీనికి తొలుత కేంద్రం ఈనెల 5 వరకు మాత్రమే గడువు ఇచ్చింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ కోరిక మేరకు నెలాఖరు వరకు పొడిగించింది. తద్వారా మరో మూడు వారాలపాటు దరఖాస్తుకు అవకాశం ఉంది. దీనివల్ల మరింత మందికి మేలు జరగనుంది.

ఈ పథకంలో అర్బన్, మున్సిపాలిటీ ప్రాంతాల్లో ఉన్న వారికి కేంద్రం తోపాటు, రాష్ట్రం కలిపి రూ. 2.89 లక్షలవరకు ఇస్తున్నాయి. ఇందులో ఉపాధి హామీ, స్వచ్ఛ భారత్ నిధులు కలిపి ఉన్నాయి. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారికి కేవలం రూ. 1.59 లక్షలు మాత్రమే వస్తుంది. పీఎంఏవై ద్వారా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం చేసుకోడానికి సిద్ధంగా ఉన్నవారి వివరాలను యాప్‌లో నమోదు చేయిస్తున్నారు.ప్రభుత్వం గడువు పెంచడంతో అర్హులైన వారందరికీ మేలు జరుగుతుంది. ఇది కాకుండా గ్రామీణ పరిధి కింద ఇళ్లు నిర్మించుకోడానికి 298 మంది సిద్ధంగా ఉన్నారు. యూడీఏ కింద దరఖాస్తు చేసుకున్నవారికి అనుమతులు రావాల్సి ఉంది. అర్హత కలిగి ఉన్న ఎవరన్నా పీఎంఏవైను సద్వినియోగం చేసుకోవచ్చు. ఎలాంటి పరిమితులు లేవు. అవకాశం సద్వినియోగం చేసుకోవాలి.

దరఖాస్తులను గృహ నిర్మాణ సంస్థ, సచివాలయాల్లో అందించవలసి ఉంటుందని అధికారులు తెలిపారు. ఇళ్లు లేని పేదలు సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను కలిసి అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. సొంత స్థలంలో ఇంటి పట్టా తీసుకుని ఉండాలి. లేదంటే ఈనెలాఖరులోపు అందించేలా ఉండాలి. నివాస స్థలంలో లబ్ధిదారు ఫొటో తీసుకోవాల్సి ఉంటుంది. ఇళ్లు లేనట్లు, ఉన్నట్లయితే పాడైపోయిన ఇంటి ఫొటో జత చేయాల్సి ఉంటుంది. వ్యక్తిగత వివరాల కింద పేరు, లింగం, ఆధార్ కార్డు నంబర్, చరవాణి నంబరును పూరించాలి. బ్యాంక్ ఖాతా నంబర్, పేరు నమోదు.

నరేగా జాబ్ కార్డు నంబరు వివరాలు అందించాలి. ఆధార్ నంబర్‌ను ఉపయోగించే అధికారం ఇవ్వడానికి సమ్మతి పత్రం అప్‌లోడ్ చేయాలి. పీఎంఏవై ఐడీ, ప్రాధాన్యత ఎంపికను ఉపయోగించాలి. ఆపై నమోదు చేసుకోవడానికి ఎంచుకోండి అనే ఐచ్ఛికం వద్ద క్లిక్ చేయడం. ఈ ప్రక్రియను ఇంజినీరింగ్ అసిస్టెంట్ ద్వారా పూర్తి చేసుకునే సౌలభ్యం ఉంటుంది.

# ఆరోగ్య ఆంధ్రా సాకారానికి ప్రభుత్వం కృషి

### ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ: రక్త నాళాల జబ్బులపై అవగాహన అవసరం




వాస్క్యులర్ వాక్‌థాన్ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ, నవంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంతో ఆరోగ్య, సుసంపన్న, ఆనంద ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, వ్యాధులు గురించి, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటే ఆనందంగా స్వర్ణాంధ్రను సాధించవచ్చని తెలిపారు. వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వాస్క్యులర్ వాక్ థాన్ ను ఆదివారం నగరంలో నిర్వహించారు. విజయవాడ గవర్నర్ పేట ఐఎంఏ హాల్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిధిగా విచ్చేసారు. వాక్ థాన్ ను ప్రారంభించారు. ఈ వాక్ బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వరకు అక్కడి నుంచి తిరిగి ఐఎంఏ హాల్ వరకు సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాస్క్యులర్ వ్యాధులు, సర్జరీలు గురించి అవ గాహన కల్పించేందుకు వాక్ థాన్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. వాస్క్యులర్ వ్యా ధుల పట్ల నిరక్ష్యం వహిస్తే కలిగే ఇబ్బందులు గురించి వాక్ థాన్ ద్వారా వివరిస్తున్నారని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పిస్తే వారు జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ప్రతి ఒక్కరు దీని గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రముఖ వ్యాస్కులర్ సర్జన్ డాక్టర్ కిరణ్ మాకినేని మాట్లాడుతూ వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా లో 800 మంది వరకు సభ్యులు ఉన్నారని చెప్పారు. నేడు దేశవ్యాప్తంగా 22 ప్రాంతాల్లో అంప్యూటేషన్ ఫ్రీ ఇండియా నినాదంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వాక్ థాన్ ను నిర్వహించినట్లు తెలిపారు. వందలో ఎనభై అంప్యూటేషన్ లు మనం మందులు వాడటం, జాగ్రత్తలు పాటించడం, రక్తనాళాలకు చికిత్స చేయడం ద్వారా నివారించవచ్చని అన్నారు. మధుమేహం ఉన్నవారిలో స్పర్శ తగ్గుతుందని, రక్త ప్రసరణ కూడా తగ్గవచ్చని తెలిపారు. న్యూరోపతి, వాస్క్యులోపతి, డయాబెటిస్ ఉంటె కాలు పోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. వీరు వైద్యుల సలహా మేరకు నడుచుకుంటే ఆ ప్రమాదం నుంచి బయటపడొచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాస్కులర్ సర్జన్ లు, వైద్యులు,

# సెకండరీ ఆస్పత్రులకు 227మంది స్పెషలిస్ట్ వైద్యులు: మంత్రి సత్యకుమార్ యాదవ్

**సచివాలయం,నవంబరు 9,ప్రభాతవార్త:** అవసరాల మేరకు 142ఆస్పత్రుల్లో ఇన్ సర్వీసు పిజీ వైద్యుల పోస్టింగ్‌లు 35మంది చొప్పున గైనకాలజిస్టులు,జనరల్ మెడిసిన్ వైద్యులను నియమించినట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.ప్రభుత్వ వైద్య సేవల్ని అందించడంలో కీలకపాత్ర వహించే సెకండరీ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరత తీర్చే విధంగా 227మంది పిజి పూర్తి చేసిన వైద్యులు విధుల్లోకి రానున్నట్లు తెలిపారు. ఆస్పత్రులు,సబ్జెక్టుల వారీగా ఈ తాజా పోస్టింగ్ వివరాలను సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధర్ బాబు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వివరించారు.అదనంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు 155మంది స్పెషలిస్టులు, 100 పిహెచ్‌సిల్లో 155మంది స్పెషలిస్టు వైద్యులు త్వరలో విధుల్లో చేరనున్నారు. 33ఏరియా ఆస్పత్రుల్లో 60మంది,7జిల్లా ఆస్పత్రుల్లో 10మంది,2ఎంసిహెచ్ ఆస్పత్రుల్లో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులకు కౌన్సిలింగ్ ద్వారా పోస్టింగ్ లిచ్చారు. మొత్తం 227మందిలో 35మంది చొప్పున గైనకాలజిస్టులు,జనరల్ మెడిసిన్ స్పెషలిస్టులు,30మంది జనరల్ సర్జరీ వైద్యులు, 26మంది మత్తు వైద్యులు,25మంది పిల్లల వైద్యనిపుణులు,18మంది ఎముకల వైద్యులు, 17మంది రేడియాలజిస్టులు,15మంది కంటి వైద్య నిపుణులు,9మంది ఇన్ఎన్‌టి స్పెషలిస్టులు సెకండరీ ఆసుపత్రుల్లో సేవలందించనున్నారు. సెకండరీ ఆసుపత్రుల్లో స్పెషలిస్టుల కొరత తీర్చే దిశగా జరిగిన పోస్టింగ్‌ల పట్ల మంత్రి సత్యకు మార్ యాదవ్ హర్షాన్ని వ్యక్తం చేశారు.మొత్తం 243సెకండరీ ఆస్పత్రులుండగా 142ఆస్పత్రుల్లో 227మంది స్పెషలిస్టులు నియమితుల య్యారు.వీరిలో పిల్లల వైద్యులు, రేడియాల జిస్టు, చర్మవ్యాధి నిపుణుడు, పాథా లజిస్ట్ ఉన్నారు.7పిహెచ్‌సీలు, 6ఏరియా ఆస్పత్రుల్లో ముగ్గురు చొప్పున స్పెషలిస్టుల్ని నియమించారు. 31సిహెచ్‌సిలకు ఇద్దరు చొప్పున మరో 13ఏరియా ఆస్పత్రులకు ఇద్దరేసి,2జిల్లా ఆస్పత్రు లకు ఇద్దరు చొప్పున స్పెషలిస్టులను నియమించడం జరిగింది.

మరో 97ఆస్పత్రులకు ఒక్కరేసి నిపుణులను కేటాయించారు. 2022- 23ఇన్ సర్వీసు డాక్టర్లుగా వివిధ పిజీ కోర్సుల్లో చేరిన మొత్తం 257మంది పిహెచ్‌సి డాక్టర్లు తాజాగా పిజీ కోర్సుల్ని పూర్తి చేయగా వారిలో 227మందిని సెకండరీ ఆస్పత్రుల్లో నియమించారు.తగు ఖాళీలు లేనందున మిగిలిన 30మందిని డిఎంఈ ఆస్పత్రుల్లో ట్యూటర్లుగా నియమించబడ్డారు.

# ఒకరికి కొడుకు..మరొకరికి తండ్రి

### విద్యుదాఘాతంతో రెండు కుటుంబాల్లో విషాదం

### ఇరగవరం మండలంలో అలముకున్న విషాదఛాయలు

**తణుకు, నవంబరు 9 ప్రభాతవార్త:** ఆ ఇంటికి ఉన్న ఎకైక వారసుడు, చేతికి అంది వచ్చాడు. ఆసరాగా ఉంటాడనుకుంటున్న తరుణంలో ఆ కొడుకు చనిపోయాడనే చేదువార్త ఒక కుటుంబాన్ని విషాదంతో నింపింది. వివరాల్లోకి వెళితే ఇరగవరం మండలం పేకేరు గ్రామానికి చెందిన కరిపెద్ది సింహాద్రి అప్పన్న (53) వరికోత యంత్రాలతో ఆయా ప్రాంతాలకు తిరుగుతూ కోతలు కోయిస్తూ జీవనంసాగిస్తుంటారు. అయితే అదే మండలానికి చెందిన గెద్దం సందీప్ (20) గత కొద్ది నెలల నుంచి సింహాద్రి వద్ద వరికోత యంత్ర డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో కాకినాడజిల్లా పరిసర ప్రాంతాల్లో కోతలు కోసేందుకు ఐసర్ వ్యాన్ పై కోత యంత్రం వేసుకొని ఆదివారం బయలుదేరారు. ఈ క్రమంలో గండేపల్లి మండలం రామయ్యపాలెం వద్ద వాహనానికి విద్యుత్తు తీగలు అడ్డువస్తున్నాయని వాటిని తప్పించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే సింహాద్రి అప్పన్న, సందీప్ మృతిచెందారు. రాపాకకు చెందిన గెద్దం సందీప్‌కు నాన్న లాజరు, అమ్మ ప్రేమలత. ఉన్నారు. నాన్న స్థానికంగా వ్యవసాయం పనులు చేసే స్తుండగా, అమ్మ ఉపాధి నిమిత్తం గల్ఫ్ ప్రాంతం వెళ్లారు. సందీప్‌కు ఇద్దరు అక్కలు పెద్ద అక్కకు వివాహం కాగా, రెండో అక్క డిగ్రీ చదువుతున్నారు. సందీప్ పదో తరగతి అనంతరం చదువు నిలిపివేసి డ్రైవర్‌గా చేరారు. కరిపెద్ది సింహాద్రి అప్పన్నకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు వీరస్వామి, వెంకటరమణ ఉన్నారు. పెద్ద కుమారుడు ఇటీవల అమెరికాకు వెళ్లేందుకు సిద్ధపడుతుండగా, చిన్న కుమారుడు వెంకటరమణ బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నారు.

**శోకసంద్రంలో గ్రామాలు:**

ఒకరు కొడుకును, మరొకరు తండ్రిని కోల్పోయిన ఆ కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉన్న ఒక్కగానొక్క వారసుడు తమను విడిచి వెళ్లిపోతే మా కష్టార్జితం ఎవరికంటూ తన తండ్రి, మరో పక్క గల్ఫ్ లో ఉన్న తల్లి గుండెలు బాదుకుంటున్నారు.

అస్తమాను తిట్టుకుంటూ, కొట్టుకుంటూ ఇద్దరు అక్కల ముద్దుల తమ్ముడు ఇకలేడు అనే వార్త వినగానే గుండెలు బాదుకుంటూ నువ్వు మమ్మల్ని విడిచి ఎక్కడికి వెళ్లిపోయావురా, మేము ఎవరితో గొడవపడాలి అంటూ గుండెలు పగిలేలా రోధిస్తున్న వారిని చూసి గ్రామస్తులు కన్నీటిపర్యాంతమయ్యారు. మరో పక్క చేతికొచ్చిన కొడుకులు దగ్గరుండి పెళ్లిచేయాల్సిన తండ్రి వెళ్లిపోతే ఎవరు పట్టించుకుంటారు మమ్మల్ని అంటూ ఆ కుటుంబికులు రోధిస్తున్నారు.

# తిరుమల సమాచారం



## తిరుమలలో అధునాతన కొత్త వంటశాల

### నిర్మాణానికి ముందుకు వచ్చిన ముఖేశ్ అంబానీ

**తిరుమల,నవంబరు 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చే భక్తులు ఆకలి అనేది తెలియకుండా రుచిగా,శుచిగా అన్నప్రసాదాలు అందించే తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో అధునాతన కొత్తవంటశాల నిర్మించేందుకు టిటిడి ప్రణాళికలు సిద్ధంచేసింది. ఇందుకు అవసరమైన సహాయసహకారాలను రిలయన్స్‌సంస్థ అధినేత ముఖేశ్‌అంబానీ అందించేందుకు ముందుకు వచ్చారు. ఆ దేవదేవుడు శ్రీవారి దివ్యఆశీస్సులతో అత్యున్నత ప్రమాణాలతో కూడిన వంటశాల నిర్మించనున్నట్లు ప్రకటించారు.ఈ కొత్త వంటశాల అధునాతన ఆటోమేషన్‌ను కలిగి ఉంటుందని తెలిపారు. ఆదివారం వేకువజామున తిరుమలకు వచ్చిన ముఖేశ్‌అంబానీ ఆ సంస్థ ప్రతినిధులతో కలసి సుప్రభాతసేవలో పాల్గొన్నారు. ఆలయం ముందు అంబానీతో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి కొత్త అధునాతన వంటశాల నిర్మాణం విషయంగా చర్చించారు. వెంటనే అంబానీ అందుకు సానుకూలంగా ప్రకటన చేశారు. ప్రతిరోజూ లక్షలాదిమంది భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తున్న అన్నప్రసాద ట్రస్ట్ తరపున అధునాతన వంటశాలను నిర్మించేందుకు సహకారంఅందిస్తానని వెల్లడించారు. టిటిడితో కలసి ఈ నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. టిటిడి భాగస్వామ్యంతోబాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంపూర్ణ సహకారంతో చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ రెండు లక్షలమందికి పైగా భక్తులకు అన్నప్రసాదాలను మరింత నాణ్యతగా రుచిగా తయారుచేసే అందించే సామర్థ్యం ఉండేలా నూతన వంటశాల రానుంది. ప్రతి భక్తు డికి అత్యంత భక్తి ,పరిశుభ్రతతో తయారయ్యే అన్నప్రసాదాలను అందుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న టిటిడి ఆలయాల్లో అన్నప్రసాదాలను అందించాలనే ఆలోచనను ముఖేశ్‌అంబానీ సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటికే వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో వంటశాలను, వంట పాత్రలను టిటిడి బోర్డు, అధికారులు మార్పుచేసి అధునాతనవి ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

## పార్వేటమండపంలో మలయప్ప ఉత్సవర్లకు విశేషస్నపనం

### వైభవంగా కార్తీక వనభోజనం



**తిరుమల,నవంబరు 9ప్రభాతవార్తప్రతినిధి:** కార్తీకమాసంలో దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి కార్తీకవనభోజనానికి పాపవినాశనం మార్గంలోని పార్వేటమండపం విచ్చేశారు. ఆదివారం ఉదయం ఆలయంలో కైంకర్యాలు ముగిసిన తరువాత ఆలయ అర్చకులు, అధికారులు శ్రీదేవి భూదేవిసమేత మలయప్పస్వామిని బంగారుతిరుచ్చిపై ఆలయం నుండి పార్వేటమండపంకు మంగళవాయిద్యాల నడుమ వేంచేపుచేశారు. అక్కడ ఉత్సవర్లకు విశేష పవిత్ర జలాలతో నీరు,చందనం,కొబ్బరిజలం,పాలు,పెరుగు,తేనె, సుగంధద్రవ్యాలతో అభిషేకం చేశారు. ధూపదీపకర్పూర హారతులిచ్చారు. అనంతరం అక్కడ భక్తులకు కార్తీకవనంలో వనభోజనాలు వడ్డించారు. 16వ శతాబ్ధంలో ఈ వనభోజనం చేపట్టిన టిటిడి ఆ తరువాత 2010వ సంవత్సరం నుండి ఈ కార్యక్రమాన్ని టిటిడి పునరుద్ధరించింది. భక్తులు వేలాదిమంది పాల్గొని భోజనం స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో పెద్దజీయ్యం, చిన్నజీయ్యం,టిటిడి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం,ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారు పత్తేదార్ హిమత్‌గిరి, నాయక్, అర్చకులు పాల్గొన్నారు.

# హిందాల్కో ఏర్పాటుతో యాపిల్ గ్లోబల్ సప్లై చైన్ లోకి ఏపి: మంత్రి లోకేష్

### వేగవంతమైన అనుమతులతోనే ఈ ఘనత

**విజయవాడ,నవంబరు 9,పభాతవార్త ప్రతినిధి:** ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన హిందాల్కో ఇండస్ట్రీట్ రాష్ట్రానికి రావడం మన ఎలక్ట్రానిక్స్ ఎకో సిస్టంలో కీలక మలుపని విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. యాపిల్ గ్లోబల్ సప్లై చైన్‌లో ఏపీ భాగస్వామి కానుందని తెలిపారు. కుప్పంలో రూ.586 కోట్ల పెట్టుబడితో అత్యాధునిక అల్యూమినియం ఎక్స్‌ట్రూజన్ ప్లాంట్ ఏర్పాటుతో 613 మందికి ప్రత్యక్షంగా, మరెందరికో పరోక్షంగా,ఉద్యోగాలు,ఉపాధి లభించనున్నాయని ఎక్స్ వేదికగా వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు ఇస్తున్న వేగవంతమైన అనుతమతులు,ప్రోత్సాహాల కారణంగానే ఇది సాధ్యమైందన్నారు. బెంగుళూరుకు 120 కి.మీ. చెన్నైకి 200 కి.మీ దూరంలో వ్యూహాత్మక స్థానంలో కుప్పం ఉంది. భవిష్యత్తులో స్మార్ట్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ స్మార్ట్‌ఫోన్లు,ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీలో గ్లోబల్ తయారీ కేంద్రంగా మారనుంది. 2027మార్చి నాటికి ఈ యూనిట్ నుంచి పూర్తి స్థాయి కార్యకలాపాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

## శ్రీవారి దివ్యఆశీస్సులందరిపై ఉండాలి

### సుప్రభాతసేవలో రిలయన్స్ చీఫ్ ముఖేశ్ అంబానీ



**తిరుమల,నవంబరు 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రిలయన్స్‌సంస్థ చీఫ్ ముఖేశ్‌అంబానీ ఆకాంక్షించారు.దేవుని నామస్మరణ జరిగే ప్రతిచోట భక్తి వెల్లివిరుస్తుందని, భక్తులు భగవంతుని ఆశీస్సులతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని తెలిపారు. ఆదివారం వేకువజామున ముఖేశ్‌అంబానీ ,ఆ సంస్థ ప్రతినిధులతో కలసి ఆలయం వద్దకు విచ్చేశారు. మహద్వారం వద్ద టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వాగతం పలికారు. ఆలయం లోపల ధ్వజస్తంభానికి నమస్కరించిన అంబానీ ఆనందనిలయంలో శ్రీవారి సుప్రభాతసేవలో పాల్గొన్నారు.మొక్కులు చెల్లించుకున్నారు .రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. అదనపు ఇఒ వెంకయ్య చౌదరి అర్చకులు శ్రీవారి శేషవస్త్రం కప్పి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమలలో ఆద్యంతం భక్తిభావంతోనే గడిపారు.

# శాస్త్రోక్తంగా లక్షబిల్వార్చన



**తిరుమల,నవంబరు 9ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన కార్తీకమాసంలో టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కపిలేశ్వర ఆలయంలో ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా లక్షబిల్వార్చన నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం సుప్రభాతంతో మేల్కొలిపిన స్వామివారిని అభిషేకం, అర్చన నిర్వహించారు. అలంకారం తరువాత ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు బిల్వార్చన అర్చకులు జరిపించారు. ఇందులో లక్షబిల్వపత్రాలతో స్వామివారిని అర్చించారు. సాయంత్రం చంద్రశేఖరస్వామి ఉత్సవమూర్తులు ఆలయ పురవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.



# కూటమి సర్కార్ చెప్పిందేమిటి? చేస్తున్నదేమిటి?

### మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఫైర్

**హైదరాబాద్, నవంబరు 9,ప్రభాతవార్త:** అసలు ఏపీలో పరిపాలన జరుగుతుందా? అంటూ కూటమి సర్కార్ వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఫైర్ అయ్యారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి సర్కార్ ఉద్యోగులను మోసం చేసిందని మండిపడ్డారు. మెరుగైన పీఆర్సీ ఇస్తామని, ఉద్యోగులకు ఐఆర్ ఇసామన్న హామీని గాలికి వదిలేసిందన్నారు. ఏడాదిన్నర గడిచినా ముఖ్యమంత్రి చంద్రబాబు పీఆర్సీ ఊసు ఎత్తడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో 2023లో 12వ పీఆర్సీ ఏర్పాటు చేశామని ఉద్యోగులకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం జీపీఎస్‌ను తీసుకొచ్చిందన్నారు. అసలు కూటమి సర్కార్ చెప్పిందేమిటి? చేస్తున్నదేమిటి? అని ప్రశ్నించారు. 2024 నుంచి గ్యాట్యుటీ, మెడికల్ బిల్లులు పెండింగ్లో ఉన్నాయని . ఇప్పుడు ఉద్యోగులకు ఓపీఎస్ లేదు, జీపీఎస్ లేదు. నో పీఎస్ అయ్యిందన్నారు. ఐదో తేదీ వచ్చినా ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదని జనవరి నుంచి పోలీసులకు టీఏ పెండింగ్లో ఉంది అంటూ బుగ్గన రాజేంద్రనాథ్ మండిపడ్డారు.

# తెలుగు రాష్ట్రాల నుంచి శబరిమలైకి ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, నవంబరు 9, ప్రభాతవార్త:** కేరళలోని శబరిమలైలో వెలసిన అయ్యప్ప స్వాముల వారి దర్శనానికి వెళ్ళే భక్తాదుల సౌకర్యార్థం రైల్వేశాఖ ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

**వయా:గూడూరు, రేణిగుంట మీదుగా తిరిగే రైళ్ళు:**

**..బందరుకొల్లాంబందరు ప్రత్యేక రైళ్ళు:** మచిలీపట్నం నుంచి కొల్లాం వెళ్ళే నంబర్ 07101 ప్రత్యేక రైలు ఈనెల 14 నుంచి జనవరి 02 వరకు ప్రతి శుక్రవారం సాయంత్రం 04:30 గంటలకు మచిలీపట్నం నుంచి బయలుదేరి శనివారం రాత్రి 10:00 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో కొల్లాం నుంచి మచిలీపట్నం వెళ్ళే నంబర్ 07102 రైలు ఈనెల 16 నుంచి జనవరి 04 వరకు ప్రతి ఆదివారం తెల్లవారు జామున 02:30 గంటలకు కొల్లాం నుంచి బయలుదేరి మంగళవారం ఉదయం 08:00 గంటలకు మచిలీపట్నం చేరుకుంటుంది. నర్సాపూర్ నుంచి కొల్లాం వెళ్ళే నంబర్ 07105 రైలు ఈనెల 16 నుంచి జనవరి 18 వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నాం 03:00 గంటలకు నర్సాపూర్ నుంచి బయలుదేరి మరుసటిరోజు రాత్రి 10:00 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాం నుంచి నర్సాపూర్ వెళ్ళే నంబర్ 07106 రైలు ఈనెల 18 నుంచి జనవరి 20 వరకు ప్రతి మంగళవారం తెల్లవారు జామున 02:30 గంటలకు కొల్లాం నుంచి బయలుదేరి గురువారం ఉదయం 07:00 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది.

**కాకినాడ టౌన్‌కొట్టయాం ప్రత్యేక రైళ్ళు:** కాకినాడ టౌన్ నుంచి కొట్టయాం వెళ్ళే నంబర్ 07109 రైలు ఈనెల 17 నుంచి జనవరి 19 వరకు ప్రతి సోమవారం కాకినాడ టౌన్ నుంచి బయలు దేరుతుంది.

తిరుగుప్రయాణంలో కొట్టయాం నుంచి కాకినాడ టౌన్ కు వెళ్ళే నంబర్ 07110 రైలు ఈనెల 18 నుంచి జనవరి 20 వరకు ప్రతి మంగళవారం కొట్టయాం నుంచి బయలుదేరుతుంది.

**చర్లపల్లికొల్లాం ప్రత్యేక రైళ్ళు:** చర్లపల్లి నుంచి కొల్లాం వెళ్ళే నంబర్ 07107 రైలు ఈనెల 17 నుంచి జనవరి 19 వరకు ప్రతి సోమవారం చర్లపల్లి నుంచి బయలుదేరుతుంది. తిరుగుప్రయాణంలో కొల్లాం నుంచి చర్లపల్లి వెళ్ళే నంబర్ 07108 రైలు కొల్లాం నుంచి ప్రతి బుధవారం బయలు దేరుతుంది.

వార్త

జీవితాన్ని చక్కగా ఉపయోగించుకోవాలనుకునే వారు వృద్ధుల అనుభవం యువకులుగా ఉన్నప్పుడే అలవర్చుకోవాలి.

-విష్లార్స్

# పత్తి రైతులకు దిక్కెవరు?

ఉలవ చేను పెట్టినాయన ఊరకే ఉండక పత్తి సాగు చేసి ప్రాణం మీదకు తెచ్చుకున్నాడన్న సామెత తెలుగునాట విరివిగా వాడుతుంటారు. పత్తి వ్యవసాయానికి ఈ సామెత అక్షరాలా కుదురుతుంది. పత్తి కష్టాలు ఈ నాటివి కావు. నిన్నమొన్నటి భారీ వర్షాలైనా, అతి భారీ వర్షాలైనా, మొంథా తుఫానైనా పత్తి సాగుకు కష్టాలు తెచ్చిపెట్టాయి. పంట నీట తడిసి తేమతో నిండిపోయింది. వరుణుడి స్పర్శను ఎవరూ తప్పించుకోలేరు. ఏదోచేయాలని చూస్తే ఏదో అయ్యిందన్న చందాన కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 'కపాస్ కిసాన్ మొబైల్‌యాప్'ను రాష్ట్ర సిఎం యాప్‌తో అనుసంధానం చేయడంతో కొత్త చిక్కొచ్చి పడింది. నిన్న మొన్నటి మొంథా తుఫానుతో పత్తి రైతు దిగాలు పడినా ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశగా చూస్తున్న సమయంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి షరతులు మరింత బాధిస్తున్నాయి. వర్షప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాలలో పత్తి రైతులు భారీగా నష్టపోయారు. చేతికందిన పంట నీటి పాలై పెట్టుబడులు కూడా రాని పరిస్థితులున్నాయి. అయినా ఏదో దేవులాట. ఆంధ్రప్రదేశ్‌లో 2020-2025 ఖరీఫ్ సీజన్‌లో 4.5 లక్షల హెక్టార్లలో పత్తిసాగు జరిగింది. సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా. పత్తి పంట దెబ్బతినడంతో రైతులు కనీస మద్దతు ధరకన్నా తక్కువ ధరకే పత్తి అమ్ముకుంటున్నారు. ఈ సందర్భంగానే కపాస్ కిసాన్ యాప్‌ను కేంద్రం ముందుకు తెచ్చింది. కానీ ఇందులో బాగా తిరకాసు ఉండటం వలన 'తేమ' శాతం విషయంలో రైతులు బంబేలెత్తుతున్నారు. సిఎం యాప్, ఆధార్ ఆధారిత ఈ పంట వ్యవస్థ ద్వారా పత్తి కొనుగోళ్ల పూర్తి డిజిటలైజ్డ్ చేయబడిన విధానంలో నిర్వహిస్తున్నట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించింది. 2025-26లో పత్తి మార్కెటింగ్ సీజన్‌లో సమీపంలోని కొనుగోలు కేంద్రంలో స్లాట్ తమ ఉత్పత్తులను అమ్ముకోవచ్చునని ప్రత్యేకించి వార్తా పత్రికల్లోను ప్రకటనవచ్చింది. తెలంగాణలో రైతుల బీమా రికార్డులను డిజిటలైజ్ చేసినందున స్లాట్ బుకింగ్‌కు ముందే వారి రిజిస్ట్రేషన్‌ను తనిఖీ చేసుకోవాలని కోరింది. ఇంతవరకు బాగానే ఉంది. ఇందులో ఉదహరించిన తేమ శాతంలోనే రైతులకు అభ్యంతరాలున్నాయి. తేమ శాతం 8 శాతం మించకపోతే నాణ్యతా ప్రమాణాల ప్రకారం రైతుకు కనీస మద్దతు ధర చెల్లించగలమని సిసిఐ ప్రకటించింది. కొన్ని సడలింపులు కూడా భారీ స్థాయిలోనే ఉంటాయని భావించి రైతు కొనుగోలు కేంద్రాలకు చేరాక ఒక్కొక్కటిగా తెలిసి తమ పత్తి ఉత్పత్తులను ఇక్కడ అమ్ముకోవడం నష్టమనే భావనతో ఉన్నారు. తీరా కేంద్రంలో ఆరా తీస్తే తేమ శాతం 8శాతం మించి 12 శాతానికి చేరుకుంటే, 8 శాతం కంటే ఎక్కువ తేమ శాతం నిష్పత్తిలో మొత్తాన్ని కనీస మద్దతుధరలో తగ్గించి మాత్రమే చెల్లిస్తారని స్పష్టంగా పేర్కొంది. అంతేగాక అధిక తేమ కారణంగా తగ్గింపులు, కోతలు లేకుండా ఉండాలంటే పత్తిని ఆరుదల తర్వాతనే కేంద్రానికి తీసుకురావాలని పత్తి రైతులకు సిసిఐ విజ్ఞప్తి చేసింది. ఈ విధంగా పత్తి ఉత్పత్తులకు తేమ శాతం లింకులన్నీ బయటపెట్టారు. సిసిఐ వైఖరికి నిరసనగా గత రెండు రోజుల పాటు సిసిఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లను నిరవధికంగా నిలిపివేయాలని రాష్ట్ర కాటన్ మిల్లర్ల వ్యాపారుల సంక్షేమ సంఘం పిలుపునిచ్చింది. నిజానికి సిసిఐ దేశవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకే తెచ్చినట్లు చెబుతున్న నిబంధనలు జిన్నింగ్ మిల్లుల యాజమానులకు ఏమాత్రం నచ్చినట్లు లేదు. వారే సమ్మెకు పిలుపునిచ్చారు. తెలంగాణలో గత యేడాది వానాకాలం సీజన్‌లో 25 లక్షల మంది రైతులు 43లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేస్తే 21 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సిసిఐ మద్దతు ధరకు కొనుగోలు చేయగలిగింది. అదే సమయంలో జిన్నింగ్ మిల్లులు యాజమానులు, దళార్లు రైతుల ఆధార్ కార్డులు, పాస్ పుస్తకాల జిరాక్స్‌లను తీసి తమవద్దే ఉంచుకొని వారి నుంచి అతి తక్కువ ధరకు ఆ పత్తిని కొనుగోలు చేశారు. తిరిగి ఆ సరుకును నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లులకు తోలి మద్దతు ధరకు అమ్మేశారు. దళారులు ఇలా తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు అమ్ముకుని లాభాల నార్జించారు. ఈ విషయాన్ని గుర్తించినందునే సిసిఐ కొత్త విధానాన్ని ఆశ్రయించింది. ఇదిలా ఉంటే మరోసమస్య కూడా పత్తి రైతును నడిరొడ్డు మీద నిలబెట్టింది. డైరక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ స్టాటిస్టిక్స్ సంస్థ అంచనాలమేరకు తెలంగాణలో సగటున ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుబడి వస్తుంది. కాగా దళారులు, జిన్నింగ్ మిల్లుల యాజమానులు అతి తక్కువధరకు రైతుల నుంచి కొన్న సరుకును లాభసాటిగా అమ్ముకోడానికి ఉన్న ఈ అవకాశాన్ని లబ్ధి చేసుకునేవారు. సిసిఐ తాజా నిబంధనల్లో ఎకరానికి 12 క్వింటాళ్ల కోటాను 7 క్వింటాళ్లుగా మార్చడం కూడా దళారులకు లాభాలు తగ్గిపోతున్నాయి. ఈ కారణంచేతనేతమ ఆటలు సాగడం లేదని జిన్నింగ్ మిల్లులు వారు సిసిఐ కొత్త విధానాలను వ్యతిరేకిస్తున్నా రు. ఏ జిల్లా జిన్నింగ్ మిల్లులు ఆ జిల్లాలోని పత్తిని మాత్రమే కొనసాగించాలని ఉన్న నిబంధన పట్ల కూడా వారికి ఆటంకంగా ఉంది. దాంతో ఇలాంటి షరతులతో తాము జిన్నింగ్ మిల్లులను నడపలేమని ఖరాఖండిగా చెప్పారు. ఏమయితేనే అన్ని విధాల పత్తి రైతు మెడమీద నే కత్తి వేటు పడినట్లుంది. పత్తిరైతు, దళారులు, జిన్నింగ్ మిల్లుల మధ్య జరుగుతున్న తేడాపాడాలను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జోక్యంతో పూర్తి అవగాహన కల్పించే విధానాన్ని ప్రభుత్వాలు చేపడితే రైతుల్లో ఆందోళన తగ్గుతుంది.



దేశానికి గాని, సమాజానికి గాని సంఖ్యాబలం ఒక్కటే చాలదు. వారు ఎప్పుడూ అప్రమత్తులై, విద్యావంతులై ఆత్మగౌరవంతో ఉన్నప్పుడే ఆ జాతి బాగుపడుతుంది.

అంబేద్కర్



కృతజ్ఞత అన్నది గొప్పగా అలవర్చుకున్న గుణాల ఫలం. దీనిని మనం మోటు మనుషులలో చూడలేం. అంత నాజూకైంది.

శామ్యూల్ జాన్సన్

# ప్రజావాక్కు



## కలవరపరుస్తున్న రైలు ప్రమాదాలు

**ఇటీవలి** రైలుప్రమాదాలు దేశాన్నికలవరపరిచాయి. అనేక కుటుంబాలు దుర్ఘటనలతోదుఃఖంలో మునిగిపోయాయి. ప్రయాణం సురక్షితమై ఉండాలి కాని ప్రాణాలను ముప్పులో పెట్టే ప్రయాణ మార్గంగా మారడం అత్యంత ఆందోళనకరం. ఈనేపథ్యంలో రైల్వేశాఖ వెంటనే శూన్య ప్రమాద లక్ష్యం (జీరో యాక్సిడెంట్ మిషన్)ను అమలు చేయాలి. ఇదికేవలంఒక ప్రణాళికలేదా నినాదంమాత్రమే కాకుండా, రైల్వే వ్యవస్థ మొత్తం దృక్కోణాన్ని మారుస్తూ, భద్రతను మొదటి ప్రాధాన్యంగా మలచే విధానంగా ఉండాలి. రైల్వే వ్యవస్థలోపాతబడ్డ పట్టాలు, సంకేతాల వ్యవస్థ లోపాలు, యంత్రపరికరాల నిర్వాహణలో నిర్లక్ష్యం, సిబ్బందికి సరైన శిక్షణలో లోటు ఇలాంటి అనేక అంశాలు ప్రమాదా లకు దారితీస్తుంటాయి. వీటిని ఒక్కొక్కటిగా విశ్లేషించి కఠిన చర్యలు తీసుకోవాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## వాతావరణ మార్పుల ప్రభావం

**మన** దేశ ఆర్థికవ్యవస్థలో వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ఇటీవలి కాలంలో వాతావరణ మార్పులు ఈరంగంపై తీవ్రప్రభావాన్ని చూపుతున్నాయి. వర్షపాతం విధానం అస్థిరంగా మారడం, ఉష్ణోగ్రతలు పెరగడం, కరవు పరిస్థితులు ఏర్పడటం, వరదలు రావడం వంటి అంశాలు రైతులకు పెద్దసవాలుగా మారాయి. వర్షాలు సమయానికి పడకపోవడం వలన పంటలు ఎండిపోతున్నాయి. మరోవైపు అధిక వర్షాలు పడి నీట మునిగే పరిస్థితులు ఏర్పడి పంటలు నష్టపోతున్నాయి. ఈ పరిస్థితులు పంట దిగుబడిని తగ్గించడమే కాకుండా రైతుల ఆర్థిక పరిస్థితిని కూడా దెబ్బతీస్తున్నాయి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## పెరుగుతున్న వాయు కాలుష్యం

**దేశంలో** మహా నగరాలు వాయుకాలుష్య కోరల్లో చిక్కుకునిఉన్నాయి. దేశ రాజధానిఅందులో ప్రధానంగా ఉంది. పౌరులు తమ సొంత జీవన ప్రదేశాలను విడిచి వెళ్లలేరు. నివారణ చర్యలు కాగితాలమీదే ఉన్నంత కాలం వ్యక్తుల బాధ్యత, ఇంగితం ఉండదు. ప్రకృతి రక్షణ, అవసరాల నియంత్రణ మరచిపోతే తెలియకుండానే హానికర వాయువులు ప్రవేశించి వింత వ్యాధులు ప్రబలి, వైద్యానికి నోచుకొని దుస్తితి వస్తుంది.

-బొల్లోజు మేఘానాదం, విశాఖపట్నం

## పెండింగ్ బకాయిలు చెల్లించాలి

**తెలంగాణ** రాష్ట్రంలో ఉన్నత విద్యా సంస్థల బంద్ కొనసాగుతోంది. ఇప్పటికే నాలుగు రోజులు పూర్తవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీవంటి అన్ని ప్రొఫెషనల్ కళాశాలలు మూతపడ్డాయి. ఫీరీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నడిమాండ్‌తో 'ఫతి'(ఫెడరేషన్ ఆఫ్‌టీచర్స్ అండ్ ఇన్స్టిట్యూట్స్) పిలుపునిచ్చిన ఈ బంద్ రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా కొనసాగుతోంది. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు అన్ని ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు ఏకమై బంద్‌ను కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేల కోట్ల ఫీరీయింబర్స్మెంట్ బకాయిలను క్లియర్ చేయకపోవడం వల్ల పరిస్థితి విషమంగా మారిందని తెలుస్తుందిఇందులో కనీసం రూ.5వేలకోట్లు వెంటనే విడుదల చేయాలని, మిగతా రూ.5వేల కోట్లను వచ్చే పది నెలల్లో, నెలకు రూ.500కోట్ల చొప్పున చెల్లించాలి.

- కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా

## పాత్రికేయులతో జాగ్రత్త

**జర్నలిస్టులు,** పాత్రికేయుల సహాయంతో వారి అండదండలతో వారి రాతలద్వారా లభించినప్రచారంతో గతంలోకొందరు అనాయాసంగ అధికార పగ్గాలను చేపట్టి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోగలిగారు. అయితే కొద్ది కాలానికే వారికి అధికార మదం తలకెక్కింది. అహంకారంతో తమను ఎవరూ ఏమీ చేయలేరని విర్రవీగారు. నియంతలా మారి ఇష్టానుసారం పాలన చేశారు. ప్రభుత్వ ఉద్యోగులను పాత్రికేయులను చిన్నచూపు చేశారు. వారిని తిట్టి అవమానించారు. ఆ తర్వాత ఏం జరిగింది. ఎవరివల్లనైతే అధికారంలోకి వచ్చారో వారి వల్లనే దాన్ని పోగొట్టుకుని పదవీచ్యుతులయ్యారు.

- శాస్త్రి, హైదరాబాద్

## మందాన్ని విజయం

**మందాని** విజయం ప్రత్యేకం. ట్రంప్ భావజాలంలో ఉన్న లోతు అయిన చేడు ఆలోచనపై మంచి సాధించిన విజయం కాబట్టి. ఇస్లామిక్ భావజాలన్ని తుడిపేయాలి అనియురప్‌తో సహ మిగితా దేశాలలో జరుగుతున్న భావజాలానికి వ్యతిరేకంగా సాధించిన విజయం కాబట్టి. అయితే ఒకటి మందానిని ఎందుకు మెచ్చుకోవాలి. పాలస్తినాలో జరుగుతున్న నరమేధాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నందుకు. రాజ్యం ఎవరి సొత్తు కాదు అని నిరూపించినందుకు.

-భారత అవినాష్, జనగామ

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రోడ్డు ప్రమాదాలను అరికట్టేదెలా?

ప్రమాకరదరమైన రోడ్డు మలుపులు, గుంతలు, అస్తవ్యస్త డ్రైనేజీలు, బ్రిడ్జ్ పారాపెట్ కట్టడాలు లాంటివి క్రమపద్ధతిలో సరిచేయకపోతే ప్రమాదాలను నివారించటం పోను పోను మరింత కష్టతరమవుతుంది. ఢీకొట్టే వాహనాల ప్రమాదాలు, ముందు జాగ్రత్త చర్యలు రోడ్లపరంగా 'ఇండికేటర్స్' ద్వారా హెచ్చరికలు చేసే సాధనాల ద్వారా, రోడ్ పెట్రోలింగ్ ద్వారా తలపెట్టే బాగా తగ్గిపోవచ్చు. వాణిజ్య వాహనాల మీద నియంత్రణలు చేపట్టాలి. రహదారులను టౌన్లలో రోడ్లను ఉపయోగించే పాదచారుల కోసం ప్రత్యేక రక్షణా విధానాలను, అధ్యయనం చేసి ప్రవేశపెట్టగలుగుతే చాలావరకు ప్రమాదాలు తగ్గిపోతాయి. హైదరాబాద్, బెంగళూర్, ఢిల్లీ, చెన్నయి, కోల్‌కత్తా లాంటి పెద్ద పెద్ద పట్టణాలలో 'రోడ్ ట్రాఫిక్' ఈ మధ్యకాలంలో అపరిమితంగా పెరిగిపోవటం వల్ల నివారణ, నియంత్రణ చర్యలు సరైన విధంగా లేకపోవడం వల్ల రోజురోజుకూ అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికీ మించి పోయింది లేదనుకొని తక్షణం తగు చర్యలు తీసుకొంటేనే రోడ్డు ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుంది.



రావులపాటి సీతారాం రావు

పదే పదే రోడ్డు ప్రమాదాలు సృష్టించే కుటుంబాల నష్టాలు, పసితనంలో ఉన్నవారూ, పెళ్లాడి సంతోషంగా భవిష్యత్తును ఊహించుకొంటున్న నవ వధూవరులూ రహదారులపై సమిధలుగా రాలిపోవటం వల్లించడం వల్ల లాభం ఏమిటి? పాలకులూ ప్రభుత్వాలూ, రహదార్ల నిర్మాణం చేసేవారూ, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్‌లోని ఉద్యోగస్థులూ, చివరకు రోడ్లను వినియోగించుకున్న పాదచారులూ పోలీసులూ ఎవరూ పట్టించుకోనప్పుడు ప్రమాదాల దారి ప్రమాదాలదే, బాధితుల దారి బాధితులదే అస్తవ్యస్త పరిస్థితులు, నిర్లక్ష్య ధోరణులను సమీక్షించుకోవటం వల్ల ప్రయోజనం ఏమిటి అని మనసులను కలుక్కుమనిపించే ప్రశ్నలు తలెత్తక మానవు. నవంబరు 3నాడు మరో ఘోర రోడ్డు ప్రమాదం చేవెళ్ల వద్ద జరిగింది. ఇలాంటి ప్రమాదాలు దేశమంతటా క్రమం తప్పకుండా జరుగుతూనే ఉన్నాయి. దాదాపు 400 మంది రోడ్లను వినియోగించుకుంటున్న పాదచారులూ, వాహనాలు నడిపేవారూ, బస్సుప్రయాణీకులూ ప్రతి రోజూ మన దేశంలో ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. లెక్కలు చూసుకోవటం కాదు ప్రభుత్వాలూ, సంబంధిత అధికారులు నిర్వర్తించాల్సిన కార్యక్రమం తలపెట్టాల్సిన చర్యలూ చాలా ఉన్నాయి. వాటిని విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రభుత్వాలకూ అధికారులకూ బాధ్యత గుర్తు చేసే ప్రయత్నమే ఎవరైనా చేపట్టాలి. చర్యలు సత్వరం తీసుకునే బృహత్తర ప్రణాళికలతోపాటు ఈ ప్రమాదాలు తగ్గే భాగంలోని చర్యలు ప్రతిరోజూ సమీక్షించుకొని ఎంత నిష్పత్తిలో ప్రమాదాలు తగ్గాయి అన్న అంచనాలు కూడా వేసుకుంటూ నివారణ చర్యలు తీసుకున్నప్పుడే కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉంది. అప్పుడే ఈ రహదారులను మృత్యుదారుల పరిధుల్లోంచి మనదేశంలో కొంత వరకైనా తప్పించగలం. మన రాష్ట్రాల్లోనే కాదు మొత్తం దేశంలో చాలా వరకు రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. వీధిలైట్లు ఉండవు. రోడ్డు డివైడర్లు ఉండవు. రోడ్లలోని మలుపులూ ప్రమాదస్థలాలూ తెలిపే సైన్‌బోర్డులు ఉండవు. ఇలా లెక్కేసుకుంటూపోతే చాలా ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలపై ఎన్‌క్వాయిరీల్లో ఎప్పుడూ తేలేది మానవ తప్పిదాల గురించే. కానీ ప్రమాదాలు చేస్తున్న వాహనాల, వ్యవస్థీకృత తప్పిదాలను గురించి ఎప్పుడో కాని ఆ రిపోర్టులు వెలెత్తిచూపవు. లోతుగా విచారణ చేస్తేనే అసలు కారణాలు బహిర్గతమవుతాయి. అప్పుడే నివారణ చర్యలూ, లోపాలను సరిదిద్దే చర్యలు తీసుకొనే అవకాశం ప్రభుత్వాలకూ, అధికారులకూ ఏర్పడుతుంది. మనదేశంలో అసలు ప్రహసనం డ్రైవింగ్ లైసెన్సులు ఇచ్చే కార్యక్రమంతోనే మొదలవుతుంది. నిర్లక్ష్యాల మొదటిసాక్ష్యం అక్కడే దొరుకుతుంది. మొదటగా ఈ లైసెన్సులు గ్రాంట్ చేసే అధికారులు చూడాల్సింది డ్రైవింగ్ విధానాలను గురించి అప్లయి చేసిన వారికున్న అవగాహనకు సంబంధించిన థియరిటికల్ నాలెడ్జ్ కాదు, (అది అన్ని టెస్టుల తర్వాత తేలిగ్గా అధికారులకు తెలుస్తుంది) లైట్ వెహికల్, హెవీ వెహికల్ నడుపుతున్నప్పుడు నైపుణ్యాన్ని సాధించారా లేదా? జాగ్రత్తలు వాహనాలు నడిపేటప్పుడు ఏ విధంగా




తీసుకోగలరు? అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలను వారి నైపుణ్యంతో కొంతలో కొంతైనా నివారించగలరా అన్నదే ప్రమాదాల నుంచి డ్రైవింగ్ చేసేవారు ఏ విధంగా వాహనాన్ని తమతో ప్రయాణం చేసేవారిని, తమను రక్షించుకోవటానికి అవరమైన రక్షణ చర్యలు తలపెట్టగలరు అన్న విషయంలోని నాలెడ్జిని పరీక్షించే టెస్టులు, నవీన పద్ధతుల్లో రూపకల్పన చేసి, వినియోగించినప్పుడే ఈ పరీక్షలకు నిజమైన అర్థంతోపాటు ప్రయోజనం ఉంటుంది. ఎక్కువ సంఖ్యలో జరిగే సంఘటనల్లో ముఖ్యమైనవి. వెనుక నుంచి వచ్చి గుద్దే వాహనాలే ప్రమాదాలకు బహుళసంఖ్యలో దారి తీస్తున్నాయి. గొందుల్లోంచి వచ్చే ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలూ, టిప్పర్లు, ట్రాక్టర్లూ వెనుకాముందు చూడకుండా వేగంగా వచ్చి యాక్సిడెంట్స్ చేస్తాయి. వాహనాలు ఏ తీరున నడపాలో అన్న అంశాన్ని ప్రత్యేకంగా ఇతర దేశాల్లో మాదిరి అధ్యయనం చేసి, ఆ విధమైన శిక్షణను తప్పనిసరిగా డ్రయివింగ్ లైసెన్సులు పొందాలనుకున్న వారికి ఇచ్చే ఏర్పాటు వ్యవస్థ వీలైతే ప్రభుత్వపరంగా ఉండక తప్పదు. ప్రైవేట్ సంస్థలకు ఒప్పచెబుతే అవినీతికి ఆస్కారం ఉంటుంది. డబ్బులు సంపాదించటమే ధ్యేయంగా పెట్టుకొనే కొన్ని ప్రైవేట్ సంస్థలు ఈ శిక్షణ ప్రక్రియను సొంతం చేసుకొని నిజమైన శిక్షణా విధానాలకు తిలోదకాలు ఇచ్చే అవకాశం ఉంది. అందుకే ఎక్కువ శ్రద్ధ ప్రభుత్వాలు లైసెన్సు ముందు శిక్షణ విధానాన్ని పెట్టే ప్రణాళిక ఉంటే పరిస్థితులు మెరుగుకావచ్చు. డ్రైవింగ్ టెస్టు తూతూ మంత్రంగా ఆర్.టి.వోలు చేయించే అలవాటు మానుకోవాలి. అడ్డగోలుగా లేన్ మార్పులు నిర్లక్ష్య డ్రైవింగ్, సెలఫోన్లు వాడుతూ డ్రైవ్ చేయడం లాంటివి నిత్యకృత్యంగా చేసే వాహనదారులమీద కఠినమైన చర్యలు పోలీసులూ ట్రాన్స్‌పోర్ట్ సంస్థలూ తీసుకోకతప్పదు. అలాంటి సందర్భాల్లో వెనుకా ముందూ చూడకుండా లైసెన్సులు రద్దుచేస్తేనే ఇలాంటి నిర్లక్ష్యపు ధోరణులకు నిలుపుదల ఉంటుంది. లైసెన్స్‌పొందే వారి నిపుణతను క్షుణ్ణంగా టెస్ట్ చేసే విధానాలు సంబంధిత సంస్థలు ప్రవేశపెట్టాలి. డ్రైవింగ్ లైసెన్స్ పొందటం అంత సులభం కాదు. ఒళ్లు దగ్గర పెట్టుకొని అలవాట్లు లేని చోదకులకే ప్రభుత్వం లైసెన్సులు గ్రాంట్ చేస్తుంది అన్న బలమైన సంకేతం ప్రజల్లోకి వెళ్లినప్పుడే నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు కొంతలో కొంత బ్రేక్ పడే అవకాశాలు మెరుగవుతాయి. 'సేవ్ లైఫ్ ఫౌండేషన్' అనే సంస్థ లైసెన్స్ సేవ్ కేంద్రాలు, 'పాస్‌పోర్ట్ సేవ్ కేంద్రాల మాదిరి ఉండాలి అని ఈ మధ్యబహుళ ప్రచారం చేస్తున్నది. అయిదు ప్రమాదాల్లో ఒక ప్రమాదం తప్పనిసరిగా ఒక వాహనానికి మరొక వాహనం ఎదురుగా బలంగా గుద్దుకొని భయంకరంగా జరిగేవే అని అధ్యయనం చేసిన వారు రిపోర్టులు ఇస్తున్నారు. ఇలాంటి ప్రమాదాలు ఫోర్ లేన్ హైవేస్ మీద, రాంగ్ సైడ్ డ్రయివింగ్‌వల్ల రోడ్లు డివైడర్స్ బాగాలేకపోవడం వల్ల జరిగేవే అని తేల్చి చెబుతున్నారు. నేషనల్ హైవేస్ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ మార్గదర్శక సూత్రాలననుసరించి ఉండాలి అన్న విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నట్లు లేదు. మోటార్ వెహికల్ చట్టాల్లో ఇలాంటి సూత్రాలననుసరించి మార్పులు, చేర్పులూ చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రమాకరదరమైన రోడ్డు మలుపులు, గుంతలు, అస్తవ్యస్త డ్రైనేజీలు, బ్రిడ్జ్ పారాపెట్ కట్టడాలు లాంటివి క్రమపద్ధతిలో సరిచేయకపోతే ప్రమాదాలను నివారించటం పోను పోను మరింత కష్టతరమవుతుంది. ఢీకొట్టే వాహనాల ప్రమాదాలు, ముందు జాగ్రత్త చర్యలు రోడ్లపరంగా 'ఇండికేటర్స్' ద్వారా హెచ్చరికలు చేసే సాధనాల ద్వారా, రోడ్ పెట్రోలింగ్ ద్వారా తలపెట్టే బాగా తగ్గిపోవచ్చు. వాణిజ్య వాహనాల మీద నియంత్రణలు చేపట్టాలి. రహదారులను టౌన్లలో రోడ్లను ఉపయోగించే పాదచారుల కోసం ప్రత్యేక రక్షణా విధానాలను, అధ్యయనం చేసి ప్రవేశపెట్టగలుగుతే చాలావరకు ప్రమాదాలు తగ్గిపోతాయి. హైదరాబాద్, బెంగళూర్, ఢిల్లీ, చెన్నయి, కోల్‌కత్తా లాంటి పెద్ద పెద్ద పట్టణాలలో 'రోడ్ ట్రాఫిక్' ఈ మధ్యకాలంలో అపరిమితంగా పెరిగిపోవటం వల్ల నివారణ, నియంత్రణ చర్యలు సరైన విధంగా లేకపోవడం వల్ల రోజు రోజుకూ అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికీ మించి పోయింది లేదనుకొని తక్షణం తగు చర్యలు తీసుకొంటేనే రోడ్డు ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుంది. ●

# వైద్యరంగంలో ఏఐ పాత్ర ప్రధానం

బి. మధుపాళి

ఇప్పుడు ప్రపంచ యావత్తు ఎఐ మాయాజాలం వైపు కన్నెత్తి చూస్తున్నది అనే మాట సత్యదూరం కాదు. ఇక ఎఐ గురించి సూక్ష్మంగా చెప్పాలంటే ఇది ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అంటే కృత్రిమ మేధ, ఇది ఏకంగా మనుషుల సహజమైన మేధకు పోటీగా మారబోతుంది అనే ప్రమాద ఘంటికలు ప్రస్తుతం మ్రోగుతున్నాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఒక విధంగా చెప్పాలంటే ఇప్పుడు అన్ని రంగాలలో అంటే ఆర్థికరంగం, ఆరోగ్యరంగం, ఈ కామర్స్ రంగం, మార్కెటింగ్, టెలికం రంగం, వ్యవసాయ రంగం, పరిశ్రమల రంగం, భీమా రంగం, పర్యాటక అతిథ్య రంగాలు, మీడియా, వినోద రంగాలు ఇలా ఒకటేమిటి దాదాపు అన్ని రంగాలలోని వారు కూడా (ఏఐ) కృతిమ మేధ టెక్నాలజీని ఇప్పుడు ఉపయోగించుకునే పనిలో భాగంగా ఇప్పటికే చాలా బిజీగా పక్కా ప్రణాళికతో వున్నాయి అనే మాట అక్షరసత్యం. ప్రస్తుతం భారత వైద్య రంగంలో కృతిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఏఐ) సృష్టిస్తున్న ప్రభంజనం, విప్లవం అంతా ఇంతా కాదు. ఎందుకంటే భవిష్యత్‌లో వైద్యరంగం అంతా ఏఐ, మెషిన్ లెర్నింగ్, రోబో టెక్స్ పైనే ఆధారపడే పరిస్థితులు స్పష్టంగా మన కళ్ల ముందు కనపడుతున్నాయి. రోగ నిర్ధారణ, సర్జరీ, ఇతర చికిత్సల కోసం ఏఐ టూల్స్‌ను ఈపాటికే మన వైద్యులు వినియోగిస్తున్నారు అనే మాట సత్యం. అంతేకాదు ఇక రోగుల రికార్డులు, ఎక్స్ రే, సీటీ స్కాన్, రక్త పరీక్షలు, జన్యు క్రమ విశ్లేషణ వంటి అంశాల్లో వైద్యులు సిబ్బందికి సహాయకారిగా పనిచేసే ఏఐ ఉపకరణాలెన్నో ఇప్పుడు మనకు అందుబాటులో వుంటున్నాయి. అదేమాదిరి ఇప్పుడు జెట్ స్పీడ్ వేగంతో కూడిన వీర ప్రతాపంతో ఎనలేని సమర్థతను చూపుతున్న ఈ ఏఐ సాంకేతిక పరిజ్ఞానం వైద్యులు, సిబ్బందికి పని ఒత్తిడిని తగ్గించడంలో అత్యంత హితోధికమైన పాత్రను పోషిస్తున్నది అనే మాట ఎవ్వరూ కాదనలేని వాస్తవం. అంతేకాకుండా క్యాన్సర్, రెటినోపతి, ఊపిరితిత్తుల జబ్బులు, రక్తంలో ఇన్ఫెక్షన్, అరుదైన వ్యాధుల నిర్ధారణలో తెలుగు రాష్ట్రాలలోని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రులు అన్ని కూడా ఈ ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ తమ శ్రమను




తగ్గించుకోవడంతో పాటు, సర్జరీల్లో సైతం ఈ రోబోలను వినియోగించడం ఒక సాధారణ విషయంగా మారిపోవడం అనేది నిజంగా రోజురోజుకు సైన్స్ రంగం కొత్త పుంతలు త్రొక్కుతున్నది అనే వాస్తవాన్ని మనకు బహిర్గతం చేస్తున్నది. ఇంకా చెప్పుకుంటూపోతే జాయింట్ రీప్లేస్‌మెంట్, ఎముకలకు సంబంధించిన ఇతర సర్జరీల్లో రోబోటిక్ సర్జరీల వినియోగం వల్ల సర్జరీ అనంతరం కూడా రోగికి సహజ సిద్ధమైన శరీర ఆకృతి, సర్జరీ సక్సెస్ రేట్ ఎక్కువగా ఉండటాన్ని బట్టి ఈ ఏఐ సాంకేతిక పరిజ్ఞానం యావత్ మానవాళి ఆరోగ్యంగా జీవించడానికి, అమాంతం వారి ఆయుష్షును పెంచడానికి ఎలాంటి వెలకట్టలేని, అజారామమైన సేవలు అందిస్తుందో మనకు చాలా స్పష్టంగా విశదమవుతున్నది. పైగా ఇది మన కళ్లముందు సాక్షాత్కరిస్తున్న జగమెరిగిన సత్యం కూడా. అదే విధంగా ఈఏఐ సాంకేతిక పరిజ్ఞానం పుణ్యమా అని మానవాళికి జరుగుతున్న సర్జరీల్లో కచ్చితత్త్వం, తక్కువ కోతలు, రక్తస్రావం లేకపోవడంతో పాటు ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం కూడా తక్కువగా ఉండటం, రోగులకు చేసే సాధారణ చికిత్సలలో పోలిస్తే చాలా త్వరగా వారు కోలుకుంటున్నారు. ఇంకా చెప్పాలంటే ఈ ఏఐ సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా వినియోగంలో ఉండటంలో చికిత్సలో కొంత ఎక్కువ ఖర్చు అవుతున్న పరిస్థితి మనకు అయా ఆసుపత్రులలో కనపడుతున్నది. ఏదిఏమైన రానున్నది అంతా ఏఐ సాంకేతిక పరిజ్ఞానమే అనే పచ్చి యదార్థాన్ని రోగుల విషయంలో అవి నిరూపిస్తున్న ఊహకుకూడా అందని పలు అద్భుతమైన ఫలితాలను బట్టి మనకు ఏఐ ప్రాధాన్యత దాని సమర్థత ఏపాటిదో ఉదాహరణలతో సహ మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తున్నాయి అనడంలో ఎలాంటి సందేహానికి తావు లేదు. ఏమైనా ఈ ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఇప్పటికే విజయవాడ, గుంటూరు, విశాఖ నగరాలలోని అనేక ఆసుపత్రుల్లో రోబోటిక్ సర్జరీలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మిగతా చిన్న చితక నగరాలకు కూడా ఈ ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చేసే సర్జరీలు అందుబాటులోకి తేగలిగితే అయా ప్రాణాంతకర వ్యాధులతో సతమతమయ్యే రోగులకు ఎంతో కొంత ఉపశమనంలభించడం తథ్యం. అన్నింటికి మించి ఈ ఏఐ సాంకేతిక పరిజ్ఞానం మున్ముందు వైద్యరంగంలో మరిన్ని ఊహకు కూడా అందని సంచలనాలకు కేంద్ర బిందువుగా నిలువడం తథ్యం అనే వాస్తవం మనకు బాగా హితబోధ అవుతున్నది. ●

# విద్యుత్ శాఖలో నూతన సంస్కరణలు!

బైరబోయిన వెంకటేశ్వర్లు

కేంద్రం వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా ఇటీవల ప్రవేశపెట్టిన విద్యుత్ చట్ట సవరణ బిల్లు 2025తో దేశంలో విద్యుత్ విధానాలు అన్ని మారిపోనున్నాయి. ఇది దేశ చరిత్రలో అతి పెద్ద విద్యుత్ సంస్కరణలుగా చెప్పవచ్చు. కేంద్రం ప్రభుత్వ ప్రకారం ఇప్పటికే దేశంలో అన్ని డిస్కమ్ల అప్పులు 6.9 లక్షల కోట్లు దాటాయి. డిస్కమ్‌లను అప్పుల భారీ నుండి తప్పించడానికి, విద్యుత్ పంపిణీ రంగంలో పోటీతత్వం పెంచడానికి , పునరుత్పాదక ఇంధన వనరులను వాడకాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సవరణ బిల్లును తీసుకొచ్చి బిల్లు ముసాయిదాను అభిప్రాయాలు తెలపడానికి నెలరోజుల గడవుతో రాష్ట్ర ప్రభుత్వాలకు పంపింది. ఈ చట్ట సవరణ బిల్లు అమల్లోకి వస్తే ప్రతి వినియోగదారుడు మొబైల్ నెట్వర్క్ (ఎయిర్‌టెల్, ఐడియా, బిఎస్ఎన్ఎల్)ల తమకు నచ్చిన విద్యుత్ సప్లయర్‌ను ఎంచుకోవచ్చు. కానీ ఈ బిల్లు ద్వారా కేంద్రం కొన్ని సందేహాలను నివృత్తి చేస్తేనే రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించే అవకాశం ఉంది. అందులో ముఖ్యమైనవి రాష్ట్రంలో అన్ని వర్గాల వినియోగదారులకు సార్వత్రిక సేవా బాధ్యతగా విద్యుత్ పంపిణీ చేసే ప్రభుత్వడి స్కమ్‌లుఎటిసి నష్టాల వల్ల ప్రతి సంవత్సరం రాబడి, వ్యయాల మధ్య వ్యత్యాసం ఉండి అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. కానీ ఈ నూతన విద్యుత్ సవరణ బిల్లు ద్వారా ప్రైవేట్ డిస్కమ్‌లు ఏర్పడడం వల్ల ప్రభుత్వ డిస్కముల ఆదాయం తగ్గుతుంది. ఈ తగ్గిన రాబడితో ఇప్పటివరకు ఉన్న అప్పులు తీర్చడం సాధ్యం కాదు. ఈ అప్పుల గురించి బిల్లులో ఏ ప్రస్తావన కూడా లేదు. ఈ అప్పులు ఎలా తీర్చాలో సందేహం నివృత్తి చేస్తేనే బిల్లు ముందుకు సాగే అవకాశంఉంది. కొత్త విద్యుత్ చట్ట సవరణ ప్రకారం ప్రైవేట్ డిస్కమ్‌లు ప్రభుత్వ డిస్కమ్ నెట్వర్క్‌ను వాడుకొని వీలింగ్ చార్జెస్ చెల్లించి విద్యుత్ పంపిణీ చేసే వెసులుబాటు కల్పించనుంది. దీనివల్ల చాలామంది హై టెన్షన్ విద్యుత్ వినియోగదారులు ప్రభుత్వ డిస్కముల నుండి ప్రైవేట్ డిస్కమ్ మారే అవకాశం ఉంది. దానివల్ల ప్రభుత్వ డిస్కంల రాబడి తగ్గుతుంది. రాష్ట్రం అంతా గుత్తాధిపత్యంల ప్రతి వినియోగదారుడికి విద్యుత్ పంపిణీ చేస్తే వచ్చిన ఆదాయం సరిపోక అప్పులో మునిగిన డిస్కమ్‌లు, కేవలం వీలింగ్ చార్జెస్ ద్వారారాష్ట్రం అంతా విస్తరించి ఉన్న ఈ నెట్వర్క్‌ను మైంటైన్ చేయడం



చాలా కష్టతరమైనది. ఉద్యోగుల జీతాలే పంపిణీ సంస్థలకు గుదిబండలుగా మారుతాయి. ఉద్యోగుల సర్దుబాటు జీత భత్యాలు చెల్లించడం ప్రభుత్వ డిస్కమ్‌లకు పెద్ద సవాల్‌గా మారుతుంది. ఉద్యోగుల నుండి కూడా తీవ్రమైన వ్యతిరేకత వస్తుంది. కొత్త విద్యుత్ సవరణ బిల్లు ప్రకారం ఒకే ప్రాంతంలో ఒకటి కంటే ఎక్కువ డిస్కమ్లు విద్యుత్ సరఫరా చేసుకోవచ్చు కానీ ఏ డిస్కమ్ నుండి ఎంత విద్యుత్ వాడారు అని లెక్కించడం చాలా కష్టతరమైనది. లక్షల మంది వినియోదారులలో ఎవరెంత వినియోగించారని లెక్కించడం మనకున్న మీటర్ సాంకేతికత ప్రకారం చాలా కష్టతరమైనది. ప్రస్తుతం డిస్కంలో ఒక వర్గం వారికి తక్కువ ధరకు (గృహాలకు రైతులకు) మరొక వర్గం(పారిశ్రామిక, వాణిజ్య) వారికి ఎక్కువ ధరకు విద్యుత్ను అందిస్తుంది. దీనినే క్రాస్ సబ్సిడీ అంటారు. కానీ కొత్త సవరణ బిల్లు ప్రకారం వీటిని క్రమంగా తగ్గించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని నేరుగా వినియోగదారులకు ఇచ్చే అవకాశం కల్పిస్తుంది. దీనిని రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరిస్తాయో లేదో చూడాలి. ఇది రాష్ట్ర ప్రభుత్వాలకు అదనపు భారం. ప్రభుత్వ డిస్కంలు ఇప్పటి వరకు సార్వత్రిక సేవా బాధ్యతగా ప్రతి వినియోగదారుడి విద్యుత్ లోడ్‌ను రాష్ట్ర కాంట్రాక్టెడ్ కెపాసిటీగా లెక్కిస్తూ దానికి అనుగుణంగా దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పిపిఎఎస్) చేసుకుంటాయి. ఈ ఒప్పందం ప్రకారం విద్యుత్ను వినియోగించుకున్న వినియోగించుకోకున్న జనరేటింగ్ స్టేషనులకు ఫిక్స్డ్ చార్జీలను చెల్లించాలి. కొత్త విద్యుత్ సవరణ చట్టప్రకారం ప్రైవేట్ డిస్కమ్‌లు నూతన ఒప్పందాలు( పిపిఎ)లు చేసుకుంటే ఈ ప్రభుత్వ డిస్కంలో దీర్ఘ కాలిక ఒప్పందాలు మరో ఆర్థిక భారంగా మారుతాయి. పైన పేర్కొన్న అంశాలతో పాటు ప్రైవేట్ డిస్కమ్ కేవలం అధిక రాబడి ఉన్న ప్రాంతాలకే పరిమితమై ప్రభుత్వ డిస్కమ్లో ఆదాయరాబడి తక్కువగా ఉండి, సబ్సిడీదారులకు మాత్రమే పంపిణీ చేయవలసి వస్తే ప్రభుత్వ డిస్కమ్‌లపరిస్థితి ఇంకా దయనీయంగా మారవచ్చు. దీనితో పాటు ప్రకృతి విపత్తులు తుఫాను సంభవించినప్పుడు ప్రభుత్వ డిస్కములుయుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి విద్యుత్ని పునరుద్ధరిస్తాయి. ఇటువంటి సందర్భంలో ప్రైవేట్ డిస్కొంట్‌లో స్పందనఎలా ఉంటుందో చూడాలి అన్న సందేహాలను నివృత్తి అయితేనే ఈ చట్ట సవరణ బిల్లు ఏ ఆటంకం లేకుండా ముందుకు సాగుతుంది. దీనిపై రాష్ట్రాలు ఏం అభిప్రాయాలు తెలుపుతాయో వేచి చూడాలి. ●



ఆదివారం చిత్తూరుజిల్లా పలమనేరు నియోజకవర్గం ముసలమడుగు వద్ద ఉన్న ఏనుగుల శిక్షణా కేంద్రం, కుంకీ ఏనుగుల శిక్షణ శిబిరాన్ని సందర్శించిన డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ (గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)

## ఘనంగా మిరియాల వెంకటరావు 11వ వర్ధంతి

గుంటూరు వెస్ట్, నవంబర్ 9, ప్రభాతవార్త: కాపునాడు నేత మిరియాల వెంకటరావు 11వ వర్ధంతిని పురస్కరించుకొని, ఆదివారం గుంటూరు నెహ్రూ నగర్ లోని కాపునాడు కార్యాలయం లో ఆయన చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ పూలమాలలు



వేసి ఘనమైన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటరావు ప్రజలకు అందించిన సేవలు మరువలేనివి అన్నారు. ఆయన స్ఫూర్తిగా తీసుకొని ప్రజలందరూ ఆయన అడుగుజాడల్లో ఆయన సిద్ధాంతాలలో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాపు నాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు యర్రగోపు నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు రాగం సదాశివరావు, బొందలపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌వీఆర్ జేసీలో నేషనల్ అగ్రిటెక్ హ్యాకథాన్ 2025 పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు విద్య, నవంబర్ 9, ప్రభాతవార్త : రైతు సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను అందించాలనే లక్ష్యంతో తమ కళాశాల్లో ఆర్‌వీఆర్ జేసి సిఈ ఎస్‌టిపి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ ఆధారిత సంస్థల సహకారంతో డిసెంబర్ 22 మరియు 23, 2025 తేదీల్లో నేషనల్ అగ్రిటెక్ హ్యాకథాన్ 2025 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె. మద్దినేని ప్రకటించారు. దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన యువత, ఆవిష్కర్తలు తమ సాంకేతిక నైపుణ్యాలను



ప్రదర్శించి, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీయనున్న ఈ హ్యాక్‌థాన్‌కు ఆతిధ్యమివ్వడం తమ కళాశాలకు గర్వకారణమని వారు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ కళాశాల సిబ్బందితో కలసి ఆవిష్కరించి, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ హ్యాకథాన్ కార్యక్రమానికి భారత ప్రభుత్వ వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఐసిఏఆర్, ఎన్ఎఏఆర్ఎం, ఏఐడిఈఏ, ఐఐఎంఆర్, న్యుట్రిహబ్, ఇక్రిశాట్, నాబర్డ్, యాంగ్రు వంటి ప్రముఖ సంస్థలు ప్రధాన భాగస్వామ్య సంస్థలుగా తోడ్పాటునందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటిబిఐ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎం.వి.పి. చంద్రశేఖర్‌రావు, సిఈఓ డాక్టర్ ఆర్. హాఫీజ్ భాషా, ఇంక్యుబేషన్ అసోసియేట్ డాక్టర్ ముద్దు అల్లపర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సేవా సమితి కార్తీక సమారాధన

గుంటూరు విద్య, నవంబర్ 9, ప్రభాతవార్త : గుంటూరు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో హిందూ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, హిందూ కాలేజ్ ఇంజనీరింగ్ ప్రాంగణంలో కార్తీక సమారాధన పెద్దఎత్తున జరిగింది. కార్యక్రమంలో తొలుత ప్రముఖ గాయకులు గజల్ శ్రీనివాస్ గానాలాపన చేసి బ్రాహ్మణ బంధువులను అలరింపచేశారు. ముఖ్యఅతిధిగా బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, అనేక ప్రముఖులు విచ్చేశారు. కార్య క్రమానికి సుమారు 3000మంది బ్రాహ్మణ బంధువులు భోజనానికి విచ్చేశారు. వీరందరికి ప్రముఖ పేరుగల వైష్ణవీ కేటర్స్ అధినేత వైష్ణవి ప్రసాద్ పర్యవేక్షణలో భోజనం ఏర్పాటు చేశారు. కార్తీక వన సమారాధనలతో ఆధ్యాత్మికతతోపాటు సమిష్టిగా ముందుకు వెళ్ళాలనే భావన కలుగుతాయని బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్



బుచ్చి రాంప్రసద్ తెలిపారు. హిందూ కళాశాలలో బ్రాడీపేట బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధరన పెద్దఎత్తున నిర్వహించారు. కార్యక్రమానికి బ్రాహ్మణ బందువులు దాదాపు 3000 మంది పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. బుచ్చి రాంప్రసాద్ మాట్లాడుతూ సమితి చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు. పేద విద్యార్థిని, విద్యార్థులకు విద్యా పారితోషికాల అందజేయడంతో పాటు పిల్లలకు ఉచితంగా ఉపనయనాలు నిర్వహిస్తున్నారని, రాబోయే కాలంలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కారీ ్తక దామోదర పూజ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, విష్ణు సహస్రనామ పారాయణం, లలితా సహస్రనామ పారాయణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లా పెద్దలకు ఆటల, తంబోలా తదితర పోటీలు పెట్టారు. కార్యక్రమానికి అధ్యక్షులు నందిరాజు పాండురంగారావు, కార్యదర్శి రంగావజ్జుల లక్ష్మీపతి కార్యవర్గ సభ్యులు ప్రోగ్రామ్ కన్వీనర్ కర్లపాలెం బాలకృష్ణ కోకన్వీనర్ మాదాల వెంకట కృష్ణ, గొల్లపూడి రామకృష్ణారావు, పాతూరి శ్రీనాధ్ శ్రీకర పాంచజన ్య శర్మ కె.వి.సాయిబాబా శర్మ, ముక్కామల మారుతీ రాంగోపాల్, ఏ.వి.మంగాదేవి, గంగ్రకోట వెంకటేశ్వర్లు, తూటుపల్లి శ్రీనివాసరావు పాల్గొని సభను జయప్రదంగా నిర్వహించారు.

## 12,13 తేదీల్లో సిటీలో మంచినీటి సరఫరాకు అంతరాయం

గుంటూరు నగరపాలక సంస్థ, నవంబర్ 9, ప్రభాతవార్త : ఈనెల 12,13తేదీల్లో నాజ్‌సెంటర్, ఎల్.బి.నగర్, బాలాజీనగర్ రిజర్వాయర్ల పరిధిలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జీఎంసి కమీషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. జీఎంసి పరిధిలోని సంగం జాగర్లమూడి హెడ్ వాటర్ వర్క్స్ నుండి గుంటూరు నగరానికి క్లియర్ వాటర్ సరఫరా చేసే 700ఎంఎం దయా ప్రధాన పంపింగ్ లైన్లపై సుద్దపల్లి గ్రామం వద్ద లీక్ ఏర్పడి తాగునీరు వృధా అగుతుంది. కావున సదరు లీకును అరికట్టడానికి జీఎంసి ఇంజనీరింగ్ అధికారులు లీకు మరమ్మత్తులు చేయడానికి నిర్ణయించారు. కావున 12బుధవారం ఉదయం 8నుండి సంగం జాగర్లమూడి ఫిల్టరేషన్ ప్లాంటు పూర్తిగా నిలుపుదల చేయుచున్నారు. అందువలన 12బుధవారం సాయంత్రం నుంచి 13గురువారం ఉదయం తూర్పు నియోజకవర్గం పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

# గుంటూరు వార్త



## ప్రజల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం

### శంకర ఐ ఫౌండేషన్ సేవలు నిరుపమానం పేదలకు నిస్వార్ధంగా సేవ చేసే సంస్థలకు సహకరిస్తాం: సిఎం చంద్రబాబు

గుంటూరు వెస్ట్, నవంబర్ 9, ప్రభాతవార్త: పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి నూతన భవనాన్ని ఆదివారం సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. అనంతరం ఆయన ఆసుపత్రి యాజమాన్యంతో సమావేశమై సేవల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ అనారోగ్యమే నిజమైన పేదరికమని, అందుకే ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని శంకర కంటి ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఐదు దశాబ్ధాలుగా శంకర ఆస్పత్రి పేదలకు ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేస్తూ




వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందని ముఖ్యమంత్రి అన్నారు. శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో నడుస్తున్న శంకర కంటి ఆస్పత్రి లో నూతన భవన నిర్మాణ ప్రారంభోత్సవంలో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానని, నిస్వార్ధంగా సేవలు చేసే ఇలాంటి సంస్థలకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు.

**దృష్టిని ప్రసాదిస్తూ మానవాళికి అద్భుతమైన సేవ**

మానవ సేవనే మాధవ సేవ అని నమ్ముతుంది కాబట్టే...కంచి పీఠం దేశ వ్యాప్తంగా కంటి ఆస్పత్రులు స్థాపించి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తోంది. జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యులు స్థాపించిన కంచి పీఠం ఆది నుంచి హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడుతోంది. అందులో భాగంగానే ఆది శంకరాచార్యులు దేశంలోని నాలుగు ప్రాంతాల్లో నాలుగు పీఠాలను స్థాపించారు. హిందూ ధర్మాన్ని తిరిగి బలమైన శక్తిగా మలిచారు. 1977లో ప్రారంభమైన శంకర కంటి ఆస్పత్రి సామాన్యులకు సైతం నేత్ర చికిత్సలను అందుబాటులోకి తెచ్చింది. త్వరలో జరిగే స్వర్ణోత్సవ కార్యక్రమానికి నేను హాజరవుతాను. 50 ఏళ్ల వ్యవధిలో దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో 14 ఐ హాస్పిటల్స్ నిర్మించడం సాధారణ విషయం కాదు. ఇప్పటి వరకు 30 లక్షల మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు, 70 లక్షల మంది చిన్నారులకు కంటి పరీక్షలు చేయడం గొప్ప విషయం. ఈ ఆస్పత్రుల్లో రోజుకి సగటున



750 ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా 2,268 మంది సిబ్బంది పనిచేస్తుంగా 2,576 పడకలు ఉన్నాయి. ఇంత గొప్ప సేవా కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహిస్తున్న శంకర ఆస్పత్రిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. 2003 నుంచి గుంటూరులోని శంకర కంటి ఆస్పత్రి సేవలు అందిస్తోంది. ఈ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఇప్పటికి 4 లక్షలకు పైగా ఉచిత కంటి శస్త్రచికిత్సలు, 9 లక్షల మందికి పరీక్షలు నిర్వహించారు. 300 పడకల సామర్ధ్యంతో, రోజుకు 2,500 నుంచి 3,000 వరకు రోగులకు సేవలు అందిస్తున్నారు. రెయిన్‌బో ప్రోగ్రామ్ ద్వారా ప్రత్యేకంగా పిల్లల కంటి ఆరోగ్యంపై దృష్టి పెట్టడాన్ని అభినందిస్తున్నాను. శంకర యొక్క గ్రామీణ సేవా ప్రాజెక్ట్ గిఫ్ట్ ఆఫ్ విజన్ కింద ఇప్పటివరకు 32,000కు పైగా కంటి శిబిరాలు నిర్వహించడం వారి సేవా గుణానికి నిదర్శనమని సీఎం చంద్రబాబు అన్నారు.

**పేదలకు సేవ చేసే సంస్థలకు ఎల్లప్పుడూ సహకారం**

జగద్గురు శ్రీ ఆది శంకరాచార్య ఆకాంక్షి ంచినట్టు పేదరికం లేని సమాజమే లక్ష ్యంగా ముందుకెళ్తున్నాం. రాష్ట్రంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలి. ఆరోగ్యాన్ని మించిన సంపద మరొకటి లేదు. ఆరోగ్యం లేకుండా డబ్బు, హోదా, ఆస్తులు, బంగ్లాలు, కార్లు ఉన్నా ఉపయోగం ఏమీ లేదు. అందుకే ప్రజారోగ్య సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాం. వినూత్నంగా యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తెస్తున్నాం. ప్రతి ఒక్కరికీ రూ. రెండున్నర లక్షల ఆరోగ్య భీమా, ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల వరకు విలువైన వైద్య సేవలు ఈ పాలసీ కింద అందిస్తాం. టాటా సంస్థ సహకారంతో డిజిటల్ నెర్వ్ సెంటర్ సంజీవని కేంద్రాలు త్వరలో రాష్ట్రమంతటా ఏర్పాటు చేస్తాం. ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల హెల్త్ రికార్డులు ఆన్ లైన్ లో పెడుతున్నాం. ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌కు ప్రయత్నాలు చేస్తున్నాం. రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ రూపొందిస్తున్నాం. ప్రజల ఆరోగ్యం కాపాడడానికి శంకర కంటి ఆస్పత్రి సేవలను స్వాగతిస్తున్నాను. ఇలాంటి ప్రతిష్టాత్మక సంస్థలతో కలిసి పనిచేయడానికి రాష్ట్రం ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పేదలకు సేవ చేసే ఇలాంటి సంస్థలకు మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**కంచి కామకోటి పీఠం సేవలు అద్వితీయం:** ఆధ్యాత్మికంగా భక్త జనావళి శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నారు. ధర్మం, జ్ఞానం, సేవ మూల సిద్ధాంతాలుగా శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ పీఠాన్ని కొనసాగిస్తున్నారు. సామాజికంగాను పేదలను, ఆపన్నులను ఆదుకునేందుకు కంచి కామకోటి పీఠం విశేషంగా పని చేస్తోంది. సామాన్యులకు సైతం నేత్ర చికిత్సలు అందుబాటులోకి తెచ్చిన శంకర ఐ హాస్పటల్... 1977లో ఈ సేవా ఉద్యమాన్ని ప్రారంభించింది. త్వరలో స్వర్ణోత్సవంలో అడుగుపెడుతోంది. సేవే పరమావధిగా భావించే శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ మార్గదర్శకత్వంలో శంకర ఫౌండేషన్ మరింత ఉజ్వలంగా ఉండాలని కోరుకుంటున్నాన్న అని సీఎం అన్నారు. అంతకుముందు ఆస్పత్రిలోని శంకర ఆస్పత్రిలోని పలు విభాగాలను సీఎం చంద్రబాబు సందర్శించి వాటి వివరాలు తెలుసుకున్నారు. శంకర ఐ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న సర్జరీలు, ఐ బ్యాంక్ ద్వారా చేస్తున్న సేవలను ముఖ్యమంత్రికి నిర్వాహకులు వివరించారు. అనంతరం సీఎం చంద్రబాబుకు శాలువా తంజావూరు పెయింటింగ్ ను ఆస్పత్రి నిర్వాహకులు బహుకరించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు, శంకర ఐ ఫౌండేషన్ ప్రతినిధులు హాజరయ్యారు.

## స్వప్రయోజనాలకు కూటమి ప్రభుత్వ ప్రాధాన్యం : బాలవజ్రబాబు విమర్శ

తుళ్ళూరు, నవంబర్ 9, ప్రభాతవార్త : స్వప్రయోజనాలే పరమావధిగా టిడిపి కూటమీ పాలన సాగిస్తుందనీ, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అందుకు ఉదాహరణ అని వైసిపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి బాల వజ్రబాబు (డైమండ్‌బాబు) విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నాయకులు ఆదివారం రాత్రి తుళ్ళూరులో సంతకాల సేకరణ చేపట్టారు. కోటి సంతకాల సేకరణలో భాగంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజల నుండి ఆదరణ లభిస్తుందని డైమండ్ బాబు చెప్పారు. నాయకులు ముందుగా పిహెచ్‌సి వద్దనున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు



వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మైనేని నాగమల్లేశ్వరరావు, కంతేటి చిన వెంకటేశ్వర్లు, చుండు వెంకటరెడ్డి, కొప్పుల శేషగిరిరావు, కె.వినోద్, కె.జాన్‌పాల్, కె.నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

## టెక్నాలజీతోపాటు నైతికత అత్యవసరం

### -సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్

### -విజ్ఞాన్‌లో న్యాయ సహాయం అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

పొన్నూరు, నవంబరు 9, ప్రభాతవార్త: న్యాయ పరిపాలనా వ్యవస్థలు ప్రజల అంతచనాలకు తగిన విధంగా పనిచేయాలంటే టెక్నాలజీతో పాటు నైతికత, మానవత్వం కూడా అంతే అవసరమని జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో న్యాయ మంత్రిత్వ శాఖకు చెందిన ప్రో బోనో లీగల్ సర్వీసెస్ సహకారంతో కృత్రిమ మేధస్సు, సాంకేతిక యుగంలో న్యాయ సహాయం, న్యాయం అందుబాటులోకి తేవడం అనే అంశంపై ఒక రోజు




అంతర్జాతీయ సదస్సు జరిగింది. జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మాట్లాడుతూ ఏఐ, టెక్నాలజీ న్యాయరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నప్పటికీ, అవి ఎప్పటికీ న్యాయవాదులు లేదా న్యాయమూర్తుల స్థానాన్ని భర్తీ చేయలేవన్నారు. ఏఐ వ్యవస్థలు పరిశోధనచ డ్రాఫ్టింగ్, పరిపాలనలో సహకరించినా, న్యాయసారం మాత్రం మానవ ఆలోచన, విశ్లేషణ, దయ, నైతిక తీర్పులోనే ఉంటుందన్నారు. న్యాయం అంటే కేవలం చట్టపరమైన అర్ధమే కాదు....అది మానవ మనసు, దయ, సమానత్వం, బాధ్యతల సమ్మేళనం, అని ఆయన చెప్పారు. పేద వర్గాలకు న్యాయసహాయం చేరేలా అవగాహనా కార్యక్రమాలు, సులభ న్యాయ సేవలు, డిజిటల్ సదుపాయాలు విస్తరించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. ఏఐ, ఆన్‌లైన్ వివాద పరిష్కార వేదికలు న్యాయప్రవేశాన్ని విస్తరించగలవని, కానీ టెక్నాలజీ మానవ తీర్పుకు సహాయకంగా ఉండాలి గానీ, దాని స్థానంలోకి రాకూడదన్నారు. 2050నాటికి బెయోటెక్నాలజీ, కృత్రిమ మేధస్సు రంగాల్లో ఊహించలేని అభివృద్ధి జరుగుతుందన్నారు.

**టెక్నాలజీ శక్తివంతమైన సాధనం: జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు**

టెక్నాలజీ శక్తివంతమైన సాధనమని, కానీ దాని విలువ మానవ సేవలోనే ఉందని ఏపి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు అన్నారు. భారత న్యాయవ్యవస్థ వేగంగా డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తోందన్నారు. సీబీఐ ఏఐ ఆధారంగా సాక్ష్యాల పరిశీలన జరపడం దర్యాప్తు నాణ్యతను పెంచుతోందన్నారు. లాన్ నెట్‌వర్కింగ్, ఆన్‌లైన్ కేసు ట్రాకింగ్ సిస్టమ్, ప్రజలకు అందుబాలులో ఉన్న వెబ్ పోర్టల్స్ పారదర్శకతను పెంచుతున్నాయన్నారు. ఏఐ, డిజిటల్ సాధనాలు కేవలం సంస్థల సమర్ధతమే కాకుండా, ప్రజల శక్తివంతతకు, సమాన న్యాయం సాధనానికి దోహదపడాలన్నారు.

**టెక్నాలజీతో న్యాయసేవ అందుబాటులోకి- నైతికతతో సమతుల్యం అవసరం: డాక్టర్ లావు రత్తయ్య**

విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ఏఐ ఇప్పుడు కేవలం సాంకేతిక రంగాలకే పరిమితం కాలేదని, అది న్యాయం అందించే విధానాన్నీ ప్రభావితం చేస్తోందన్నారు. డిజిటల్ లీగల్ అసిసెంట్లు, ఆన్‌లైన్ వివాద పరిష్కార వేదికలు, ఆటోమేటెడ్ డాక్యుమెంటేషన్ వంటి ఏఐ సాధనాలు సాధారణ ప్రజలకు న్యాయ సహాయాన్ని మరింత సులభతరం, చౌకగా, పారదర్శకంగా చేస్తాయన్నారు. అయితే టెక్నాలజీని చట్టవ్యవస్థలో అనుసంధానించేటప్పుడు నైతిక విలువలు, మానవ బాధ్యతలు, డేటా భద్రత వంటి అంశాలను ఖచ్చితంగా పరిగణించాలన్నారు. ఏఐ, చట్టం కలిసి పనిచేస్తే ప్రజాస్వామ్యాన్ని బలపరచగలవు, న్యాయాన్ని ప్రజల హక్కుగా నిలబెట్టగలవన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాయపూడి వద్ద కృష్ణానదిలో ఇద్దరు యువకులు గల్లంతు

### -అధికార యంత్రాంగం గాలింపు చర్యలు

గుంటూరు, నవంబర్ 9, ప్రభాతవార్త ప్రతినిధి: తూళ్లూరు మండలం రాయపూడి గ్రామ సమీపంలోని లాంచీల రేవు వద్ద ఇద్దరు యువకులు ఆదివారం నాడు గల్లంతయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. అమలాపురానికి చెందిన పవన్ , గిద్దలూరుకు చెందిన దినేష్ రాజధాని పనులు చేసుకుంటూ ఉన్నారు. వీరు పనిచేస్తున్న కంపెనీ వద్దే పనిచేస్తున్న మరో ఇద్దరితో కలిసి ఆదివారం లాంచీల రేవు వదనద కృష్ణానదిలో స్నానం చేసేందుకు అందులోకి దిగారు. స్నానం చేస్తూ పవన్, దినేష్ నీటిలో గల్లంతయ్యారు. కాగా మణికంఠ, పవన్ బయటకు వచ్చారని తెలిపారు. తుళ్లూరు సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కలగయ్య, స్థానిక రెవెన్యూ సిబ్బంది, సమీపంలోని జాలర్లు కలిసి పడవులతో గాలింపు చర్యలు చేపట్టారు.

## పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి తోడ్పాటు

### -ఏపి బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్

గుంటూరు విద్య, నవంబర్ 9, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బిజేపి రాష్ట్ర మీడియా కోకన్వీనర్ వెలగలేటి గంగాధర్ విజయవాడ గొల్లపూడిలోని బ్రాహ్మణ కారొ ్పరేషన్ కార్యాలయంలో కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాటా ్లడుతూ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘాలను కలుపుకొని బ్రాహ్మణుల అభ్యున ్నతికి తోడ్పడతానని కార్పొరేషన్ క్రెడిట్ సొసైటీ ద్వారా బ్రాహ్మణ



విద్యార్థులకు విద్యా పథకాల ద్వారా యువతకు సంక్షేమ స్వయం ఉపాది పథకాలు, మహిళలకు గ్రూప్‌లోన్స్ స్వయం ఉపాధి పథకాలు అందే విధంగా కృషి చేస్తానని బ్రాహ్మణ కార్పొరేషన్ మరింత అభివృద్ధి చెందే విధంగా పనిచేస్తానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన బిజేపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ కి బిజేపి సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్ కి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు బిజేపి గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు, రాష్ట్ర జిల్లా నాయకులకు ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా అన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎండి దొరబాబు మేనేజర్ శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అద్దూరి శ్రీరామ్ బిజినెస్ రాష్ట్ర పబ్లిసిటి అండ్ లిటరేచర్ కన్వీనర్ పాలపాటి రవికుమార్, దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం పాలకమండలి సభ్యులు అవ్వారు బుల్లబ్బాయి, పిట్టల గోవిందా, జనసేన జిల్లా కార్యదర్శి ఫణిశర్మ, శ్రీధర్‌బాబు, ఈమని మాధవరెడ్డి, తాడువాయి రామకృష్ణ, వాసా పల్లవరాజు, శంకరప్రసాద్, తారక రామారావు, జంధ్యాల సాయిరాధాకృష్ణ, ప్రతాప ప్రసాదు, మధు తదితరులు పాల్గొని ఘనంగా సన్మానించారు.

ప్రభాత వార్త

**స్టాఫ్ రిపోర్టర్లు, న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను**

విస్తృతమైన వార్తా సేకరణ యంత్రాంగం ఉన్న వార్త న్యూస్ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టవంతంగా చేయాలనుకుంటోంది. పాఠకులకు మరింత తాజా వార్తలను అందించేందుకు పల్నాడు, గుంటూరు జిల్లాల్లో విలేకరుల యంత్రాంగాన్ని విస్తృతపరచాలని నిర్ణయించింది. ఆసక్తి గలవారికి స్టాఫ్‌రిపోర్టర్లు, న్యూస్ కంట్రిబ్యూటర్లుగా సదవకాశం కల్పిస్తోంది.

**అభ్యర్థులకు కావలసిన అర్హతలు**

- 35 ఏళ్ల లోపు వయస్సు
- ఇంటర్ లేదా డిగ్రీ
- స్థానికంగా నివాసం
- ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన

**న్యూస్ కంట్రిబ్యూటర్లు కావాల్సిన కేంద్రాలు**

నాదెండ్ల, దుర్గి, రెంటచింతల, అమరావతి, తాడికొండ, మేడికొండూరు, భట్టిప్రోలు, నిజాంపట్నం, నగరం, దుగ్గిరాల, అమృతలూరు

ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటాతో సంప్రదించగలరు

13.11.2025 గురువారం

'వార్త' యూనిట్ కార్యాలయము

NH-5, చిలకలూరిపేట రోడ్, అంకిరెడ్డిపాలెం, గుంటూరు

బ్రాంచి మేనేజర్ ఫోన్: 89786 45935

## దేవేంద్రుడు ప్రతిష్ఠించిన అమరేశ్వరునికి ప్రత్యేక పూజలు

అమరావతి, నవంబర్ 9 ప్రభాతవార్త : పంచారామ క్షేత్రమైన శ్రీ బాల చాముండిక సమేత అమరేశ్వరస్వామి దేవాలయం అమరావతి శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో శ్రీ





అమరేశ్వరాలయం శివనామ స్మరణతో మార్మోగింది. తెల్లవారుజామున 4 గంటలకు అమరేశ్వర స్వామివారికి పంచామృతాభిషేకం జరిపిన అనంతరం స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ రేఖ పర్యవేక్షించారు. నది తీరాన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూశారు. రెండు రోజులు సెలవు కావడంతో భక్తులు నదీ స్నానం అనంతరం కుటుంబ సమేతంగా కార్తీకదీపాలు వెలిగించి భక్తులు భక్తిని చాటుకున్నారు.

## క్రమశిక్షణతోపాటు శారీరక, మానసిక ఆరోగ్యం ముఖ్యం: సీఐ

మాచర్ల, నవంబరు 9 ప్రభాతవార్త: పోలీసు శాఖలో క్రమశిక్షణతోపాటు శారీరక, మానసిక ఆరోగ్యం ముఖ్యమని మాచర్ల అర్బన్ సీఐ టి.వెంకటరమణ అన్నారు. ఈ సందర్భంగా పట్టణ పోలీసు స్టేషన్లో సీఐ ఆధ్వర్యంలో యోగాసన కార్యక్రమం చేపట్టారు. ఆదివారం ఉదయం యోగా గురువుల



మార్గదర్శకత్వంలో పలు యోగాసనాలు చేశారు. పోలీసు సిబ్బంది రోజువారీ ఒత్తిడిని తగ్గించడంలో, మనసు ప్రశాంతంగా ఉంచడంలో యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రతిరోజూ కొద్ది సమయం కేటాయించి యోగాసనాలు చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం వల్ల పోలీసు సిబ్బందిలో సానుకూల ఆలోచనలతోపాటు ఫిట్‌నెస్ పట్ల అవగాహన పెంచిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై అనంతకృష్ణ, పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఐటీ వింగ్ ఆధ్వర్యంలో హైదరాబాదులో కోటి సంతకాల సేకరణ

మాచర్ల, నవంబరు 9 ప్రభాతవార్త: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా ఐటీ వింగ్ ఆధ్వరనయంలో హైదరాబాదులోని కేపీహెచ్‌బీ కాలనీలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం



చేపట్టారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాండ్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల, రాష్ట్ర ఐటీ వింగ్ అధ్యక్షుడు సునీల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## రోటరీక్లబ్ ఆధ్వర్యంలో యువజన ఉత్సవాలు

మాచర్ల, నవంబరు 9 ప్రభాతవార్త: రోటరీక్లబ్ మాచర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన ఉత్సవాల్లో పలు క్రీడాపోటీలు నిర్వహించారు. కేసీపీ ఆడిటోరియంలో అన్ని విభాగాలకు చెందిన డాన్స్ పోటీల్లో మాచర్ల నియోజకవర్గంలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా ఇక్కుర్తి శంకర్, ఆవుల



వీరాంజనేయులు, నిమ్మగడ్డ సురేష్‌లు వ్యవహించారు. కార్యక్రమంలో భాగంగా ఈ రోజు సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో క్రీడా పోటీలను ప్రముఖ దంత వైద్యులు ఎస్.మురహరిరావు, కల్పనాదేవి, కాకాని నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. పరుగుపందెం, లాంగ్‌జంప్,



హైజంప్, త్రోబాల్, స్కిప్పింగ్ వంటి పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి రోటరీ నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందజేయడం జరుగుతుందని కన్వీనర్ తస్లీమ్ ఇక్కుర్తి శంకర్, ప్రెసిడెంట్ తుమ్మల సత్యప్రసాద్, సెక్రటరీ ఆలేటి కోటేశ్వరరావు, వెంకటరామయ్య, న్యూజనరేషన్ డైరెక్టర్ అన్నపురెడ్డి నాగార్జునరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ సీనియర్ సిటిజన్స్ రోటరీ ఆన్స్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


## రక్తదానం ప్రాణదానంతో సమానం: సూపరింటెండెంట్ డాక్టర్ కేపీ చారి



మాచర్ల, నవంబరు 9 (ప్రభాతవార్త): రక్తదానం ప్రాణదానంతో సమానమని మాచర్ల ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కేపీ చారి అన్నారు. సత్యసాయి శతజయంతి సందర్భంగా సత్యసాయి సేవా సమితి, సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలోని సొసైటీ కాలనీలోని సత్యసాయి సామాజిక ఆరోగ్య సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డాక్టర్ కేపీ చారి, డాక్టర్ దశరథ్‌లు ప్రారంభించి మాట్లాడారు. రక్తదాన శిబిరంలో 40 మంది రక్తదాతలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కేపీ చారి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక రోగులు మృతి చెందుతున్నారన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి తమ రక్తాన్ని దానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బ్యాంగ్ లక్ష్మీ ప్రసన్న, సత్యసాయి ఎడ్యుకేషనల్ సెక్రటరీ అక్కినేని అనిల్, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు, సత్యసాయి విద్యావిహార్ ప్రిన్సిపల్ వై.రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ మాధురవాణి, ఉపాధ్యాయులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

### మాచర్ల జూనియర్ సివిల్ కోర్టు జడ్జిలు శ్రీనివాస్ కళ్యాణ్, ప్రశాంత్



విజయపురిసౌత్, నవంబరు 9 (ప్రభాతవార్త): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మాచర్ల జూనియర్ సివిల్ కోర్టు జడ్జిలు శ్రీనివాస్ కళ్యాణ్, ప్రశాంత్ అన్నారు. ఆదివారం విజయపురిసౌత్‌లోని పీటీజీ పాఠశాలలో లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జిలు మాట్లాడుతూ చట్టం దృష్టిలో అందరూ సమానులేనని, అందరికీ న్యాయ సేవలు అందించాలన్నదే తమ ఉద్దేశమన్నారు. ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై, పాఠశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికిన నేతలు

గుంటూరు వెస్ట్ నవంబర్ 9, ప్రభాత వార్త :గుంటూరు లో పెద్దకాకాని దగ్గర శంకర్ కంటి హాస్పిటల్ లో నూతన భవనం ప్రారంభత్సవం కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుకు హెలిపాడ్ వద్ద స్వాగతం పలికిన తెలుగుదేశం పార్టీ నాయకులు.. ప్రత్తిపాడు





నియోజకవర్గ ఎమ్మెల్యే రామాంజనేయులు, పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, తాటికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గుంటూరు నగర డిప్యూటీ మేయర్ షేక్ సజీల తదితరులున్నారు.

## కళాకారుడు సత్యనారాయణ మృతి

పెదనందిపాడు నవంబర్ 9 (ప్రభాతవార్త) పెదనందిపాడు కు చెందిన సీనియర్ పౌరాణిక నాటక .చెక్కభజన. కర్ర సాము కళాకారుడు నిమ్మగడ్డ సత్యనారాయణ (83) ఆదివారం ఉదయం వారి స్వగృహంలో మృతి చెందారు. వారి భార్య బాపమ్మ గతంలోనే మృతిచెందారు. కొడుకు న్యాయవాది



వృత్తిలో ఉండగా. కూతురు గృహిణి. వారి ప్రధాన వృత్తి వ్యవసాయం అయినప్పటికీ వ్యవసాయం చేస్తూనే పౌరాణిక నాటకాలు చెక్కభజన కర్ర సాము పట్ల ఆసక్తితో. అటు నాటకాలలోనూ చెక్కభజన లోను కర్ర సాములోను పట్టు సాధించారు. నేటి యువతకి కర్ర సాము నేర్పుతూ. వారి గురువుగా ప్రశంసలు అందుకున్నారు. సత్యనారాయణ మృతదేహాన్ని నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్రావు. పెదనందిపాడు మండల టిడిపి అధ్యక్షులు కోడూరి రాంబాబు. గ్రామ పార్టీ అధ్యక్షులు రావి శివరామకృష్ణయ్య తదితరులు సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజమోహన్రావు మాట్లాడుతూ అనేక కళ రంగాల పట్ల ఆసక్తి కలిగి ఉండేవాడని తాము నిర్వహిస్తున్న కామ్రేడ్ కొల్లా వెంకయ్య గ్రంధాలయ వార్షికోత్సవాల్లో పాల్గొంటూ కర్ర సాము ప్రదర్శిస్తూ 83 ఏళ్ళ వయసులో కూడా నేటి యువతకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. వారి మృతి కళారంగానికి లోటు అన్నారు.

## 120 మందికి వైద్య పరీక్షలు



పెదనందిపాడు నవంబర్ 9 (ప్రభాతవార్త) గుంటూరు శ్రీ సత్య సాయి హాస్పిటల్ వారు పెదనందిపాడు అశోక హై స్కూల్ లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస నాయుడు డాక్టర్ ప్రసన్న లక్ష్మీ నాయుడు లు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ సెక్రెటరీ పో పూరి లక్ష్మీ నారాయణ ను హాస్పిటల్ వారు ఘనంగా సత్కరించారు.

## ఏఎన్‌యులో విగ్రహాలను పరిశీలించిన అధికారులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబరు9, ప్రభాతవార్త: ఏఎన్‌యులో ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్న విగ్రహాలను వర్సిటీ అధికారులు పరిశీలించారు. గత వీసి ఆచార్య రాజశేఖర్ వర్సిటీలో ప్రధాన రహదారులను రెండు భాగాలనుగా విభజించి సెంట్రల్ యూనివర్సిటీ అప్పీయరెన్స్ తీసుకువచ్చారు. ఈ క్రమంలో పలు కూడళ్ళలో దేశానికి, యువతకు స్ఫూర్తిగా నిలిచిన పలువురు జాతీయ నాయకులకు సంబంధించిన విగ్రహాలను ఏర్పాటుచేశారు. వీటిల్లో కొన్ని విగ్రహాలు ఐరన్ స్క్రాప్‌తో రూపొందించగా కొన్ని విగ్రహాలను కాంస్యంతో తయారుచేయించారు. స్క్రాప్‌తో చేసిన అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, కోమురం భీం, నేతాజి సుభాష్ చంద్రబోస్, రవీంద్ర నాథ్ ఠాగూర్‌ల విగ్రహాలు ఆవిష్కరించారు. గతంలో పనిచేసిన వీసిలు



మహాత్మాగాంధీ, మహాత్మ జోతిరావు ఫూలే, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రాం, డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం విగ్రహాలను ఏర్పాటుచేశారు. విద్యార్థుల నుంచి వచ్చిన వినతుల మేరకు ఆయా విగ్రహాలను ఏర్పాటుచేయడం జరిగింది. అదేవిధంగా ఆర్కిటెక్చర్ కళాశాల కూడలిలో స్వామి వివేకానంద, మహిళా వసతిగృహాల కూడలిలో మదర్ థెరిస్సా విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఆచార్య రాజశేఖర్ వీసిగా ఉన్న సమయంలో 2024 ఏప్రిల్2న స్వామివివేకానంద విగ్రహం తయారుచేసి అందించాలని విజయవాడలోని శ్రీ సాయిబాబా మెగా శిల్పశాలకు సప్లై ఆర్డర్‌ను ఇచ్చారు. ఆవిగ్రహానికి రూ.7లక్షలు (జి.ఎస్.టితో కలిపి) కేటాయించారు. కాగా ఆవిగ్రహం 2024 జూలై5న విశ్వవిద్యాలయానికి చేరింది. అప్పటికే ఆచార్య రాజశేఖర్ తన విధుల నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవడంతో విగ్రహం ఏర్పాటు నిలిచిపోయింది. వర్సిటీకి వచ్చిన విగ్రహాన్ని అధికారులు ఇంజనీరింగ్ విభాగానికి అప్పగించారు. అప్పటి నుంచి ఆ విగ్రహం వర్సిటీలోని కో ఆపరేటివ్ స్టోర్స్ కార్యాలయంలో బద్రపరిచారు. అదే ఏడాది జూలై 9న విగ్రహానికి సంబంధించిన బిల్లులను అకౌంట్స్ విభాగానికి చేరాయి. అప్పటికి ప్రభుత్వం నూతన వీసి, ఇతర అధికారులను నియమించకపోవడంతో విగ్రహం ఏర్పాటు అంశం పరిగణలోకి రాలేదు. ప్రస్తుతం వివేకానంద విగ్రహం కోఆపరేటివ్ స్టోర్ కార్యాలయంలో ఉంది.

## ఏఎన్‌యులో కొందరికి మోదం- మరికొందరికి ఖేదం..?

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబరు9, ప్రభాతవార్త: ఏఎన్‌యు ప్రస్తుత పాలకులు అవలంబిస్తున్న తీరు పలు విమర్శలకు తావిస్తోంది. పాలకులు తీసుకునే నిర్ణయాలు పలువురికి సంతోషంగా కొందరికి దుఖ:గా మారినట్లు పలువురు పేర్కొంటున్నారు. వర్సిటీలో పర్మినెంట్, కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీ, హానరరీ ప్రొఫెసర్ కేటగిరిలో అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పర్మినెంట్ అధ్యాపకులకు ఉద్యోగ విరమణ



వయస్సు 62 ఏళ్ళ నుంచి 65 ఏళ్ళ వరకు పొడిగించింది. అలాగే పర్మినెంట్ నాన్ టీచింగ్ ఉద్యోగులకు 60ఏళ్ళ నుంచి 62 ఏళ్ళకు ఉద్యోగ విరమణ వయస్సు పొడిగించింది. అంతటితో బాగానే ఉంది. కాంట్రాక్ట్ అధ్యాపకులకు, పర్మినెంట్ కాని నాన్ టీచింగ్ అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సు 60 ఏళ్ళ వరకు మాత్రమే ఉన్నట్లు తెలిసింది. దీంతో నాన్ టీచింగ్ ఉద్యోగులకు 60ఏళ్ళు రాగానే ఉద్యోగ విరమణ చేస్తున్నారు. కానీ 70సంవత్సరాలు దాటినాకూడా అధ్యాపకులు హానరరీ ప్రొఫెసర్లుగా, గెస్ట్ ఫ్యాకల్టీగా వర్సిటీ అధికారులు నియమిస్తున్నారు. రోజు రోజుకు నిరుద్యోగులు పెరుగుతున్నా నాగార్జున యూనివర్సిటీలో తీసుకుంటున్న ఇటువంటి నిర్ణయాలు ప్రభుత్వానికి సైతం పిర్యాదుల రూపంలో వెళ్ళినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా సెప్టెంబరుతో కాంట్రాక్ట్ అధ్యాపకుల సర్వీస్ ముగిసింది. ఆ కాంట్రాక్ట్‌ను మరో ఏడాది పొడిగిస్తూ అక్టోబరు 9న వీసి ఆదేశాలతో రిజిస్ట్రార్ ఉత్తర్వులు ఇచ్చారు. ఇందులో అధ్యాపకులు ఫ్రెష్ అగ్రిమెంట్ ఇవ్వాలని ఉత్తర్వుల్లో సూచించారు. ఇందులో కొంతమంది అధ్యాపకులు ఉద్యోగవిరమణకు చేరుకున్నారు. వారిలో పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించని కొందరు వర్సిటీకి వస్తున్నారు. వారిలో కొందరిరిని నియమించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వారి నియామకంపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఎటువంటి నియామకాలు చేపట్టకూడదని ప్రభుత్వం ఆదేశించింది. అక్టోబరు 8న రెగ్యులర్ వీసిగా ఆచార్య సత్యన్నారాయణ రాజును ప్రభుత్వం నియమించింది. అప్పటినుంచి నియామకాలు లేవు, కానీ కొందరు మాత్రం ఉద్యోగవిరమణ చేసినా కూడా అధ్యాపకులుగా కొనసాగుతున్నట్లు వర్సిటీలో ప్రధాన చర్చగా మారింది.

## శ్రీకృష్ణుడి ఆలయ పునర్నిర్మాణానికి మంత్రి నారా లోకేష్ రూ.5 లక్షల విరాళం

మంగళగిరి, నవంబర్ 9, ప్రభాతవార్త: మంగళగిరి మండలం యర్రబాలెం గ్రామంలోని యాదవపాలెంలో ఉన్న శ్రీకృష్ణుడు ఆలయం పునః నిర్మాణానికి మంత్రి నారా లోకేష్ విరాళం అందించారు. ఆదివారం మంత్రి నారా లోకేష్ పంపించిన రూ. 5 లక్షల విరాళాన్ని స్థానిక నాయకులు కమిటీ సభ్యులకు అందజేశారు. దేవస్థానం ఆలయం పునః నిర్మాణానికి సహకరించిన మంత్రి నారా



లోకేష్ కు యర్రబాలెం గ్రామ ప్రజలు, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా , మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాస్, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి మాట్లాడుతూ శ్రీకృష్ణుడు కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని, శ్రీకృష్ణుడు యొక్క ఆశీస్సులు ఎల్లప్పుడు మంత్రి నారా లోకేష్‌కు ఉండాలని కోరారు. భవిష్యత్ తరాలకు ఆధ్యాత్మిక శక్తిని అందించేందుకు మంత్రి నారా లోకేష్ ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆలయంకు విరాళం ఇవ్వడం జరిగిందన్నారు. శ్రీ కృష్ణుడు ఆలయం పున:నిర్మాణంలో ప్రజలు, భక్తులు తమ వంతు సహాయ సహకారాలు అందించి ఆలయ నిర్మాణంలో పాత్రులు కావాలని కోరారు. శ్రీకృష్ణుడి ఆలయం పునః నిర్మాణానికి శ్రీకారం చుట్టిన కమిటీ సభ్యులందరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరావతి జేఏసీ నాయకులు, టీడీపీ సీనియర్ నాయకులు ఆకుల ఉమామహేశ్వరరావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు చావలి ఉల్లయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు నీలం అంకరావు, ఆకుల పానకాల రావు, గడదాసు రంగారావు, అర్థాల పిచ్చయ్య, కర్నాటి సత్యనారాయణ, తోట శ్రీను, తోట సురేష్, మిర్యాల సత్యనారాయణ, యలమంచిలి పద్మజ, అప్పల శాంతి, దానబోయిన శివశంకరరావు, రుద్రు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రెడ్డి కార్తీక వనసమారాధన

వినుకొండ,నవంబర్9,ప్రభాతవార్త: యోగివేమారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో రెడ్డి కార్తీక వనసమారాధన కార్యక్రమం స్థానిక వెల్లటూరు రోడ్డు నందు గల సేవా సమితి భవనం నందు



ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆట పాటలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయగా చిన్న,పెద్ద ఉల్లాసంగా పాల్గొని గడిపారు. మెరిట్ విద్యార్థులు 44 మందికి దాతల చేతుల మీదుగా రూ.14లక్షలు స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్ల సంఘం అధ్యక్షులు ఆర్.శివారెడ్డి (ఎల్‌ఐసి),సెక్రటరీ పెద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి,ట్రెజరర్ ఎర్రరామిరెడ్డి,సంఘ పెద్దలు,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక వనసమారాధనలో పాల్గొన్న చీఫ్‌విప్ జీ.వీ, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన

వినుకొండ,నవంబర్9,ప్రభాతవార్త: ఎన్నార్టీ పట్టణంలోని కమ్మ హాస్టల్ నందు జరిగిన కమ్మ కార్తీక వనసమారాధన కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,వినుకొండ ఎమె మ్మెల్యే జీ.వీ ఆంజనేయులు,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు ఆదివారం పాల్గొన్నారు. ముందుగా స్వర్గీయ అన్న నందమూరి తారకరామారావు,పల్నాటి పులి డాక్టర్ కోడెల శివప్రసాదరావుల కాంస్య



విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వనసమారాధన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రేమ విందులో ఉత్సాహంగా పాల్గొని చిన్న,పెద్దను కరచాలనం,ఆలింగనం చేసుకొని ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా జీ.వీ,మక్కెన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిక,సాంప్రదాయలు గురించి నేటి యువత తెలుసుకునేందుకు,సామాజిక సామరస్యత,ఐక్యత మరింత బలపడేందుకు వనసమారాధన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు.

## డివిజన్ స్థాయిలో విజేతలుగా నిలిచిన రెయిన్‌బో విద్యార్థులు

కారంపూడి, నవంబరు 9 ప్రభాతవార్త: గురజాల డివిజన్ స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో కారంపూడి రెయిన్‌బో ఇంగ్లీషు మీడియం విద్యార్థులు విజేతలుగా నిలిచారని ప్రిన్సిపల్ కె.వెంకట్రావు తెలిపారు. అండర్-17 బాలుర కబడ్డీ పోటీల్లో 2, అండర్ -17 బాలుర ఖోఖో పోటీల్లో 1 విజేతలుగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపల్ వెంకట్రావు, ఎం.రామలింగారెడ్డి, కె.చందు, ఫిజికల్ డైరెక్టర్స్, బి.హనుమంతరావునాయక్, సీహెచ్ రవీంద్ర, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందించారు.



## రోడ్డుపై విరిగిపడ్డ ఏళ్లనాటి చింతచెట్టు



కారంపూడి, నవంబరు 9 ప్రభాతవార్త: మండల కేంద్రమైన కారంపూడిలోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో ఏళ్లనాటి భారీ చింతచెట్టు ఆకస్మికంగా రోడ్డుపై ఆదివారం విరిగిపడింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో రహదారిపై పాదచారులు, వాహనాలు తక్కువగా ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పింది. చెట్టు విద్యుత్తు తీగలపై పడే అవకాశం ఉండటంతో స్థానికులు విద్యుత్తు శాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వెంటనే విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో ప్రాణాపాయం తప్పింది. దీంతో కొంతసమయం ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. అధికారులు వెంటనే చెట్టును తొలగించారు.

## నిషేధిత మందుల విక్రయాలకు అడ్డాగా కారంపూడి...

### తెలంగాణ పోలీసుల అదుపులో మందులషాపు వ్యాపారి

కారంపూడి, నవంబరు 9 ప్రభాతవార్త: మండల కేంద్రమైన కారంపూడిలో నిషేధిత మందులకు అడ్డాగా మారింది. కారంపూడిలోని ఓ మందుల షాపులో స్పాస్మో ప్రోక్సివాన్ ప్లస్ ఆల్ ప్రాక్స్ మందులను విక్రయిస్తున్నారు. ప్రభుత్వం నిషేధించినప్పటికీ మందుల షాపుల యజమానులు మాత్రం అమ్మకాలు జరుపుతున్నారు. ప్రభుత్వం నిషేధించిన మందులను నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన కొందరు యువకులకు అమ్మకాలు జరపడంతో సమాచారం అందుకున్న పోలీసులు శనివారం కారంపూడిలోని మందుల షాపులో తనిఖీలు చేపట్టి మందుల షాపు వ్యాపారిని అదుపులోకి తీసుకున్నారు. షాపులో ఉన్న మందులను స్వాధీనం చేసుకున్నారు.


**ప్రజల ప్రాణాలతో చెలగాటం:** ప్రభుత్వం నిషేధించినప్పటికీ మందుల షాపుల వ్యాపారులు లాభాలను పెంచుకోవడానికి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. వైద్యులు ధ్రువీకరించిన మందులను మాత్రమే ఇవ్వాల్సిన వ్యాపారులు తమ సొంత వైద్యం చేస్తున్నారు. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఆల్‌ప్రాక్స్ మందులను పొడి చేసి ప్రత్యేక ప్యాకెట్‌లో ప్యాకింగ్ చేసి యువతకు, కల్లు దుకాణాలకు, ఓ ఆర్ఎంపీ వైద్యుని ద్వారా తెలంగాణ రాష్ట్రానికి పంపించిన సందర్భాలు ఉన్నారు. ఆ సమయంలో తెలంగాణ పోలీసులు ఆ మందుల షాపు వ్యాపారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. కారంపూడి నుంచే నిషేధిత మందులు తరలిపోతున్నా ఔషధ నియంత్రణ అధికారులు మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. మండలంలో ఏనాడూ తనిఖీలు చేపట్టకపోవడంతో నిషేధిత మందుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికైనా ఔషధ నియంత్రణ అధికారులు తనిఖీలు చేస్తే మరికొన్ని నిషేధిత మందులు వెలుగులోకి వస్తాయని పలువురు అంటున్నారు.

## వీరారాధనోత్సవాల సందర్భంగా జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన

కారంపూడి, నవంబరు 9 ప్రభాతవార్త: పల్నాటి వీరారాధనోత్సవాల సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జాతీయస్థాయి ఎడ్ల పందేలు జరుగుతాయని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. 18న 6 పళ్ల విభాగం, 19న కేటగిరీ విభాగం, 20న జూనియర్ విభాగం, 21న సీనియర్ విభాగం, 22న 2 పళ్ల విభాగం, 23న నాలుగు పళ్ల విభాగం ఎడ్లకు బలప్రదర్శన జరుగుతుందని, గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని రైతులు ఎడ్ల బల ప్రదర్శనలో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమాలకు శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నట్లు తెలిపారు.

## ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్, ఎయిమ్స్ మంగళగిరి సంయుక్తంగా స్ట్రోక్ సింపోజియం

గుంటూరు వెస్ట్, నవంబర్ 9, ప్రభాతవార్త: ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్, అయిమ్స్ మంగళగిరి న్యూరాలజీ విభాగం సంయుక్తంగా స్ట్రోక్ అకాడమీ సింపోసియంను నవంబర్ 9న మంగళగిరి ఎయిమ్స్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా పక్షవాతం పై అవగాహన, మరియు సకాలంలో





స్పందన పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.భారతదేశంలో ప్రతి సంవత్సరం 18 లక్షల మంది పక్షవాత బారిన పడుతున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, ఒత్తిడి, ధూమపానం, అధిక బరువు వంటి కారణాలతో యువతలో కూడా కేసులు పెరుగుతున్నాయి. ప్రజల్లో అవగాహన లోపం, ఆలస్యమైన వైద్యం కారణంగా ప్రాణనష్టం అధికమవుతోంది.బేఫాస్ట్ అనే సంక్షిప్త పద్ధతి ద్వారా పక్షవాతం ను తక్షణం గుర్తించవచ్చు .ముఖ్య అతిథి, ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ తో పాటు, గౌరవ అతిథులుగా ప్రొ. సుశీల్ శర్మ , ప్రొ. దీప్తి , కల్నల్ శశికాంత్ తుమ్మ , డా. ముత్తు వెంకటాచలం ప్రారంభించారు. ఈ సదస్సులో ఐఏఎస్ సెక్రటరీ, డా.అరవింద్ శర్మ, డా.అలెక్స్ రిబెల్లో, డా.టి.అశోక్ వర్ధన్ రెడ్డి, డా.వివేక్ లంక, డా.సుధీర్ చక్రవర్తి, మేజర్ జనరల్ డా.ఎస్.కుమారవేలు , డా.రౌనక్ కుమార్ వంటి నిపుణులు పాల్గొని వివిధ అంశాల పై ప్రసంగించారు.

# ఘనంగా రుద్రాభిషేకాలు





రేపల్లె, నవంబరు 9, ప్రభాతవార్త: కార్తీకమాసం సందర్భంగా ఇసుకపల్లిలోని శ్రీ భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. అన్నంతో అభిషేకం చేశారు. లక్ష బిల్వార్చన శాస్త్రోక్తంగా జరిగింది. మంత్ర పుష్పం సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వాహణాధికారి దీవి వెంకట అప్పలా చార్యులు, అర్చకులు కొమ్మూరు శివరామ కృష్ణప్రసాద్, కొమ్మూరు పవన్ కుమార్ శర్మ, యాగ్నిక స్వామి మణిశర్మ, వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## సంతకాల సేకరణ..ను విజయవంతం చేయాలి

రేపల్లె, నవంబరు 9, ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల ప్రకారం రేపల్లె నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ ఈవూరి గణేష్ నాయకత్వంలో ఆదివారం పట్టణంలోని 24, 26 వార్డుల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సేవ్ మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ చిమటా బాలాజీ, టౌన్ కన్వీనర్ కరేటి శేషగిరిరావు, 26 వార్డు ఇన్చార్జి ఖుర్దుస్, 24 వ వార్డు ఇన్చార్జి ఫణి, బాపట్ల జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకట కృష్ణారెడ్డి, రేపల్లె నియోజకవర్గం మహిళా విభాగం కన్వీనర్ వీసం నాగలక్ష్మి, రేపల్లె పట్టణ మహిళా విభాగం కన్వీనర్ బంర్రెడ్డి ఉమారాణి, వాణి, పార్థు, కవిత, గౌస్, ఖాదర్ బాషా, గోపి, శివ, చైతన్య, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



## యువకుడు మృతి



రేపల్లె, నవంబరు 9, ప్రభాతవార్త: భట్టిప్రోలు మండలంలోని 216 జాతీయ రహదారిలో సూరేపల్లి రైల్వే బ్రిడ్జి సమీపంలో ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం రేపల్లె నుండి స్కూటీపై చెరుకుపల్లి మండలంలోని గూడవల్లికి చెందిన ఎస్ కె అహ్మద్ వలీ వస్తుండగా వెనుక నుండి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో అహ్మద్ వలీ(27) మృతి చెందాడు. మృతుని భార్య పి.సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు.

## వాహనదారులు హెల్మెట్ ధరించాలి



రేపల్లె, నవంబరు 9, ప్రభాతవార్త: రహదారులపై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ఎం.శివయ్య కోరారు. ఆదివారం భట్టిప్రోలులో హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్య క్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ తప్పనిసరిగా వినియోగిస్తే ఎలాంటి ప్రమాదం ఉండదని రక్షణగా ఉంటుందని ప్రతి ద్విచక్ర వాహనదారుడు గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

## గంగానమ్మా..నీకు దండాలమ్మా..

కొల్లిపర, నవంబరు 9 ప్రభాతవార్త: ఒక వైపు భజంత్రీలు...మేళతాళాల మధ్యలో గంగానమ్మకు ప్రతి రూపమైన ఘటంకుండ ఊరేగింపు...మరోవైపు ప్రతి ఇంటికీ బంధువులు రాకతో ఇంటిళ్ళపాదీ సందడే..సందండి..ఏ వీధి చూసిన జనం..జనం..ప్రభంజనం..గ్రామమంతా పండుగ వాతావరణం...ఇంకో వైపున కళాకారుల డప్పువాయిద్యాలు....మధ్యలో ఎడ్ల జతలు..ఇంకో వైపున శ్రీగంగానమ్మతల్లికి మొక్కుబడులు తీర్చుకునే భక్త జనసందోహం..వారంతా అడుగుమడుగులు...నెత్తిమీద మొలకలు పెట్టుకుని ఆలయం వరకు కాలినడకతో వెళ్ళటం..కొందరు మెడల్లో గారెల బూరెలు దండలు వేసుకుని గుంపులు..గుంపులుగా కలసి వెళుతుంటే అంతా సందడే..సందడిగా ఉంది..చూడటానికి కనులపండువగా ఉంది..ఇదంతా మండల కేంద్రం కొల్లిపరలో శ్రీగంగానమ్మ కొలుపులు పురస్కరించుకుని వోటు చేసుకున్న దృశ్యాలు...వివరాల్లోకి వెళితే కొల్లిపరలో శ్రీగంగానమ్మ కొలుపులు రెండేళ్ళకు ఒకసారి ఘనంగా నిర్వహిస్తారు. గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని గ్రామ దేవతలకు మొక్కుకుని, ఆ మొక్కులను కొలుపులు నిర్వహించేటప్పుడు తీర్చుకుంటారు. శ్రీగంగానమ్మతల్లి క్షుద్రశక్తుల నుంచి గ్రామాన్ని కాపాడుతుందనేది గ్రామస్తుల నమ్మకం..దీనిలో భాగంగా కొల్లిపరలో అక్టోబరు 26 వ తేదీన ప్రారంభమయిన కొలుపులు అప్పటి నుండి 15 రోజుల పాటు నిత్యం ఘటం కుండ గ్రామంలో తిరగటంతో ప్రతి ఇంటిలో వండిన అన్నంలో తొలిముద్దను తీసి శ్రీగంగానమ్మకు ప్రతి రూపమైన ఘటకుండలో పెడుతున్నారు. నవంబరు 9 వ తేదీన శ్రీగంగానమ్మ చెట్టు వద్ద ఏర్పాటు చేసిన పుంత వద్ద నుండి అమ్మవారి ప్రతి రూపమైన ఘటంకుండను నెత్తిన ఎత్తుకుని గ్రామంలో అన్ని ముఠాలు, గ్రామస్తులు కలసి ఊరేగింపుగా మేళతాళాలతో శ్రీగంగానమ్మతల్లి దేవాలయంకు చేరుకున్నారు. ఆ తల్లిని దేవాలయం చుట్టూ తిప్పి ఆలయంలో ఉంచారు..మొక్కులు ఉన్న వారితో పాటు గ్రామస్తులు అందరూ ఆలయం చుట్టూ గారెల బూరెల దండలు మెడలో వేసుకుని..మొలకలు నెత్తిన పెట్టుకుని తిరిగారు. కొందరు భక్తులు నెత్తిమీద వేయినోళ్ళ కుండను పెట్టుకుని నడిచారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శ్రీగంగానమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయం చుట్టూ మూడుసార్లు తిరిగాక ఆ దండలను..మొలకలను తీసేసి శ్రీగంగానమ్మతల్లిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. గ్రామం అంతా అన్ని వీధులలో వివిధ పార్టీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసారు..ఉదయం 10 గంటల నుండి అన్ని వీధులు సందడిగా మారాయి. ఎటువంటి సంఘటనలు జరగకుండా డీఎస్పీ ఆదేశాల మేరకు గ్రామంలో సీఐ ఉమేష్, ఎస్ఐ కోటేశ్వరరావు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు. సాయంత్రం కు ఇతర ప్రాంతాల నుంచి కొలుపులకు వచ్చిన వారు ఎక్కువగా ఒకరికి ఒకరు టాటాలు చెప్పుకుంటూ వెళ్ళిపోయారు..కొలుపులు పురస్కరించుకుని ఆర్టీసి బస్సులు రద్దీగా నడిచాయి...గ్రామమంతా పండగ వాతావరణం తలపించింది..











## ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు: తెనాలి రూరల్ సీఐ ఉమేష్‌చంద్ర



కొల్లిపర, నవంబరు 9 ప్రభాతవార్త: కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతుండటంతో పోలీసులను ఏర్పాటు చేయటం జరిగిందని...ఇసుకను అక్రమంగా తవ్వకాలు జరిపినట్లు తెలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేయటంతో పాటు వారిపై కేసు నమోదు చేయనున్నట్లు తెనాలి రూరల్ సీఐ ఉమేష్‌చంద్ర హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని మున్నంగి ఇసుక రీచ్‌ను సీఐ ఉమేష్‌చంద్ర..ఎస్ఐ కోటేశ్వరరావుతో కలసి తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఉమేష్‌చంద్ర మాట్లాడుతూ బిల్లులు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## కార్తీక వనసమారాధనల కోలాహలం: హాజరైన మంత్రి నాదెండ్ల

తెనాలి మున్సిపాలిటీ నవంబర్ 9 (ప్రభాతవార్త): పట్టణంలో ఆదివారం, కార్తీక వన సమారాధనలు కోలాహలంగా సందడిగా జరిగాయి. చెంచుపేట లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో జరిగిన చంద్రవంశ యాదవ రాజుల కార్తీక వన సమారాధన మహోత్సవ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని మాట్లాడుతూ, తెనాలి ప్రాంత అభివృద్ధిలో యాదవ సోదరులు భాగస్వామ్యం కావాలని, మీరంతా ఐకమ త్యంగా ఉండాలని, త్వరలోనే పట్టణంలో యాదవ సంఘీ యులకు కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, వ్యవ సాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ తోట దుర్గాప్రసాద్ లను సంఘీయులు ఘనంగా సత్కరించారు. అలాగే రైల్వే ఇన్స్టిట్యూట్ ప్రాంగణంలో జరిగిన కాపు ఉద్యోగుల కార్తీక వన సమారాధన మహోత్సవంలో పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్, కాపు ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైకుంఠపురం దేవస్థానంలో జరిగిన పద్మశాలీయ కార్తీక వన సమారాధన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం బీసీలకు, పద్మశాలి సంఘీయులకు అండగా ఉంటుందని, పాలనలో వారిని భాగస్వాములుగా చేర్చుకోవడం జరిగిందని, చేనేత వర్గాలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. అలాగే చినరావూరు లోని ఐటిఐ కాలేజీలో జరిగిన జై గౌడ వారి కార్తీక వన సమారాధన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని వారికి అభినందనలు తెలియజేశారు. అనంతరం పట్టణంలోని నూకల రామకోటేశ్వరరావు కళ్యాణ మండపంలో జరిగిన అగ్నికుల క్షత్రియ వన సమారాధన మహోత్సవంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, పవిత్రమైన కార్తీక మాసంలో, వన సమారాధన కార్యక్రమాల్లో పాల్గొనటం చాలా ఆనందంగా ఉందని, ఈ విధమైన కార్యక్రమాలు జరుపుకోవటం, ప్రజల్లో భక్తిభావం పెంపొందేందుకు తోడ్పడుతుందని, ఒకరికొకరు సంఘీభావం తెలుపుకుంటూ ఆనందంగా గడపటం అనేది చాలా ఆరోగ్యకరమైన వాతావరణమన్నారు.





## వైకుంఠపురంలో సామూహిక 'సత్య' వ్రతాలు



తెనాలి టౌన్ నవంబర్ 9 (ప్రభాతవార్త): పట్టణంలోని వైకుంఠపురంలో కొలువైవున్న శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతమహోత్సవాలు మూడవ ఆదివారం కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధానంగా ఆదివారం కావటం, కార్తీక వనసమారాధన కార్యక్రమాలు కారణంగా భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయం లోపల, వెలుపల సైతం విపరీతమైన రద్దీ ఉండటంతో చిన్నపిల్లలు వృద్ధులు పలు ఇబ్బందులకు గురయ్యారు. అలాగే ఈ ఆదివారం నిర్వహించిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవాలు సుమారు 100 మందికి పైగా దంపతులు పాల్గొని స్వామి వారి వ్రతాన్ని ఆచరించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా కార్తీకమాసంలో సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్రత మహోత్సవాలను ఆలయ సహాయ కమిషనర్ అనుపమ, అర్చకులు పర్యవేక్షించారు.

## ఆవాజ్ మహాసభలను జయప్రదం చేయండి

తెనాలి మున్సిపాలిటీ నవంబర్ 9 (ప్రభాతవార్త): నవంబర్ 16వ తేదీన జరిగే ఆవాజ్ మూడవ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని, ఆవాజ్ కమిటి సభ్యులు తెలిపారు. శనివారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంనందు ఆవాజ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి ఎస్కే బాషా అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిస్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నిర్మాణాత్మకంగా బలోపేతం కావడం కోసం జిల్లా మహాసభలు, నవంబర్ 16వ తేదీన గుంటూరు నగరంలో జరుగు మూడవ జిల్లా మహాసభలను జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తెనాలి పట్టణ ఆవాజ్ కన్వీ నింగ్ కమిటీ 9 మందితో ఏర్పాటు చేసి జనాబ్ షబ్బీర్ అన్సారీ ని కన్వీనర్ గా ఎన్నుకోవడం జరిగిందని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ బాషా తెలిపారు. ఈ సమావేశంలో షేక్ హుస్సేన్, ఎస్కే కరీం, ఎండి మునీర్ షేక్ అహ్మద్ హుస్సేన్ మరియు దౌలా తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ మణికంఠస్వామి పడిపూజా మహోత్సవం



తెనాలి టౌన్ నవంబర్ 9 (ప్రభాతవార్త): పట్టణంలోని సుల్తానాబాద్ లో చెరుకూరి రమేష్ బాబు గురుస్వామి స్వగృహంలో, శ్రీ హరిహర పుత్రుడు, శబరిమల వాసుడు, శ్రీ మణికంఠ వాసుడు, అయ్యప్ప స్వామి, 22వ సం. పడిపూజా మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో మాల ధరించిన శివ స్వాములు, భవానీలు, అయ్యప్పలు, పెద్ద ఎత్తున పాల్గొని ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప అనే శరణు ఘోషతో, శ్రీ హరి హరపుత్రుని పడిపూజలో పాల్గొన్నారు. పూజ అనంతరం స్వాములకు, భక్తులకు, తీర్థప్రసాదాలు తదుపరి సద్ది వితరణ చేశారు. ఈ సందర్భంగా పడిపూజ కార్యక్రమం నిర్వాహకులైన చెరుకూరి రమేష్ బాబుని అతని కుటుంబ సభ్యులను, పూజ మహోత్సవానికి విచ్చేసిన గురుస్వాములు బ్రాహ్మణులు వేద పండితులు ఆశీర్వదించారు. ఈ పూజ మహోత్సవంలో చెరుకూరి విశ్వేశ్వరరావు, డి. కోటేశ్వరరావు, ధనశేఖర్, అన్నవరపు ప్రసాదరావు, గద్దం రమణమూర్తి, మణికుమార్, చిలక మేస్త్రి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లకు త్రీటౌన్ సిఐ కౌన్సెలింగ్



తెనాలి టౌన్ నవంబర్ 9 (ప్రభాతవార్త): పట్టణంలోని 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు సీఐ ఎస్.సాంబశివరావు ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. గతంలో పలు కేసులు నిందితులుగా ఉన్న సుమారు 35 మందిని స్టేషన్ కి పిలిపించి వారికి పలు సూచనలు చేశారు. ఇకనుంచి మీరంతా సత్ప్రవర్తనంతో మసులుకోవాలని, ఎటువంటి వివాదాల జోలికి వెళ్లకుండా, ఏ రకమైన గొడవల్లో పాల్గొనకుండా, ఏవిధమైన అల్లర్లలో తలదూర్చకుండా మసులుకోవాలని, మీపై నిరంతరం నిఘా ఉంటుందని, ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా ఉండాలని, ఏదైనా సమస్య మీ దృష్టికి వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిని, నేరరహిత ప్రాంతంగా మార్చాలన్నదే తమ ఉద్దేశమన్నారు.

## కొల్లూరు ఆలయంలో ఏకాదశి రుద్రాభిషేకం



కొల్లూరు, నవంబరు 9 (ప్రభాతవార్త) : పంచమి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా కొల్లూరులోని శ్రీ అనంతభోగేశ్వర స్వామి వారికి శ్రీ పార్వతి అమ్మవారి దేవస్ధానం బ్రాహ్మణ సంఘం వారిచే ఆదివారం మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం తదుపరి లక్ష బిల్వార్చన కార్యక్రమాలు కొమ్మూరు వెంకట శివప్రసాద్ గాడేపల్లి శివశర్మ నిర్వహించగా దేవస్థానం బ్రాహ్మణ సంఘ సభ్యులు పర్యవేక్షించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## సంస్కృతి-సంప్రదాయాలను కాపాడుకోవాలి

### -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు, నవంబరు 9, ప్రభాతవార్త: తెలుగువారి సంస్కృతి-సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఆదివారం ఆర్యవైశ్య కార్తీక సమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడుతూ కార్తీక మాసంలో ప్రతి ఒక్కరూ ఉపవాస దీక్షలు చేసి నెల రోజులపాటు స్వామివారి అనుగ్రహాన్ని పొందడం ప్రాచీన కాలం నుంచి వస్తున్న ఆచారమన్నారు. ఇక కార్తీక మాసంలో వన భోజనాలు చేయడం ద్వారా, సోదరభావం, సౌభ్రాతృత్వం, పదిమందితో కలిసి సహపంక్తి భోజనాలు చేయడం ద్వారా తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను రాబోయే తరాలకు తెలియజేయడమేనన్నారు. తొలుత శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి హారతి ఇచ్చి వన సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పలువురు ఆర్యవైశ్య నాయకులు ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌ను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి ఛైర్మన్ కోట రవిశంకర్, రాచపూడి విఘ్నేశ్వరరావు, యామా రాము, కొల్లిపర రమేష్‌బాబు, లింగమల్లు మోహన్ తదితరులున్నారు.



## కూటమి ప్రభుత్వంపై ఉద్యమానికి సిద్ధం కండి!!

### -వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు, నవంబరు 9, ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ప్రజలంతా ఉద్యమానికి సిద్ధం కావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక ఇటికంపాడు రోడ్డులోని యాసిన్ గెస్ట్ హౌలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెద్ద ఎత్తున ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడు తోందన్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయాలు కార్పోరేట్ సంస్థలకు లాభం చేకూర్చేవిధంగానూ, పేదలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 17మెడికల్ కళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేటీకరణ చేయడం పేదలను వైద్య విద్యకు దూరం చేయడమేనన్నారు. రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైఫుల్లా, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి, మునిసిపల్ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బోయిన శివనాగరాజు, వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి ఎందేటి వెంకట సుబ్బయ్య, రాష్ట్ర కమిటి నాయకుడు అమిరినేని సాంబశివరావు, మండల పార్టీ అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ, అంజుమన్ కమిటి గౌరవాధ్యక్షుడు షేక్ మహమ్మద్(మాము), నాయకులు వట్టి ప్రోలు రంగారావు, అంబటి వెంకటేశ్వరరావు, ఆళ్ళ శ్రీరామిరెడ్డి, సర్పంచులు ఆకిశెట్టి గాంధీ, ముద్రబోయిన తిరుపతయ్య, డక్కుమళ్ళ రవి, సుశోభిత, మండ్రు అనిత, కొల్లి శేషిరెడ్డి, కొక్కిలిగడ్డ కిరణ్, చిర్రా అక్కిరెడ్డి, యాతం మమత, మూకిరి అనీలకుమారి, శాబాసు ఈశ్వరయ్య, మామిళ్ళపల్లి మోహనరావు, గోపి, వాసు, మరియరాణి, మూర్తిరాజు, నల్లమోతు రవీంద్రబాబు, పెరికల చైతన్య, గుండాబత్తిన సంసోను, షేక్ మౌలాలి, కూరాకుల ముక్తేశ్వరరావు, పలగాని రమేష్, దాసరి దానమ్మ, బద్దూరి భాస్కరరెడ్డి తదితరులున్నారు.



## కెఎన్‌పిఎస్ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి



పొన్నూరు, నవంబరు 9, ప్రభాతవార్త: కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో ఈనెల 16న శ్రీకాకుళం ఇలిసిపురం అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగం ఆమోదించబడిందన్నారు. ఈ సందర్భంగా జరిగే కెఎన్‌పిఎస్ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కెఎన్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ మాట్లాడుతూ డ్రాఫ్టింగ్ కమిటి ఛైర్మన్ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వ్రాసిన రాజ్యాంగాన్ని సంఘ్ పరివార్ శక్తులు మొదటి నుండి వ్యతిరేకిస్తున్నాయన్నారు. రాజ్యాంగాన్ని అతుకుల బొంత అని ప్రచారం చేసిన సంఘ్‌పరివార్ భారత రాజ్యాంగాన్ని మార్చి దాని స్థానంలో మనుస్మృతిని రాజ్యాంగంగా అమలు చేయాలని ప్రయత్నించి విఫలమైందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజ్యాంగ వ్యవస్థలను కాషాయ భావజాలంతో నింపుతున్నారన్నారు. కరపత్రాల ఆవిష్కరణ సభలో ప్రజా సంఘాల నాయకులు కెఎన్‌పిఎస్ తోడేటి శ్రీనివాస్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ తుమాటి రాజారావు, మానవ హక్కుల వేదిక నాయకుడు జిఎస్ రాయెల్, అంబేద్కర్ ఫౌండేషన్ నాయకుడు మామిడి సునీల్, అంబేద్కర్ వాది షేక్ సుబాని, గుడిసెవాసుల సంఘం నాయకుడు బలగాని వెంకటేశ్వర్లు, సోషల్ యాక్టివిస్టు మూకిరి సునీల్, న్యాయవాది ప్రకాష్ తదితరులున్నారు.

## ప్రైవేటీకరణ...ను అడ్డుకోవాలి: జడ్పీటీసి కర్లపూడి రమేష్

వల్లభరావుపాలెం(పొన్నూరు), నవంబరు 9, ప్రభాతవార్త: ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసే విధానాన్ని ప్రతి ఒక్కరూ అడుకోవాలని జడ్పీటీసి సభ్యుడు కర్లపూడి రమేష్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వల్లభరావుపాలెం గ్రామంలో కోటి సంతకాల కార్యక్రమంలో చాలా కాలం తర్వాత పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలకు వైద్య విద్యను దూరం చేసే కుట్రలో భాగమే ఈ ప్రైవేటీకరణ అని చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అన్ని వర్గాల ప్రజలకు నష్టమేనన్నారు. మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. దీని ద్వారా ప్రజలు ప్రభుత్వం చర్యలను తెలుసుకొని తప్పుపడుతున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఐకమత్యంతో ప్రభుత్వం యుద్ధం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ, గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బ్రాహ్మణ ఐక్యవేదిక వనసమారాధన



కొల్లిపర, నవంబరు 9 ప్రభాతవార్త: ఆటలు..పాటలు..పిల్లలు కేరింతలు..ఆనందోత్సాహాల మధ్య మండల పరిధిలోని వల్లభాపురం కృష్ణానదీ తీరాన బ్రహ్మణ ఐక్యవేదిక ఆద్వర్యంలో బ్రహ్మణ వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 300 మందికి పైగా పాల్గొనటంతో ఎంతో ఉత్సాహంగా జరిగింది, వనసమారాధన సందర్భంగా పండితులు సూర్యనారాయణ శాస్త్రి వ్రతాన్ని నిర్వహించి కార్తీక మాసం విశిష్టత గురించి వివరించారు. అనంతరం పలు ఆటలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుతులు అందజేసారు. కార్యక్రమంలో బ్రాహ్మణ ఐక్యవేదిక కమిటీ సభ్యులు పురుషోత్తమశర్మ, నాటక పరిషత్ కమిటీ సభ్యుడు రత్నాకరశాస్త్రి, బ్రాహ్మణ ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి వీరభద్రరావు, బ్రాహ్మణ సంఘం నాయకులు పరాశరం జగన్నాధాచార్యులు, జనార్ధన్‌భట్టార్, రమణశర్మ, భోగేశ్వరరావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## యాదవులకు అండగా బిసివై పార్టీ: రామచంద్ర యాదవ్

తెనాలి మున్సిపాలిటీ నవంబర్ 9 (ప్రభాతవార్త): రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు యాదవులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తూ, వారిని అడగకుతున్నాయని, భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో జరిగిన చంద్రవంశ యాదవ రాజుల కార్తీక వన సమారాధన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. రాజకీయ పార్టీ స్థాపించినాక తొలిసారిగా తెనాలి పట్టణానికి విచ్చేసిన బోడె రామచంద్ర యాదవ్ పట్టణ శివారు నుండి భారీ ఎత్తున ర్యాలీగా టపాసులతో, సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా యువత పెద్ద ఎత్తున బిసివై పార్టీకి చెందిన జెండాలు చేతపుచ్చుకొని జై మాధవ్ జై యాదవ్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏర్పాటుచేసిన చిన్నారుల నృత్య ప్రదర్శన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు విచ్చేసిన ఆహుతులను అలరించాయి. ఈ సందర్భంగా బీసీవై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ, యాదవ సంఘీయులను అణగదొక్కాలని చూస్తున్న దుష్టశక్తులను తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని, మీకు నేను అండగా ఉంటానని, బీసీవై పార్టీ యాదవులకే కాకుండా బీసీ కులాలన్నిటికీ అండగా ఉంటుందని, ఎక్కడ బీసీలకు అన్యాయం జరిగితే అక్కడ బీసీవై పార్టీ వారికి కొమ్ముగాస్తుందని, రాబోయే రోజుల్లో బీసీలదే రాజ్యాధికారం అని, ఆ దిశగా బీసీవై పార్టీ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యాదవ సంఘ ప్రముఖులను, వన సమారాధన కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.



# చిలకలూరిపేట కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో
# పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

చిలకలూరిపేట, నవంబర్ 9, ప్రభాతవార్త: చిలకలూరిపేట కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బొప్పూడి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి కళ్యాణ మండపంలో ఆదివారం కార్తీక వనభోజనం మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్, ప్రతిపాటి సతీమణి వెంకట కుమారి, ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కొడాలి వెంకట సుబ్బారావు, చిలకలూరిపేట మాజీ శాసన సభ్యురాలు డాక్టర్ కందిమల్ల జయమ్మ,






కాకతీయ సేవా సమితి గౌరవ అధ్యక్షులు తేళ్ళ సుబ్బారావు, రాష్ట్ర కాకతీయ సేవా సమాఖ్య ఉపాధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు, చిలకలూరిపేట కాకతీయ సేవా సమితి అధ్యక్షులు పి పూర్ణచంద్రరావు, చిలకలూరిపేట కాకతీయ సేవా సమితి ప్రధాన కార్యదర్శి దండా గోపి, రాష్ట్ర కాకతీయ సేవా సమాఖ్య కోశాధికారి కొరపాటి అయోధ్య రామారావు, రాష్ట్ర కాకతీయ సేవా సమాఖ్య మహిళా విభాగం కార్యదర్శి కనుమూరి రాజ్యలక్ష్మి, జనసేన రాష్ట్ర నాయకులు పెంట్యాల బాలాజీ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ చిలకలూరిపేట కాకతీయ సేవా సమితి చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. ఈ సంవత్సరం పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించటాన్ని వారు అభినందించారు. ఇదేవిధంగా పేద విద్యార్థులకు చదువుకోడానికి ఆర్థిక సహాయం కొనసాగించాలని వారు కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముతవరపు సురేష్ బాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 10 మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు తాను స్వయంగా అందిస్తానని వివరించారు. తొలుత ప్రత్తిపాటి వెంకట కుమారి, డాక్టర్ కందిమళ్ల, జయమ్మ, టుబాకో బోర్డు మాజీ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు, మహిళా కార్యదర్శి మారెళ్ళ ఇందిరా, దండా విజయ శ్రీ, రాష్ట్ర నాయకులు జ్యోతిప్రజ్వలన గావించారు. చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలోని 1500 మంది రైతులు మహిళలు విద్యార్థులు పాల్గొన్నారు

## క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు




చిలకలూరిపేట, నవంబర్ 9, ప్రభాతవార్త: రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఒమేగా హాస్పిటల్స్ గుంటూరు ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ మహిళలకు ఒక్కొక్కరికి ..7500 రూపాయలు ఖర్చు అయ్యే టెస్టులు ఉచితంగా రోటరీ బిల్డింగ్ హాల్లో డాక్టర్ సుభశ్రీ. 40 మందికి టెస్టులు చేయించడం జరిగినది ఒమేగా హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ లాల్ మహమ్మద్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పుటూరు ప్రసాదు, సెక్రటరీ బోడి రామ సుబ్బారావు, క్లబ్ సభ్యులు ఇన్నర్ వీల్స్ సభ్యులు ప్రెసిడెంట్ నార్నే జయలక్ష్మి, సెక్రటరీ చెన్నుపాటి చైతన్య, ఇన్నర్ వీల్ సభ్యులు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కందిమళ్ల జయమ్మ . ఇన్నర్ వీల్ మాజీ అధ్యక్షులు పుప్పాల రమాదేవి మరియు సభ్యులు పాల్గొనడం జరిగింది

## సత్తెనపల్లి ఎస్టీయు నూతన కార్యవర్గం




సత్తెనపల్లి, నవంబర్ 9 ప్రభాతవార్త : ఎస్టియు శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక జెడ్పీహెచ్ఎస్ గరల్స్ స్కూల్ నందు ఎన్నుకున్నారు. సత్తెనపల్లి మండల అధ్యక్షులుగా పి.వెంకయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కె. మహబూబ్ సుభాని, ఆర్థిక కార్యదర్శిగా బ్రహ్మేంద్రనాయక్‌లు ఎన్నికయ్యారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం మాజీ అధ్యక్షులు సుధీర్‌బాబు, జిల్లా అధ్యక్షులు ఎల్.వి.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రజిత్, ఆర్థిక కార్యదర్శి ఏమండీ, రాష్ట్ర నాయకులు సుభాని, రాజు, అప్పారావు, సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని నాయకులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ చెన్నయ్య మృతి

సత్తెనపల్లి, నవంబర్ 9 ప్రభాతవార్త : సత్తెనపల్లికి చెందిన రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వల్లెం చెన్నయ్య (88) ఆదివారం కనుమూశారు. వారు సిపిఐ పట్టణ కార్యదర్శి చెన్నకేశవరావు తండ్రి అని సిపిఐ పార్టీ నాయకులు తెలిపారు. కుటుంబాన్ని ఎంతో క్రమశిక్షణగా ఆయన నడిపారని గుర్తు చేశారు. పోలీస్ ఆఫీసర్‌గా ఉత్తమ సేవలు అందించారన్నారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపాన్ని తెలియజేశారు.

## కార్తీక వన సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి, నవంబర్ 9 ప్రభాతవార్త : మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ వద్ద ఆదివారం శ్రీకృష్ణదేవరాయ ట్రస్ట్ కార్తీక వన సమారాధన కార్యక్రమంలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్తీక మాసంలో నిర్వహించే ఇటువంటి కార్యక్రమాల వల్ల సామాజిక వర్గ ఐక్యత పెరుగుతుందన్నారు. కాపులు అన్ని రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. తొలుత ఆయనకు కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.

## ఆలయాలలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి, నవంబర్ 9 ప్రభాతవార్త : నరసరావుపేట మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండపై వేంచేసియున్న త్రికోటేశ్వరస్వామిని ఆదివారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దర్శించుకున్నారు. అదే విధంగా మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీమహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనంతో పాటు తీర్థ ప్రసాదాలను, శేష వస్త్రాలను ఆయనకు అందజేశారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ త్రికోటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



### బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కార్తీక వనసమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా...

సత్తెనపల్లి పట్టణంలోని పిడుగురాళ్ళ రోడ్డులో ఉన్న బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కార్తీక వనసమారాధనలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పూజాధి కార్యక్రమాలను నిర్వహించారు. వన సమారాధన ఏర్పాటు చేసుకున్న కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. కార్తీక వన సమారాధన సాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా వెంట రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.



# పల్నాడు జిల్లా వార్త



## కోలాహలంగా కాపు కార్తీక వనసమారాధన

నరసరావుపేట, నవంబరు 9 ప్రభాతవార్త : మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ వద్ద కాపు సంఘీయుల ఆధ్వర్యంలో ఘనంగా ఆదివారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, కన్నా లక్ష్మీనారాయణలు ముఖ్యఅతిథులుగా



హాజరయ్యారు. కాపు సంఘం రాష్ట్ర నాయకులు చందు జనార్థన్, జిల్లా నాయకులు రాయల శ్రీనివాసరావు, పోతుల శంకర్, అల్లంశెట్టి మోహన్‌రావు, గుప్తా శ్రీకాంత్, అద్దేపల్లి ఆనంద్, ఎం.తిరుపతిరావు, మిరియాల సుబ్బమ్మ, కాసా ఆంజనేయులు, కృష్ణంశెట్టి గోవిందు, జూపల్లి రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ వంగవీటి మోహన్‌రంగా – రాధా ఆశయాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. అన్ని రంగాలలో అభివృద్ధి మార్గంలో నడవాలన్నారు. ప్రతి ఏడాది ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వన భోజనాలను విజయవంతం చేస్తున్న కమిటీ సభ్యులను, కాపు సామాజికవర్గ నాయకులు, కార్యకర్తలను అభినందించారు. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను కొనసాగించాలని ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## జగనన్న కాలనీలో రోడ్లు, లైట్లు, త్రాగునీరు కల్పించాలి : గోపిరెడ్డి

నరసరావుపేట, నవంబరు 9 ప్రభాతవార్త : జగనన్న కాలనీలో రోడ్లు, లైట్లు, త్రాగునీటి వంటి కనీస మౌలిక వసతులు నివాసితులకు కల్పించాలని జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం జగనన్న కాలనీలో గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమాన్ని నిర్వహించి నివాసితులతో మాట్లాడారు. కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీని 110 ఎకరాలలో 5 వేల మందికి పైగా ఇళ్ళ పట్టాలు ఇచ్చి వెయ్యి ఇళ్ళ నిర్మాణం పూర్తి చేశామన్నారు. 600 కుటుంబాలు అక్కడ నివాసం ఉంటున్నాయని తెలిపారు. అయితే జగనన్న కాలనీకి వెళ్ళే మార్గం పూర్తిగా ధ్వంసమైందన్నారు. విద్యుత్ లైట్లు లేవని తెలిపారు. 18 నెలల కాలంలో కనీసం వీధి లైట్లు, రోడ్లు, మంచినీరు ప్రభుత్వం ఇవ్వకపోవడం దారుణమన్నారు. జగనన్న కాలనీ బోర్డు తీసేసి ఎన్టీఆర్ కాలనీ అని మాత్రమే బోర్డు పెట్టుకున్న పని మాత్రమే చేశారని తెలిపారు. కొత్త పెన్షన్ ఒక్కటి కూడా ఇవ్వలేదని, కాగా ఉన్న పెన్షన్‌లలో కొన్నింటిని తొలగించారన్నారు. కోటప్పకొండలో 25 సంవత్సరాలుగా ఫిక్స్‌డ్ బాండ్లు ఉన్నాయని, వాటితో పాటు భక్తులు సమర్పించే విరాళాలు వచ్చినా జీతాలు మాత్రం సిబ్బందికి ఇవ్వడం లేదన్నారు. కొండపై కొబ్బరికాయ రూ.50 లు, వాటర్ బాటిల్ రూ.30 లకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం పబ్లిసిటీ పీక్‌లో...మేటర్‌లో మాత్రం వీక్ అని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

## త్రికోటేశ్వరస్వామి ఆలయ అన్నదానానికి విరాళం

నరసరావుపేట, నవంబరు 9 ప్రభాతవార్త : మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండపై వేంచేసియున్న శ్రీ త్రికోటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న అన్నదాన కార్యక్రమానికి భక్తులు ఆదివారం విరాళం అందించారు. వివరాలను ఆలయ కార్య నిర్వహణాధికారి, సహాయక కమిషనర్ డి.చంద్రశేఖరరావు తెలిపారు. విజయవాడకు చెందిన యలవర్తి పద్మజా పేరుతో వారి కుటుంబసభ్యులు యలవర్తి శశిధర్ రూ.1,01,116 లను చెక్కు రూపంలో అందించారన్నారు. స్వామివారి ప్రత్యేక కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమానికి భక్తులు తమవంతు సహకారం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్తీకమాసంలో నిర్వహించే ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాల సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. దాతలకు స్వామివారి దర్శనంతో పాటు తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసినట్లు ఈవో డి.చంద్రశేఖరరావు తెలియజేశారు.



## కొండవీడు ఇ.యన్.టి.హాస్పటల్‌లో అగ్నిమాపకశాఖ డెమో



నరసరావుపేట, నవంబరు 9 ప్రభాతవార్త : కొండవీడు ఇ.యన్.టి.హాస్పటల్‌లో ఆదివారం అగ్నిమాపకశాఖ అధికారులు డెమో నిర్వహించారు. వైద్యశాల ఎం.డి. డాక్టర్ కె.జె.మోహన్‌రెడ్డి, డైరెక్టర్ కె.కోటిరెడ్డి, డాక్టర్ కంజుల శ్రీవర్షిణి, మస్తాన్‌రెడ్డి, వైద్యశాల సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫైర్ అధికారులు అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను తెలియజేశారు. ప్రమాద సమయంలో రోగులను ఎలా కాపాడుకోవాలో ప్రాక్టికల్‌గా చేసి చూపారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ఆస్థి నష్టం, ప్రాణనష్టం తగ్గించే విధానాలను తెలియజేశారు.

## ఏఎంరెడ్డి విద్యాసంస్థల సేవా కార్యక్రమాలు

నరసరావుపేట, నవంబరు 9 ప్రభాతవార్త : ఏఎంరెడ్డి విద్యాసంస్థల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి – శ్రీనివాసరెడ్డి జన్మదినం సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అదే విధంగా పేద మహిళలకు పౌష్టికాహారాన్ని, నూతన దుప్పట్లను అందించారు. గాంధీపార్కు ఆవరణలో పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని అట్లూరి శాంతి – శ్రీనివాసరెడ్డి నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో పాల్గొన్న తమ విద్యాసంస్థల అధ్యాపకులు, విద్యార్థులకు అట్లూరి శాంతి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



## రూరల్ సిఐగా సుబ్బారావు బాధ్యతల స్వీకారం

నరసరావుపేట క్రైం, నవంబరు 9 ప్రభాతవార్త : నరసరావుపేట గ్రామీణ సి.ఐ.గా ఎం.వి.సుబ్బారావు ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సాధారణ బదిలీల్లో భాగంగా నరసరావుపేటకు రావడం జరిగిందన్నారు. తనకు సాదరంగా ఆహ్వానం పలికిన స్టేషన్ అధికారులు, సిబ్బందికి, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. రూరల్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో అందరి సహకారం కోరుతున్నట్లు సి.ఐ. సుబ్బారావు తెలియజేశారు.



## నరసరావుపేటలో భారీ చోరీ

నరసరావుపేట క్రైం, నవంబరు 9 ప్రభాతవార్త : పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో ఓ ఇంట్లో భారీ చోరీ సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికంగా నివాసం ఉండే గడిపూడి సుబ్బారావు – భారతీదేవి దంపతులు తమ ఇంటికి తాళం వేసి పెద్దకూతురు గణపవరంలో నివాసం ఉండటంతో అక్కడకు వెళ్ళారు. ఇంటికి ఆదివారం తిరిగి రాగా ఇంటి తాళం పగులకొట్టి ఉండటం చూసి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఇంట్లోని బీరువాలో దాచిన వంద సెవర్ల బంగారం, కేజీ వెండి, రూ.45 వేలు నగదు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సి.ఐ. షేక్.ఫిరోజ్ ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల నుండి వివరాలు తీసుకున్నారు. వేగంగా ఈ కేసును చేధిస్తామని సి.ఐ.తెలియజేశారు.

## చంద్రబాబు విజన్.. సమర్థత వల్లే ఏపీలో పారిశ్రామిక విప్లవం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబర్ 9, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ రాష్ట్ర పారిశ్రామిక ప్రగతే లక్ష్యంగా పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయంగా ప్రపంచాన్ని చుట్టేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ఆయా దేశాల్లోని అవకాశాలు. వనరుల సద్వినియోగంతో ఏపీని ప్రపంచంలో మేటిగా నిలపడానికి విశేష కృషి చేస్తున్నారన్నారు. పాలకులు సమర్థులైతే ప్రజల ముంగిటకే అభివృద్ధి ఫలాలు చేరతాయనడానికి ప్రత్యక్ష నిదర్శనం ముఖ్యమంత్రి చంద్రబాబు పనితీరు ఆయన విజన్..సమర్థత.. నాయకత్వ పటిమకు ఐటీ, విద్యాశాఖలమంత్రి నారా లోకేశ్ పట్టుదల, పనితీరు తోడై రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవానికి బీజం వేశాయనే చెప్పాలన్నారు. పెట్టుబడుల సాధనే ధ్యేయంగా ప్రపంచాన్ని చుట్టేస్తున్న వారి ధృడ సంకల్పం.. ఏపీని దేశానికే తలమానికంగా అన్నిరంగాల్లో మేటిగా నిలుపుతోందన్నారు. సుదీర్ఘ సముద్రతీరం.. మానవనైపుణ్యాలు.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ పాలసీ.. కూటమిప్రభుత్వ సత్వర స్పందన పారిశ్రామికవేత్తల ఆకర్షణకు విశేష కృషి చేస్తున్నాయన్నారు. తెలంగాణ సంస్థ ప్రీమియర్ ఎనర్జి రూ.6వేల కోట్లు... కుప్పం కేంద్రంగా రూ.2,203 కోట్ల పెట్టుబడులు ఆకర్షణ...రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో కీలక అధ్యాయంగా మారనుంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు.. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ప్రారంభంతో ఏపీ వినూత్న ఆవిష్కరణల కేంద్రంగా నిలవనుందిముఖ్యమంత్రి భరోసా.. ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలే పారిశ్రామికవేత్తల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి సుస్థిర ఆర్థికాభివృద్ధి, మేలైన ఉపాధికల్పనకు ఊతమిచ్చేలా కూటమి ప్రభుత్వం పారిశ్రామిక, అనుబంధ రంగాలను బలోపేతం చేస్తోందన్నారు. . 14, 15 తేదీల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న విశాఖ భాగస్వామ్య సదస్సు ప్రపంచ పారిశ్రామిక రంగాన్ని ఏపీవైపు చూసేలా చేయనుందన్నారు. 410 ఒప్పందాలు.. రూ.9.8 లక్షల పెట్టుబడులతో సదస్సు సాక్షిగా నవ్యాంధ్రప్రదేశ్ పేరు ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనించనుందన్నారు.



ప్రభుత్వంతో ఇప్పటికే జరిగిన పలు ఒప్పందాలకు తోడు..సదస్సులో మరిన్ని కార్యరూపం దాల్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలనుకునేవారికి ముఖ్యమంత్రి ప్రకటించిన బంపర్ ఆఫర్లు ఇందుకు ఎంతో మేలు చేస్తున్నాయని, . పారిశ్రామిక రాయితీలతో పాటు, వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టుబడులకు అధిక ప్రోత్సాహకాలు గతంలో రాష్ట్రాన్ని పట్టి పీడించి, పరిశ్రమల్ని తరిమేసిన రాజకీయ భూతం మరలా రాదన్న సీఎం భరోసా ప్రపంచ టెక్ దిగ్గజాలు, పారిశ్రామికవేత్తల్ని ఏపీవైపు అడుగులు వేయిస్తున్నాయన్నారు. అసమర్థులు గనుకే చేపలు, మాంసం, కూరగాయల దుకాణాల్నే పరిశ్రమలుగా ప్రచారం చేసుకున్నారు పెట్టుబడులు సాధించలేని అసమర్థులు గనుకే గత పాలకులు చేపలు, మాంసం, కూరగాయల దుకాణాల్నే గొప్ప పరిశ్రమలుగా ప్రచారం చేసుకున్నారు. ప్రతిష్టాత్మక దావోస్ సదస్సులో ఫేక్ ఒప్పందాలు, కోడి..గుడ్డు కథలతో రాష్ట్ర ఇమేజ్ ను డ్యామేజ్ చేశారు. గంజాయి తదితర మాదకద్రవ్యాలకు రాష్ట్రాన్ని కేరాఫ్ గా మార్చి అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర పరువు ప్రతిష్టల్ని బజారుకీడ్చారు. ప్రజలకు తలవంపులు మిగిల్చి... మేధాసంపత్తికి మారుపేరైన రాష్ట్ర యువత బంగారు భవిష్యత్ ను నిర్వీర్యం చేశారు." అని మాజీమంత్రి ప్రత్తిపాటి తెలిపారు.

## కమ్మ సామాజికవర్గ కార్తీక వనసమారాధన

నరసరావుపేట, నవంబరు 9 ప్రభాతవార్త : పట్టణంలోని కమ్మ సత్రంలో ప్రతి ఏడాది నిర్వహించే సామాజికవర్గ కార్తీక వన భోజనాలు ఈ ఏడాది ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ జి.వి.ఆంజనేయులు, జిడిసిసి బ్యాంక్ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, టిడిపి



జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపాటి రాము, రాష్ట్ర కార్యదర్శి నాగోతు శౌరయ్య, కోడెల శివరాం, వేములపల్లి వెంకటనరసయ్య పాల్గొన్నారు. కమ్మ సామాజికవర్గ నూతన ఏడాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆశయసాధనే అందరి లక్ష్యమని తెలిపారు. మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు చేసిన సేవలను గుర్తు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## ఇంటర్నేషనల్ వైస్ ఫెడరేషన్ రాష్ట్ర మీడియా కమిటీ డైరెక్టర్‌గా సతీష్‌కుమార్



సత్తెనపల్లి, నవంబర్ 9 ప్రభాతవార్త : ఇంటర్నేషనల్ వైస్ ఫెడరేషన్ రాష్ట్ర మీడియా కమిటీ (ఐవీ ఐఫ్) డైరెక్టర్‌గా సత్తెనపల్లికి చెందిన జర్నలిస్ట్ దివ్వెల సతీష్‌కుమార్ నియమితులయ్యారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోన శ్రీనివాసరావు ఈ నెల 4న నియామక ఉత్తర్వులను అందజేశారు. తనపై నమ్మకంతో పదవిని కేటాయించిన కోన శ్రీనివాసరావుకు, ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌రావుకు, మీడియా కమిటీ ఛైర్మన్ గోగుల శ్రీనివాసరావుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## కొర్రపాడు గ్రామంలో రోడ్డు ప్రమాదం

మేడికొండూరు, నవంబర్ 9ప్రభాతవార్త :మేడికొండూరు మండలంలోని కొర్రపాడు గ్రామంలో ఆదివారం ఆర్టీసీ బస్సు టిప్పరు లారీ ఢీకొన్నవి, టిప్పరు లారీ డ్రైవర్ లకు తీవ్ర గాయాలు అయ్యాయి బస్సు ప్రయాణికులు రక్షి తంగా ఉన్నారని పోలీస్ సిబ్బంది తెలిపారు గాయపడిన వ్యక్తులకు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు .



## లిడ్‌క్యాప్స్‌కు సంబంధించిన భూములను కబ్జాదారుల నుండి కాపాడుకుందాం: ఏపీ చర్మకారుల సేవా సంఘం.

క్రోసూరు, నవంబర్ 9 ప్రభాతవార్త: ఏపీ చర్మకారుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్ల రాజారావు గారి పిలుపుమేరకు రాష్ట్రంలో లిడ్ క్యాప్స్ కు సంబంధించిన భూములను కబ్జాదారుల నుండి కాపాడుకుందాం అని ఏపీ చర్మకారుల సేవా సంఘం ఉపాధ్యక్షురాలు నన్నెపాగ ప్రశాంతి. రాష్ట్ర జనరల్ సెక్రటరీ గార్లపాటి దాసు అన్నారు. ఆదివారం చిలక భాస్కరరావు ఇంటిలో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వం చర్మ కళాకారులను ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వారికి లిడ్ క్యాప్ ను ఏర్పాటుచేసి 500 మందిని ఉద్యోగస్తులను నియమించి పలు జిల్లాలలో కార్యాలయమును ఏర్పాటు చేసినారు. లిడ్ క్యాప్ ్య భూములు ఏర్పాటు చేసి అందులో లెదర్ ఇండస్ట్రియల్ పార్కులు నిర్మాణం చేసి చర్మ కళాకారులకు ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి అందులో కొంతమందికి ట్రైనింగ్ కూడా ఇచ్చినారు.లిడ్ క్యాప్స్ లో ఉద్యోగస్తులు లేక ఉన్న అధికారులు పట్టించుకోకపోవడంతో కొన్ని జిల్లాలలో ఆ భూములలో ప్రైవేటు వ్యక్తులు గ్రావెల్స్ అమ్ముకుంటున్నారు. రాష్ట్రంలోని లిడ్ క్యాప్ కు సంబంధించిన భూములను పరిరక్షి ంచాలని కోరుతూ ఈ నెల 13 గురువారం మధ్యాహ్నం 2 గంటలకు తాడేపల్లి లిడ్ క్యాప్ కార్యాలయానికి రావాలని చర్మ కళాకారులు మరియు డప్పు కళాకారులు తప్పక వచ్చి చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిలక భాస్కరరావు. పెదకూరపాడు నియోజకవర్గ కన్వీనర్ కంచర్ల అచ్యుతరావు. అచ్చంపేట మండల అధ్యక్షులు తుడు ఇమ్మానుయేలు. పెదకూరపాడు మండల అధ్యక్షులు మందరపు నాగయ్య. ఇంటూరి పిచ్చయ్య మొదలగు వారు పాల్గొన్నారు.



## డొక్కా సీతమ్మ అన్న ప్రసాద వితరణ

సత్తెనపల్లి టౌన్ నవంబర్9 ప్రభాతవార్త : సత్తెనపల్లి పట్టణంలోని అమరావతి బస్టాప్ ఆవరణలో జనసేన పార్టీ నాయకుడు అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో 100మంది నిరుపేదలకు ఉచితంగా భోజనం పంపిణీ చేయటం జరిగింది. డొక్కా సీతమ్మ అన్న ప్రసాద వితరణ పేరుతో జనసేన నాయకులు అప్పాపురపు నరేంద్ర ఈ కార్యక్రమానికి రూపకల్పన గావించి నిస్వార్థంగా చేస్తున్న సేవకు ప్రతిఫలంగా దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పెద్దలు చెపూరి నాగేశ్వరరావు ఈకార్యక్రమాన్ని నిర్విఘ్నంగా సాగిస్తున్నందుకు అప్పాపురపు నరేంద్రను అభినందించడం జరిగింది. కొత్తూరి విశ్వేశ్వరావు,కటకం కాశీవిశ్వనాథం, పోతుగంటి నరసింహారావు, కటకం.నరసింహారావు,కట్టమూరి అప్పారావు, ఆత్మకూరి శ్రీనివాసరావు.బండారు నాగరాజు .కొల్లిపర లక్ష్మీ మ్మనారాయణపెద్దలు చౌట శ్రీనివాసరావుగ ఆత్మకురి శ్రీనివాసరావు విశ్వమిశెట్టి నాగేశ్వరరావు పులికొండ సీతారామయ్యతదితరులు పాల్గొన్నారు .





# వ్యక్తులు, పార్టీలకు అతీతంగా ఆర్ఎస్ఎస్

## కేవలం విధానాలకే మద్దతు

## సంస్థ అధ్యక్షుడు మోహన్ భగవత్

**బెంగళూరు, నవంబరు 9:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కేవలం విధానాలకు మాత్రమే మద్దతు ఇస్తుందని, ఏ ఒక్క వ్యక్తికో లేదా రాజకీయ పార్టీకో కాదని ఆ సంస్థ అధ్యక్షుడు మోహన్ భగవత్ స్పష్టం చేశారు. అయోధ్యలోని రామమందిర నిర్మాణం డిమాండ్‌కు కాంగ్రెస్ మద్దతిస్తే ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఆ పార్టీకి మద్దతు ఇచ్చేవాళ్లని వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల వార్షికోత్సవం సందర్భంగా బెంగళూరులో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో మోహన్ భగవత్ మాట్లాడుతూ తాము ఏ ఒక్క రాజకీయ పార్టీకి విధేయులం కాదని తేల్చిచెప్పారు. మేం ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వమని, ఎన్నికల రాజకీయాల్లో పాల్గొనమని, సమాజం ఐక్యత కోసం ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందని అన్నారు. రాజకీయాలు విభజిస్తాయి మేము కేవలం విధానాలకే మద్దతు ఇస్తాం ఉదాహరణకు మేము అయోధ్యలో రామమందిరం కోరుకున్నాం కాబట్టి ఆలయం ఎవరు నిర్మిస్తే వారికే మా స్వయంసేవకులు మద్దతుగా ఉన్నార అని తెలిపారు. కాంగ్రెస్ దానికి మద్దతు ఇచ్చి ఉంటే, మా స్వయంసేవకులు ఆ పార్టీకి ఓటు వేసేవారని ఆయన వ్యాఖ్యానించారు.

మాకు ఒక పార్టీతోనే ప్రత్యేకమైన అనుబంధం లేదు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పార్టీ కాదు అన్ని పార్టీలు మావే ఎందుకంటే అవి భారతీయ పార్టీలు, మేము కేవలం విధానాలకు మాత్రమే మద్దతు తెలుపుతాం రాజకీయాలకు కాదు, మాకు మా అభిప్రాయాలు ఉన్నాయి. ఈ దేశం ఒక నిర్దిష్ట దిశలో వెళ్లాలని మేము కోరుకుం టున్నాం. దేశాన్ని ఆ దిశలో నడిపించే వారికి మేము మద్దతు ఇస్తామని మోహన్ భగవత్ ఉద్ఘాటించారు. ఎవరూ బ్రాహ్మణులుగా ఉండ టానికి అనుమతించం ఎవరూ ఏ జాతికి చెందిన వారిగా ఉండటానికి కూడా అనుమతించం ముస్లింలకు అనుమతి లేదు, క్రైస్తవులకు అను మతి లేదు అయితే, భిన్న మతాలకు చెందినవారు వాళ్లు ముస్లింలైనా, క్రైస్తవులైనా తమ మతపరమైన భిన్నత్వాన్ని వదిలిపెట్టి ఆర్ఎస్ఎస్‌లోకి రావచ్చు మీరు అందులోకి వచ్చినప్పుడు భారతమాత బిడ్డగా వస్తారు. ముస్లింలు, క్రైస్తవులు వస్తారు, కానీ మేము వారి సంఖ్యను లెక్కించం, వారు ఎవరో అడగబోమని ఆర్ఎస్ఎస్ చీఫ్ వ్యాఖ్యానించారు.

అలాగే, పలువురు కాంగ్రెస్ నాయకులు తరుచూ లేవనెత్తుతోన్న 'ఆర్ఎస్ఎస్ నమోదు' అంశంపై కూడా మోహన్ భగవత్ స్పందించారు. 'దీనికి సమాధానం చాలాసార్లు చెప్పాం కానీ, ఈ ప్రశ్నను తిరిగి తిరిగి అడుగుతారు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 1925లో ప్రారంభమైంది. అప్పట్లో మేము బ్రిటిష్ ప్రభుత్వంలో రిజిస్ట్రేషన్ చేసుంటామని భావిస్తున్నారా? స్వాతంత్ర్యం అనంతరం చట్టాలు కూడా నమోదు తప్పనిసరి చేయలేదు. 'బాడీ ఆఫ్ ఇండివిడ్యువల్స్' (వ్యక్తుల సమూహం)అనేరూపంలో కూడాచట్టబద్ధ హోదా ఉంది. సంఘ్‌ను కూడా అటువంటి సమూహం గా వర్గీకరించాం, మేము గుర్తింపు పొందిన సంస్థే' అని పేర్కొన్నారు.

'మూడుసార్లు ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధించారంటే ప్రభుత్వం మమ్మల్ని గుర్తించినట్టే మేము లేకపోతే, ఎవరిని నిషేధించారు? ప్రతిసారీ కోర్టులు ఆ నిషేధాన్ని రద్దు చేశాయి. అసెంబ్లీ, పార్లమెంటులోనూ ఆర్ ఎస్ఎస్‌కు అనుకూలంగానూ, వ్యతిరేకంగానూ ఎన్నోసార్లు ప్రశ్నలు అడిగారు. చట్టపరంగా, వాస్తవపరంగా చూస్తే సంఘ్ సంస్థే. మేము రాజ్యాంగ విరుద్ధం కాదు కాబట్టి, రిజిస్ట్రేషన్ అవసరం లేదు. ఎన్నో సంస్థలు ఉన్నాయి, అవి కూడా నమోదు కాలేదు. హిందూ ధర్మం కూడా నమోదు కాలేదు'అని ఆయన అన్నారు. ఆర్ ఎస్ఎస్‌పై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా పలువురు నాయకులు విమర్శలు గుప్పిస్తోన్న వేళ భగవత్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# వంతెన నిర్మిస్తేనే మేం ఓట్లేస్తాం..

## బీహార్‌లో మూడు గ్రామాల ప్రజల భీష్మప్రతిజ్ఞ



**పాట్నా, నవంబరు 9:** బీహార్‌లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో అభివృద్ధి, మహిళా సంక్షేమం, యువత ప్రధాన ప్రచారాస్త్రాలుగా మారాయి. కానీ, గయకు సుమారు 150 కిలోమీటర్ల దూరంలోని కొన్ని గ్రామాలకు మాత్రం అభివృద్ధి అనేది 77 ఏళ్లుగా అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. తమ దశాబ్దాల డిమాండ్‌ను నెరవేర్చని పాలకులపై వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. మోర్హర్ నదిపై వంతెన నిర్మించే వరకు ఓటు వేసే ప్రసక్తే లేదని తేల్చిచెబుతున్నారు. పత్రా, హెర్హంజ్, కేవల్‌డిహ్ అనే మూడు గ్రామాలకు చెందిన సుమారు 8,000 మంది ప్రజలు తరతరాలుగా ఒకే ఒక్క కోరిక కోరుతున్నారు. తమ గ్రామాలను బాహ్య ప్రపంచంతో కలిపే మోర్హర్ నదిపై ఒక వంతెన నిర్మించాలన్నదే వారి డిమాండ్. ఆ నదిని వారు "నిస్సహాయ నది"గా పిలుచుకుంటున్నారు. "బ్రిడ్జి కట్టేంత వరకు ఓటు వేయం. 'పుల్ నహీ తో వోట్ నహీ' (వంతెన లేకుంటే ఓటు లేదు)" అని ఓ మహిళా ఓటరు స్పష్టం చేశారు. "77 ఏళ్లుగా అందరూ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. నాయకులు వస్తుంటారు, పోతుంటారు కానీ హామీలు మాత్రం నెరవేర్చరు. వర్షాకాలంలో నదిలో నీటి మట్టం భుజాల వరకు వస్తుంది. మాకు అభివృద్ధి అంటే ఈ వంతెన నిర్మాణమే" అని ఆమె తెలిపారు. ప్రతి ఏటా వర్షాకాలంలో దాదాపు నాలుగు నెలల పాటు ఈ గ్రామాలు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పూర్తిగా సంబంధాలు కోల్పోతాయి. నిత్యావసరాల కోసం మార్కెట్‌కు వెళ్లాలన్నా, పిల్లలు బడికి వెళ్లాలన్నా, రైతులు తమ పంటను అమ్ముకోవాలన్నా ప్రాణాల మీద ఆశ వదులుకుని నదిని దాటాల్సిందే. అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లడం వీలుకాక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల పత్రా గ్రామానికి చెందిన సునీల్ విశ్వకర్మ అనే వ్యక్తికి అనారోగ్యం పాలవగా, నది దాటలేక సరైన సమయంలో వైద్యం అందక నది ఒడ్డునే ప్రాణాలు విడిచాడు. 'నది వల్లే వాడిని ఆసుపత్రికి తీసుకెళ్లలేకపోయాం. అంబులెన్స్ రాలేదు. ప్రైవేట్ వాహనం మాట్లాడితే అది నదికి అవతలి వైపు ఉండిపోయింది' అని విశ్వకర్మ తల్లి కన్నీరు పెట్టుకున్నారు. గర్భిణులు 39 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆసుపత్రికి వెళ్లేలోపే మార్గమధ్యంలో మరణించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. 'వర్షాకాలంలో ఏటా ఇక్కడ కనీసం ఇద్దరు ప్రాణాలు కోల్పోతారు. మా బతుకులు ఇంత దుర్భరంగా ఉన్నాయి' అని మరో గ్రామస్థుడు వాపోయారు.

# బిజెపి ఎమ్మెల్యేపై పోక్సోకేసు నమోదు

## ఆయన సహాయక సిబ్బందిపైనా కిడ్నాప్ బెదరింపుల కేసు



**సిమ్లా, నవంబరు 9:** హిమాచల్ ప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేగింది. చురా నియోజక వర్గానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ డిప్యూటీ స్పీకర్ హన్స్‌రాజ్‌పై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. మైనర్‌గా ఉన్నప్పుడు తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని, పెళ్లి పేరుతో మోసం చేశారని ఓ యువతి ఆరోపించడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు నమోదు కావ డానికి ఒక రోజు ముందే, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడితో పాటు మరో సన్నిహితుడిపై కిడ్నాపింగ్ కేసునమోదవడం గమనార్హం. బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న అనంతరం ఎమ్మెల్యే హన్స్‌రాజ్‌పై కేసునమోదు చేశారు. చిన్నారులపై లైంగిక నేరాల నిరోధక (పోక్సో) చట్టంలోని సెక్షన్ 6 (తీవ్రమైన లైంగిక దాడి), భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 69 (పెళ్లి పేరుతో మోసగించి లైంగిక దాడి) కింద ఈ కేసు ఫైల్ చేసినట్లు చంబా అదనపు ఎస్పీ హితేష్ లఖన్‌పాల్ ధ్రువీకరించారు.

# ఓటు చోరీని దాచేందుకే 'సర్'




## ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపైనే దాడి

## నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగితే విజయం మాదే

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

## బీహార్‌లో మార్పు ఖాయం: తేజస్వి

**న్యూఢిల్లీ, నవంబరు 9:** దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై దాడి జరుగుతోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. హర్యానా మాదిరే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోనూ ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. వాటిని త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు. ఓటు చోరీని కప్పిపుచ్చుకునేందుకే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) నిర్వహించారని రాహుల్ వ్యాఖ్యానించారు. బిజెపి, ఇసి ఉమ్మడి భాగస్వామ్యంతోనే ఇదంతా జరుగుతోందని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో డిసిసి అధ్యక్షుల శిక్షణా శిబిరంలోనూ, ఆ తర్వాత బీహార్ ఎన్నికల సభల్లోనూ రాహుల్ గాంధీ ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా, ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే బీహార్‌లో ఖచ్చితంగా ఇండియా కూటమి బంపర్ మెజారిటీతో గెలుస్తుందన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) అనేది ఓట్ల చోరీని కప్పిపుచ్చే ప్రయత్నమని విమర్శించారు. దీంతో ఓట్ల చోరీని సంస్థాగతం చేస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యంపై నేరుగా దాడి జరుగుతోంది. అంబేద్కర్ రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కలిసి ఈ చర్యను సమన్వయం చేస్తున్నారు. ఫలితంగా దేశం తీవ్రంగా నష్టపోతోంది. భారత మాతకు నష్టం జరుగుతోంది" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

**మార్పు కోసమే ఓటేయండి: తేజస్వి:** బీహార్ ఎన్నికల్లో ఈసారి ప్రజలు మార్పు కోరుకుంటు న్నారు, ఖచ్చితంగా ఇండియా కూటమి విజయం సాధించనుందని కూటమి సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. తొలి దశ పోలింగ్‌లో బీహార్ ప్రజలు మార్పు కోసం ఓటేశారని, రేపు జరిగే మలివిడత ఎన్నికల్లో కూడా ఓటర్లు అదే చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. చివరి రోజు ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో తేజస్వి యావద్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా బీహార్‌లో ఎన్‌డిఏ పాలనలో ఏంచేశారో చెప్పడం లేదని ప్రధాని మోడీ, సిఎం నితీశ్‌కుమార్‌లను లక్ష్యం గా చేసుకుని విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వం ఉన్న 17 నెలల సమయంలో ఇచ్చిన రిజర్వేషన్‌గురించి ప్రధాని, మరె వరైనా మంత్రులుగానీ మాట్లాడటం లేదని,ప్రజలకు లభించాల్సిన 65 రిజర్వేషన్‌ను ప్రధాని ఇవ్వలేదని విమర్శించారు. ఆయన బీహార్‌కు, గుజరాత్‌కు ఏమి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

# జపాన్‌లో మంత్రుల జీతాలు 'కట్'



ప్రధాని సనాయే తకాయిచి సంచలన నిర్ణయం

**టోక్యో, నవంబరు 9:** జపాన్‌లో నూతన అధ్యాయానికి తెరలేపారు ఆ దేశ ప్రధాని సనాయె తకాయిచి. తనతో పాటు పార్లమెంట్‌లోని క్యాబినెట్ సభ్యులందరికీ చెల్లించే అదనపు భత్యాలపై ఇకపై కోత విధిస్తున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్టు తెలుస్తోంది. దీనిపై మంగళవారం ఆ దేశంలో జరగబోయే క్యాబినెట్ సమావేశంలో చర్చించనున్నారు. మంత్రుల జీతాలను తగ్గించాలని ఎంతో కాలంగా వాదిస్తున్న తకాయిచి అక్టోబర్‌లో జరిగిన తన ప్రారంభ సమావేశంలోనే ఈ విషయం పట్ల ఆమె వైఖరిని స్పష్టం చేశారు. క్యాబినెట్ సభ్యులకు జీతాలకు మించి అదనపు భత్యాలు చెల్లించకుండా ఉండేందుకు చట్టసవరణ తీసుకొచ్చేందుకు తాను పనిచేస్తానని నాడు ఆమె పేర్కొన్నారు. జపాన్‌లో పరిపాలనా సౌలభ్యత, ఆర్థిక సంస్కరణల పట్ల నిబద్ధతను ప్రదర్శించడంలో భాగంగానే తకాయిచి చేస్తున్న విస్తృత ప్రయత్నాల్లో ఇదొక చర్య. ప్రస్తుతం, అక్కడ ఒక్కో చట్టసభ సభ్యునికీ నెల జీతం 1.294 మిలియన్ యెన్‌లు ఉండగా ప్రధాని అదనంగా 1.152 మిలియన్ యెన్‌లు పొందుతున్నారు. క్యాబినెట్ మంత్రులకు 4,89,000 యెన్‌లు భత్యంగా చెల్లిస్తున్నారు. ఖర్చు తగ్గింపు చర్యలలో భాగంగా ప్రధాని అదనపు వేతనం నుంచి 30 శాతం, మంత్రులు 20శాతం చొప్పున తిరిగి ఇస్తున్నారని ఆ దేశ క్యాబినెట్ ప్రధాన కార్యదర్శి మినోరు కిహారా ధృవీకరించారు. ఫలితంగా ప్రధాని 3,90,000 యెన్‌లు, మంత్రులు ఒక్కొక్కరు 1,10,000యెన్‌ల చొప్పున పుచ్చుకుంటున్నారు. నూతన ప్రధాని తీసుకున్న ఈ నిర్ణయాన్ని లిబరల్ డెమోక్రటిక్ పార్టీ కొత్త సంకీర్ణ భాగస్వామి అయిన జపాన్ ఇన్నోవేషన్ పార్టీ స్వాగతించింది.

# నిజ్జర్ హత్య కేసు.. కెనడాకు ఉప్పందించిన బ్రిటన్ గూఢచారులు!



**ఒట్టావా, నవంబరు 9:** ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య విషయంలో భారత్‌ను ఉద్దేశిస్తూ కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వ్యాఖ్యలతో ఇరు దేశాల దౌత్య సంబంధాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. కెనడాలో కొత్తగా ఏర్పడిన మార్క్ కార్నీ ప్రభుత్వం న్యూఢిల్లీతో బంధాన్ని పునరుద్ధరించుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో నిజ్జర్ హత్యపై తాజాగా విడుదలైన ఓ డాక్యుమెంటరీ ప్రకారం బ్రిటిష్ నిఘా సంస్థ కొందరి కాల్స్‌లోకి చొరబడి సేకరించిన సమాచారాన్ని కెనడాకు అప్పగించింది. దీంతో హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యతో భారత్‌కు సంబంధాలున్నాయంటూ ఆ దేశాధికారులు ఆరోపణలు చేశారు. భారత ప్రభుత్వం కోసం పనిచేస్తున్న కొందరు వ్యక్తులు ఖలిస్థానీ ఉగ్రవాది, 'సిఖ్స్ ఫర్ జస్టిస్' (ఎస్ఎఫ్‌జె) ఉగ్ర సంస్థ వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూ, నిజ్జర్ గురించి చర్చించుకుంటుండగా యుకె ప్రభుత్వ కమ్యూనికేషన్స్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన ఇంటెలిజెన్స్ ఏజెన్సీ వారి కాల్స్ ట్రాక్ చేసినట్లు బ్లూమ్‌బెర్గ్ ఒరిజినల్స్ విడుదల చేసిన 'ఇన్‌సైడ్ ది డెత్స్ దట్ రాక్డ్ ఇండియాస్ రిలేషన్స్ విత్ ది వెస్ట్' అనే డాక్యుమెంటరీ వెల్లడించింది. ఆ కాల్స్‌లో పన్నూ, నిజ్జర్ గురించి భారత ప్రభుత్వం తరఫున పనిచేస్తున్న వ్యక్తులు చర్చించుకున్నట్లు పేర్కొంది. అనంతరం నిజ్జర్‌ను ఎలా హత్య చేయాలనే ప్లాన్ గురించి మాట్లాడుకున్నట్లు బ్రిటిష్ నిఘా సంస్థ గుర్తించినట్లు తెలిపింది. యుకె, యుఎస్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మధ్య ఉన్న 'ఫైవ్ ఐస్' ఇంటెలిజెన్స్ షేరింగ్ ఒప్పందంలో భాగంగా బ్రిటన్ జూలై 2023 చివరలో ఈ సమాచారాన్ని కెనడాకు చేరవేయడంతో నిజ్జర్ హత్య కేసు దర్యాప్తులో పురోగతి కనిపించినట్లు వీడియో డాక్యుమెంటరీ తెలిపింది. కఠినమైన షరతుల కింద మాత్రమే ఈ దేశాలు నిఘా సమాచారాన్ని పంచుకుంటాయని.. ఎలాక్ట్రానిక్ వ్యవస్థలకు దూరంగా ఉంచుతూ ఎటువంటి సమాచారాన్ని అయినా అధికారులు వ్యక్తిగతంగా వెళ్లి అందజేస్తారని తెలిపింది. అదేవిధంగా నిజ్జర్ హత్య కేసుకు సంబంధించిన వివరాలను కూడా బ్రిటన్ అధికారులు కెనడా ప్రభుత్వానికి ఇచ్చినట్లు వెల్లడించింది. కాగా, ఈ డాక్యుమెంటరీ విడుదలైన తర్వాత సిక్కు సమాఖ్య యుకె భద్రతా మంత్రి డాన్ జార్విస్‌కు లేఖ రాసింది. అందులో నిజ్జర్ హత్యపై ఎంపిలు ప్రశ్నించినప్పుడు బ్రిటన్ ప్రభుత్వం ఈ విషయాలను ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించింది.



# మరణించిన తర్వాత శరీరంలో రక్తప్రసరణ..

## వైద్య చరిత్రలోనే తొలిసారి

## ఆసియాలోనే మణిపాల్ ఆస్పత్రి వైద్యుల ఘనత

**న్యూఢిల్లీ, నవంబరు 9:** ఢిల్లీ వైద్యులు వైద్య చరిత్రలో మరో కొత్త అధ్యాయానికి నాంది పలికారు. ద్వారకలోని మణిపాల్ ఆస్పత్రి వైద్యులు మరణించిన మహిళ శరీరంలో ఆగిపోయిన రక్తప్రసరణను తిరిగి ప్రారంభించారు. మరణించిన ఆమె అవయవాలను దానం చేసేందుకు వీలుగా ఈ ప్రక్రియను చేపట్టినట్లు వారు వెల్లడించారు. ఆసియాలోనే ఈ ఘనత సాధించిన మొదటి ఆస్పత్రి తమదేనని ఛైర్మన్ శ్రీకాంత్ శ్రీనివాసన్ పేర్కొన్నారు. మోటార్ న్యూరాన్ వ్యాధి కారణంగా పక్షవాతం బారిన పడిన గీతాచావ్లా (55) అనే మహిళ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండగా కుటుంబసభ్యుల ఈ నెల 5న ఆమెను మణిపాల్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి మరింత దిగజారడంతో మరుసటి రోజు ఆమె మరణించింది. అయితే గీతా చావ్లా అవయవాలు దానం చేయాలనుకుంటున్నట్లు మృతురాలి కుటుంబం తెలియజేయడంతో అక్కడి వైద్యబృందం నార్మోథెర్మిక్ రీజినల్ పెర్ఫ్యూజన్ (ఎన్ఆర్‌పి) అనే అరుదైన ప్రక్రియను నిర్వహించింది. ఎక్స్‌ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేటర్ (ఇసిఎంఒ)ను ఉపయోగించి వైద్యులు మృతురాలి ఉదర అవయవాల్లో రక్త ప్రసరణను విజయవంతంగా పునఃప్రారంభించారు. తర్వాత అవయవాలు సేకరించారు. ఎన్ఆర్‌పిని ఉపయోగించి కాలేయం, మూత్రపిండాలను సురక్షితంగా తీసి ఇతరులకు విజయవంతంగా అమర్చినట్లు వైద్యులు పేర్కొన్నారు. బ్రెయిన్‌డెడ్ అయిన వారి నుంచే కాకుండా ఇకపై సహజ మరణాల తర్వాత కూడా మృతుల నుంచి అవయవాలు సేకరించడం సాధ్యమేనని నిరూపించామన్నారు.





# షట్‌డౌన్ సంక్షోభం

## అమెరికాలో 1700పైగా విమానాలు రద్దు

**వాషింగ్టన్, నవంబరు 9:** అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ ప్రభావం విమానయాన రంగంపై తీవ్రంగా పడింది. ఎయిర్ ట్రాఫిక్‌ను తగ్గించాలన్న ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఎఎ) ఆదేశాలతో విమానయాన సంస్థలు వరుసగా 1700కి పైగా విమానాలను రద్దు చేశాయి. దీంతో దేశంలోని ప్రధాన విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఫ్లైట్ అవేర్ వెబ్‌సైట్ ప్రకారం నిన్న మధ్యాహ్నానికే 1700కి పైగా విమానాలు రద్దయ్యాయి. ముఖ్యంగా నార్త్ కరోలినాలోని షార్లెట్ విమానాశ్రయంలో అత్యధికంగా 130 విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. అట్లాంటా, చికాగో, డెన్వర్, నెవార్క్ వంటి ఇతర ప్రధాన ఎయిర్‌పోర్టులలో కూడా ఇదే పరిస్థితి కనిపించింది. న్యూయార్క్ నగర పరిసరాల్లోని విమానాశ్రయాల్లో సిబ్బంది కొరత కారణంగా విమానాలు ఆలస్యంగా నడిచాయి. షట్‌డౌన్ కొనసాగితే రానున్న రోజుల్లో రద్దయ్యే విమానాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం 40 విమానాశ్రయాల్లో 4 శాతం విమానాలను తగ్గించామని, మంగళవారం నుంచి ఈ సంఖ్యను మరింత పెంచి, శుక్రవారం నాటికి 10 శాతానికి చేర్చుతామని ఎఫ్ఏఏ తెలిపింది. షట్‌డౌన్ కొనసాగి, మరింత మంది ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు విధులకు దూరమైతే మరిన్ని కోతలు విధించాల్సి వస్తుందని రవాణా శాఖ కార్యదర్శి సీన్ డఫీ హెచ్చరించారు. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా దాదాపు నెల రోజులుగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు జీతాలు అందడం లేదు. దీంతో చాలామంది అనారోగ్య కారణాలు చూపి విధులకు గైర్హాజరవుతున్నారు. ఇప్పటికే ఉన్న సిబ్బంది కొరతకు ఇది తోడవడంతో విమానాల నిర్వహణ కష్టంగా మారింది. జీతాలు లేకుండానే వారానికి ఆరు రోజులు తప్పనిసరిగా ఓవర్ టైమ్ చేయాల్సి వస్తోందని, కొందరు తమ కుటుంబ ఖర్చుల కోసం రెండో ఉద్యోగం కూడా చేసుకుంటున్నారని నేషనల్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్ అసోసియేషన్ తెలిపింది. ఈ ఆకస్మిక పరిణామాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. "మనమందరం ప్రయాణాలు చేస్తాం. అందరికీ ఎక్కడికో ఒకచోటికి వెళ్లాల్సిన అవసరం ఉంటుంది. ప్రభుత్వం ఈ సమస్యను త్వరగా పరిష్కరిస్తుందని ఆశిస్తున్నాను' అని మియామి నుంచి డొమినికన్ రిపబ్లిక్‌కు వెళుతున్న ఎమ్మా హోల్గిన్ అనే ప్రయాణికురాలు తన ఆవేదన వ్యక్తం చేశారు.

# ట్రంప్ జోక్యంవల్లే భారత్ పాక్ ఉద్రిక్తతల సర్దుబాటు

## బాకు విక్టరీ పెరేడ్‌లో పాక్‌ప్రధాని షరీఫ్



**బాకు, నవంబరు 9:** భారత్, పాకిస్థాన్ మధ్య గత మే నెలలో తలెత్తిన తీవ్ర ఉద్రిక్తతలను చల్లార్చి, యుద్ధాన్ని నివారించింది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంపేనని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి ప్రశంసించారు. ఆయన 'ధైర్యవంతమైన, నిర్ణయాత్మక నాయకత్వం' వల్లే కాల్పుల విరమణ సాధ్యమైందని కొనియాడారు. అజర్‌బైజాన్ రాజధాని బాకులో జరిగిన విక్టరీ డే పరేడ్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన ప్రసంగంలో షెహబాజ్ మాట్లాడుతూ "ట్రంప్ జోక్యంతో దక్షిణాసియాలో శాంతి పునరుద్ధరించబడింది. ఒక పెద్ద యుద్ధం నివారించబడింది, తద్వారా లక్షలాది మంది ప్రాణాలు నిలిచాయి" అని పేర్కొన్నారు. వాషింగ్టన్ మధ్యవర్తిత్వంతో జరిగిన చర్చల అనంతరం మే 10న ఇరు దేశాలు 'పూర్తి, తక్షణ కాల్పుల విరమణ'కు అంగీకరించినట్లు ట్రంప్ అప్పట్లో ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పాకిస్థాన్ ఈ ఘనతను ట్రంప్‌కు ఆపాదిస్తుండగా, భారత్ మాత్రం ఈ వాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ విషయంలో ఏ మూడో వ్యక్తి ప్రమేయం లేదని, నాలుగు రోజుల పాటు సరిహద్దుల్లో డ్రోన్లు, క్షిపణులతో దాడులు జరిగిన అనంతరం ఇరు దేశాలు ద్వైపాక్షిక చర్చల ద్వారానే ఒక అవగాహనకు వచ్చాయని న్యూఢిల్లీ మొదటి నుంచి స్పష్టం చేస్తోంది. ఇదే కార్యక్రమంలో షెహబాజ్ షరీఫ్ కశ్మీర్ అంశాన్ని కూడా ప్రస్తావించారు. కరబాఖ్‌లో అజర్‌బైజాన్ సాధించిన విజయం కశ్మీర్ అణచివేతకు గురైన అన్ని దేశాలకు ఆశాకిరణం అని ఆయన అభివర్ణించారు. ఈ విక్టరీ డే పరేడ్‌లో అజర్‌బైజాన్ సైనిక దళాలతో పాటు పాకిస్థాన్, తుర్కియే సైనికులు కూడా కవాతు నిర్వహించారు. పాకిస్థాన్‌కు చెందిన జేఎఫ్17 థండర్ జెట్ల వైమానిక ప్రదర్శనతో ఈ కార్యక్రమం ముగిసింది.

## సంక్షిప్తంగా..

### కుప్పకూలిన సైనిక హెలికాప్టర్: ఏడుగురు మృతి



**మాస్కో, నవంబరు 9:** రష్యాలో ఆర్మీకి చెందిన హెలికాప్టర్ ఒకటి కూలిపోయింది. యుద్ధ విమానాల విడి భాగాలు తయారు చేసే కంపెనీకి చెందిన సిబ్బందితో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తూ ఓ ఇంటిపై కూలింది. దీంతో మంటలు ఎగిసిపడగా హెలికాప్టర్‌లోని ఏడుగురు ప్రయాణికుల్లో నలుగురు సజీవ దహనమయ్యారు. మిగిలిన ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. సాంకేతిక లోపం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని సమాచారం. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం దక్షిణ రష్యాలోని డాగేస్తాన్ ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకుందని రష్యా మంత్రి యారోస్లావ్ గ్లాజోవ్ తెలిపారు. ఈ హెలికాప్టర్‌లో రష్యాలోని కిజ్ల్యార్ ఎలక్ట్రోమెకానికల్ ప్లాంట్‌కు చెందిన సీనియర్ సిబ్బంది ఉన్నారని ఆయన వెల్లడించారు.

### ఆసిమ్ మునీర్‌కు విశేషాధికారాలపై వెల్లువెత్తిన నిరసనలు



**ఇస్లామాబాద్, నవంబరు 9:** పాక్ ఆర్మీ చీఫ్ ఆసిఫ్ మునీర్‌కు అపరిమిత అధికారాలు కట్టబెట్టేలా రాజ్యాంగ సవరణకు సిద్ధమైన షహబాజ్ షరీఫ్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. దేశవ్యాప్తంగా ఆదివారం నిరసన కార్యక్రమాలకు దిగాయి. ప్రభుత్వ చర్యలతో రాజ్యాంగ పునాదులు ధ్వంసమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించాయి. పాక్‌లోని రాజ్యాంగబద్ధ వ్యవస్థల అధికారాలు, రక్షణలను సమూలంగా మార్చేలా పాక్ ప్రభుత్వం 27వ రాజ్యాంగ సవరణను తీసుకొచ్చింది. దీని ప్రకారం, సైన్యం, నావికాదళం, ఎయిర్‌ఫోర్స్‌కు అధిపతిగా ఆర్మీ చీఫ్‌ను నియమించేలా ప్రత్యేక చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్స్ (సీడీఎఫ్) పదవిని ఏర్పాటు చేయనున్నారు. ఫీల్డ్ మార్షల్ స్థాయి అధికారికి ఈ పదవిని కేటాయిస్తారు.

### ఎలుగుబంట్ల కట్టడికోసం రంగంలోకి సైన్యం



**టోక్యో, నవంబరు 9:** జపాన్‌లో పెరిగిపోతున్న ఎలుగుబంట్ల అరాచకాన్ని కట్టడిచేసేందుకు ఏకంగా ప్రభుత్వం సైన్యాన్నే రంగంలోకి దించింది. వాతావరణ మార్పులతో ఆహార వనరుల కొరత, శీతాకాలంలోనూ వెచ్చని ఉష్ణోగ్రతలతో హైబర్‌నేషన్ (సుషుప్తావస్థ) ఆలస్యం కావడంతో భల్లూకాలు జనావాసాల్లోకి వస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణాలకు వెళ్లడంతో అక్కడ పండ్ల చెట్లు, ఇతర చెట్లు విపరీతంగా పెరగడం కూడా వీటి సంచారం పెరుగుదలకు కారణంగా నిపుణులు చెబుతున్నారు. కజనో పట్టణంలో ఎలుగుబంట్ల సంచారం ఇటీవల విపరీతంగా పెరిగింది. రైల్వే స్టేషన్లు, రిసార్టులు, సూపర్ మార్కెట్లతోపాటు పాఠశాలల్లోనూ నిత్యం తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఏప్రిల్ నుంచి ఎలుగుబంట్ల దాడుల్లో 13 మంది చనిపోయారని, దాదాపు వంద మందికి పైగా గాయపడ్డారని అధికారులు తెలిపారు.

### విదేశాల్లో ఉన్న మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్ల అరెస్ట్



**చండీగఢ్, నవంబరు 9:** విదేశాల్లో ఉంటూ భారత్‌లో నేర కార్యకలాపాలు సాగిస్తున్న ఇద్దరు మోస్ట్‌వాంటెడ్ గ్యాంగ్‌స్టర్స్‌ను భారత సెక్యూరిటీ ఏజెన్సీ అధికారులు అరెస్ట్ చేశారు. వెంకటేష్ గార్గ్‌ను జార్జియాలో అరెస్ట్‌చేయగా మరో గ్యాంగ్‌స్టర్ భాను రానాను అమెరికాలో అదుపులోకి తీసుకున్నారు. అంతర్జాతీయ ఆపరేషన్‌లో హర్యానా పోలీసులు కూడా భాగమయ్యారు. త్వరలో వీరిని భారత్‌కు తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అరెస్టైన వారిలో భాను రానాకు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలు ఉండటం గమనార్హం. బిష్ణోయ్ గ్యాంగ్‌లో అతడు కీలక సభ్యుడు. కర్నల్ ప్రాంతానికి చెందిన రానాపై చాలా కేసులు ఉన్నాయి. హర్యానా, పంజాబ్, ఢిల్లీ ప్రాంతాల్లో ఇతడు నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇక వెంకటేష్ గార్గ్‌పై దేశంలో 10కిపైగా క్రిమినల్ కేసులు ఉన్నాయి.

### పోకిరీలు వాడేది బుల్లెట్లు,ఎస్‌యువి థార్‌లే: డిజిపి

**గురుగ్రామ్, నవంబరు 9:** అల్లరి మూకలు పోకిరీలే ఎక్కువగా బుల్లెట్లు, థార్ ఎస్‌యువిలు వాడుతున్నారని వారిని వదిలేయబోమని హర్యానా డిజిపి ఓ పిసింగ్ వెల్లడించారు. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. గురుగ్రామ్‌లో విలేకరులతో మాట్లాడిన ఓపీ సింగ్, వాహనాల తనిఖీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మేము రోడ్డుపై వెళ్లే అన్ని వాహనాలను ఆపి తనిఖీ చేయం. కానీ, ఒక థార్ కారు కనిపిస్తే దాన్ని ఎలా వదిలేస్తాం? బుల్లెట్ బైక్ కనిపించినా అంతే. ఎందుకంటే సమాజంలో అల్లరిచిల్లరగా తిరిగే వాళ్లంతా ఇలాంటి వాహనాలనే వాడుతున్నారు.

10-11pg6exHMNWJQE 10_10-11pg6exHMNWJQE.qxd 09/Nov/25 10:39 PM Page 1



# కృష్ణకు రికార్డు వరద

**● శ్రీశైలం, పులిచింతలకీ అదే ప్రవాహం ● పోతిరెడ్డిపాడు పరిధిలో ప్రాజెక్టులు కళకళ**

రాజంపేట, నవంబరు 9 ప్రభాతవార్త: కృష్ణ బేసిన్‌లో రికార్డు స్థాయిలో వరద ప్రవాహం ఈ ఎడాది నమోదైంది. శ్రీశైలం ప్రాజెక్టుకు పులిచింతల ప్రాజెక్టు కూడా ఆల్ టైం రికార్డ్ స్థాయిలో వరద ప్రవాహం వచ్చింది. 1994-95 సీజన్‌లో 2039.87 టీఎంసీ రికార్డు ప్రవాహం నమోదు కాగా 30 ఏళ్ల తరువాత ఆ రికార్డు బ్రేక్ అయింది. ఈ సీజన్‌లో శ్రీశైలం, పులిచింతలకి కూడా ఆల్ టైం రికార్డు వరద ప్రవాహం నమోదు అయింది. శ్రీశైలం ప్రాజెక్ట్‌కి 01-06-25 నుండి 06-11-25 వరకు రికార్డు స్థాయిలో 2278 టీఎంసీల వరద ప్రవాహం వచ్చింది. 1994-95లో 2039.87 టీఎంసీ రికార్డు ప్రవాహం నమోదైంది. పులిచింతల నిర్మాణం తరువాత 2022-23 సీజన్‌లో 1285.43 టీఎంసీల వరద ప్రవాహం వచ్చింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 1477.1 టీఎంసీల వరద ప్రవాహం నమోదుకావడం విశేషం.

**రాయలసీమ ప్రాజెక్టులలో 90శాతం పైబడి నీరు**

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యూలేటర్ ఆధారిత రాయలసీమ ప్రాజెక్ట్‌లలో ప్రస్తుతం నీటి నిల్వ సామర్థంలో 90శాతం పైబడి నీరు నిలువ ఉంది. ఈనెల 5నాటి లెక్కల ప్రకారం గోరుకల్లు ప్రాజెక్టు 12.44 టీఎంసీ పూర్తి నిలువ సామర్థ్యం కాగా 10.68 టీఎంసీల నిల్వ ఉంది. అవుకు 4.15 టీఎంసీ పూర్తి నిలువ సామర్థ్యం కాగా 2.22 టీఎంసీల నిల్వ వుంది. గండికోట 26.85 టీఎంసీల పూర్తి నిలువ సామర్థ్యం కాగా 26.53 టీఎంసీల నిల్వ వుంది. వామికొండ 1.68 టీఎంసీల పూర్తి నిలువ సామర్థ్యం కాగా ప్రస్తుతం 1.35 టీఎంసీల నిల్వ వుంది. సర్వారాయసాగర్ 3.06 టీఎంసీల పూర్తి నిలువ సామర్థ్యం కాగా 1 టీఎంసీల నీరు నిల్వ వుంది. చిత్రావతి 10 టీఎంసీల పూర్తి నిలువ సామర్థ్యం కాగా 9.2 టీఎంసీల నిల్వ వుంది. పైడిపాలెం 6 టీఎంసీ పూర్తి నిలువ సామర్థ్యం కాగా 5.15 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మైలవరం 6.5 టీఎంసీలు పూర్తి నిలువ సామర్థ్యం కాగా 6.15 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వెలుగోడు 16.95 టీఎంసీల పూర్తి నిలువ సామర్థ్యం కాగా 15.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎస్ఆర్-1 ప్రాజెక్టు 2.13 టీఎంసీలు పూర్తి నిలువ సామర్థ్యం కాగా 1.75 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎస్ఆర్-2 ప్రాజెక్ట్ 22.44 టీఎంసీలు పూర్తి నిలువ సామర్థ్యం కాగా 1.68 టీఎంసీల నీరు నిల్వ ఉంది. బ్రహ్మసాగర్ ప్రాజెక్టు 17.730 టీఎంసీలు పూర్తి నిలువ సామర్థ్యం కాగా 17 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మొత్తం పోతిరెడ్డిపాడు ఆధారిత ప్రాజెక్టుల పూర్తి నిల్వ సామర్థ్యం 109.93 టీఎంసీలు కాగా ప్రస్తుతం 98.53 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



# రైల్వేల అభివృద్ధికి నిధులు

## తాడేపల్లిగూడెం, నవాబ్ పాలెం మధ్య రూ.80.06 కోట్లతో రైల్ ఓవర్ బ్రిడ్జి

రాజంపేట, నవంబరు 9 ప్రభాతవార్త: విజయవాడ రైల్వే డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు వరదలా వస్తున్నాయి. అనకాపల్లి ఎంపి ఎం రమేష్ నాయుడు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రైల్వే అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నారు. ఆయన సిఫార్సులతో రైల్వే బోర్డు భారీగా నిధులను మంజూరు చేస్తోంది. తాజాగా అనకాపల్లి, తుని రైల్వే స్టేషన్‌లలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.19.61 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రీమియం వెయిటింగ్ హాల్, కొత్త బుకింగ్ ఆఫీస్ నిర్మాణం, ప్రయాణికులు విడిది చేసేందుకు రిటైరింగ్ రూమ్స్ నిర్మాణానికి రూ.10.93 కోట్లు నిధులు మంజూరు చేశారు. అలాగే అనకాపల్లి, తుని రైల్వేస్టేషన్లలో సిఓపి షెల్టర్లు నిర్మించేందుకు, మాడ్యులర్ టాయిలెట్స్ కోసం రూ.8.68 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. అలాగే చెన్నై- కోల్‌కత్తా నేషనల్ హైవే-16లో పుల్ల చేబ్రోలు రైల్వే స్టేషన్ మధ్య (ఎల్‌సి నెంబర్ 363 బి) రెండు లైన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.46.23 కోట్ల నిధులు మంజూరు చేశారు. అలాగే దెందులూరు భీమడోలు రైల్వే స్టేషన్ల మధ్య రెండు లైన్ల రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి, అదేవిధంగా తాడేపల్లిగూడెం, నవపాలెం స్టేషన్ల మధ్య రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.80.06 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనులను 18నెలల లోపు నిర్మించాలని విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు టెండర్ల ప్రక్రియను కూడా చేపట్టారు.



# పొట్టకూటి కోసం వచ్చి పరలోకానికి

**వరి కోత యంత్రానికి విద్యుత్తు వైరు తగిలి ఇద్దరు మృతి**

**కాకినాడ జిల్లా రామయ్యపాలెంలో ఘటన**

గండేపల్లి, నవంబరు 9 ప్రభాతవార్త: వరి కోత యంత్రాన్ని వ్యాన్‌పై ఒకచోట నుండి మరొక చోటకి తరలిస్తుండగా 11 కె.వి విద్యుత్ వైరు తగిలి ఇద్దరు మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా గండేపల్లి మండలం రామయ్య పాలెంలో జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా నుండి పొట్టకూటి కోసం వచ్చిన వరి కోత యంత్రం యజమాని కరిపెట్టి సింహాద్రి అప్పన్న, డ్రైవర్ గడ్డం సందీప్‌లు విద్యుతాఘాతుకానికి గురై మృతి చెందారు. జగ్గంపేట సిఐ శ్రీనివాస్, గండేపల్లి ఎస్సై కె.శివనాగబాబు తెలిపిన వివరాలు ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం పేకేరు గ్రామానికి చెందిన కరిపెట్టి సింహాద్రి అప్పన్న(57) అదే మండలం రాపాక గ్రామానికి చెందిన డ్రైవర్ గడ్డం సందీప్(34) ఇద్దరూ గండేపల్లి మండలం రామయ్యపాలెం మీదుగా సింగరంపాలెం వరి కోత యంత్రాన్ని వ్యాన్‌పై ఎక్కించుకుని తీసుకు వెళుతున్నారు. ఈ క్రమంలో రామయ్య పాలెం శివారులోకి వచ్చేసరికి కిందకు వేలాడుతున్న 11 కె.వి విద్యుత్తు వైరు కోత మిషన్ ఇనుప గొట్టానికి తాకడంతో షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఆ వైరును తప్పిస్తుండగా విద్యుత్ ఘాతుకానికి గురై సందీప్, అప్పన్న అక్కడికక్కడే మృతి చెందారని వారు తెలిపారు. గండేపల్లి ఎస్సై శివ నాగబాబు కేసు నమోదు చేయగా జగ్గంపేట సి.ఐ శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పంచమా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన తెలిసిన కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

# బాలిక మృతి... వీడిన మిస్టరీ

**● నిందితుడు ఎలక్ట్రీషియన్ శ్రీనివాసు ● ఎస్పీ రాహుల్ మీనా వెల్లడి**



రామచంద్రపురం (కోనసీమ బ్యూరో), నవంబరు 9 ప్రభాతవార్త: రామచంద్రపురంలో ఐదో తరగతి చదువు తున్న బాలిక సిర్రా రంజిత అనుమానాస్పద మరణం మిస్టరీకి వీడింది. ఈ ఘటన ను ఆత్మ హత్యగా మలిచేందు కు చేసిన ప్రయత్నం వెనుక నిందితుడి నాటకం బయట పడిందని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. తల్లిదండ్రులతో సన్నిహి తంగా ఉంటూ ఇంట్లో ఎలక్ట్రికల్ పనులు చేసే స్థానిక పెయ్యలపేటకు చెందిన ఎలక్ట్రీషియన్ పెయ్యల శ్రీనివాసు ఆర్థిక ఇబ్బందులు, ఈఎంఐల ఒత్తిడి, చెల్లెలి వివాహ ఖర్చులకు రూపాయి దొరకడం లేదన్న ఆవేదనతో ఆ ఇంట్లో చోరీకి యత్నించాడు. ఈ నెల 3న రంజిత ఇంట్లో ఒంటరిగా ఉండగా, చోరీకి వచ్చిన శ్రీనివాసును బాలిక ప్రశ్నించడంతో అతడు గాబరా పడ్డాడు. విషయం తల్లికి చెబుతుందన్న భయంతో రంజితను గొంతు నులిమి హత్య చేశాడు. తరువాత బాలిక మెడకు చున్నీ కట్టి సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడదీసి ఆత్మ హత్యలా సర్దు బాటు చేశాడు. అనంతరం స్కూల్ వద్దకు వెళ్లి సిసి ఫుటేజ్ నకలు తీసుకుని బాలిక ఆత్మ హత్య చేసుకుం దని ఒక మెసేజ్ రాసి వాట్సాప్‌లో పెట్టి దృష్టి తప్పించే ప్రయత్నం చేశాడు.

**ఆ మెసేజ్ బండారం బట్టబయలు చేసింది.**

ఆ సందేశమే పోలీసుల దృష్టిని శ్రీనివాసు పైకి తిప్పింది. అనుమానాస్పద సమాచారంపై దర్యాప్తు ముమ్మరం చేశారు. డిఎస్‌పి రఘువీర్ ఆధ్వర్యంలో ఐదు బృందాలు పగలు, రాత్రి డిస్టింక్షన్స్ లేకుండా దర్యాప్తు జరిపాయి. సాంకేతిక ఆధారాలు, కాల్ డేటా, సీసీ ఫుటేజ్ ఆధారంగా చివరకు శ్రీనివాసును పోలీసు బృందాలు అరెస్టు చేశాయి. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మూడు సార్లు రామచంద్ర పురం వచ్చి విచారణను స్వయంగా పర్య వేక్షి ంచారు. చివం ^కు పెయ్యల శ్రీనివాసు ప్రధాన నిందితుడని నిర్ధారించారు. నిందితుడిని హాజరుపరిచి వివరాలు వెల్లడించారు.

# వైద్యుల నియామకాలు చేపట్టాలి

**వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులకు సీఆర్ఎం బృందాలు**

విజయవాడ, నవంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో వైద్య సేవలతో పాటు మాతా శిశు సంరక్షణ చర్యలు బాగున్నాయని కేంద్ర బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై వైద్యారోగ్య శాఖకు కేంద్ర బృందం పలు సూచనలు చేసింది. ఈ నెల 4 నుంచి పార్వతీపురం మన్యం, చిత్తూరు జిల్లాల్లో పర్యటించిన కామన్ రివ్యూ మిషన్(సీఆర్ఎం) బృందాలు మంగళగిరిలోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయంలో కమీషనర్ వీరపాండియన్, సెకండరీ హెల్త్ సంచాలకులు చక్రధరబాబు, జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులతో సమావేశమయ్యాఇ. కేంద్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ కమీషనర్ డాక్టర్ జోయ ఆలీ రజ్వీ, ఉప కార్యదర్శి డాక్టర్ భవానీ సింగ్ నేతృత్వంలోని బృందాల సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వాసుపత్రులతో పాటు, జిల్లా ఆస్పత్రిల్లోని ఎన్‌సీడీ క్లినిక్‌లలో వైద్యులను నియమించాలి. వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు ఎప్పటికప్పుడు తప్పనిసరిగా పునశ్చరణ తరగతులు నిర్వహించాలి. ఆస్పత్రిల్లో బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ, అగ్నిమాపక వ్యవస్థ సమర్థంగా సాగేలా చూడాలి. ఎన్‌సీడీ సర్వేల్లో గుర్తించిన పీడితులను సకాలంలో పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేయాలి. మానసిక సమస్యలున్న వారికి కౌన్సెలింగ్ చేరువ చేయాలి. పెండింగ్‌లో ఉన్న కాటరాక్ట్ శస్త్రచికిత్సలు త్వరగా పూర్తి చేయాలి. టీవీ స్క్రీనింగ్‌ను సమర్థంగా నిర్వహించాలి. క్షయ రోగులకు ఎక్స్‌రే సేవలు, నగదు సాయం అందచేతలో అడ్డంకులు అధిగమించాలి. రెండు జిల్లాల్లో 19 ఆసుపత్రులను పరిశీలించిన కేంద్రబృందం, వైద్య సేవలు, ఎఫ్ఆర్ఎస్, డేటా నమోదు, ఆశా, ఏఎన్ఎం యూప్‌ల నిర్వహణ, ప్రసూతి, శిశు సేవలు తదితర అంశాలపై సంతృప్తి వ్యక్తం చేసిందని వైద్యారోగ్య శాఖ కమీషనర్ వీరపాండియన్ తెలిపారు. సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు స్థానికులతో మమేకపై సేవలందిస్తున్న తీరు, విద్యా శాఖ, అంగన్‌వాడీల సమన్వయం బాగుందని బృందం పేర్కొన్నట్లు చెప్పారు.



స్వామి అమ్మవార్ల లక్షబిల్వ, కుంకుమార్చనలు

# శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తులతో కిటకిట

**స్వామికి బిల్వార్చన... అమ్మవారికి లక్ష కుంకుమార్చన**

శ్రీకాళహస్తి, నవంబరు 9 ప్రభాతవార్త: కార్తీక మాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తులతో కిటకిటలాడుతోంది. ఆదివారం కదలి తరంగాల్లా భక్తులు కదలి వచ్చారు. ఓ వైపు భక్తుల తాకిడి. రాహుకేతుదోష నివారణ పూజలకు రద్దీ. విఐపిల తాకిడి, సేవలతో పునీతం. ముక్కంటీశునికి లక్ష బిల్వార్చన, దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు భక్తి శ్రద్దలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం స్వామి అమ్మవార్లకు అలంకార మండపంలో ప్రత్యేకంగా నియమించిన వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా, ఆలయ ప్రధాన అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామి నాథన్ అచ్చితా గురుకుల్, ఆలయ ఉప ప్రధానార్చకులు దక్షిణామూర్తి అభిషేక గురుకుల్ సూరి వేద మంత్రాలను పఠిస్తుండగా బిల్వాలను సమర్పిస్తూ పూజించారు. కాగా అమ్మవారికి ప్రత్యేకంగా రాజమండ్రి నుంచి అందించిన కుంకుమతో అభిషేకించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసారు.

# క్షేత్ర పర్యటనకు ట్రెయినీ ఐఏఎస్‌లు

**మార్గనిర్దేశనం చేసిన ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ**



విజయవాడ, నవంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి: ట్రైనీ ఐఏఎస్‌లు పర్యటనలో భాగంగా జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భౌగోళిక, సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై అవగాహన పెంపొందించుకోవాలని ఈ అవగాహన ముున్ముందు విధి నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ముస్సోరిలోని నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ పొందుతున్న 20 మంది ట్రెయినీ ఐఏఎస్ అధికారులు మూడు బృందాలుగా ఈ నెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ట్రెయినీ ఐఏఎస్‌లకు కలెక్టర్ జి.లక్షీ ్మశ ఆదివారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి సమావేశం నిర్వ హించి ఫీల్డ్ స్టడీ అండ్ రీసెర్చ్ ప్రోగ్రామ్ (ఎఫ్ఎస్ఆర్పీ) కింద ఆరు రోజుల క్షేత్ర పర్యటనను విజయవంతంగా పూర్తిచేసేందుకు మార్గనిర్దేశనం చేశారు. జిల్లా భౌగోళిక పరిస్థితులు, మండలాలు, గ్రామాల వివరాలతో పాటు సాంస్కృతికంగా, పర్యాటకంగా కీలక ప్రాంతాల గురించి వివరించారు. నిర్దేశ టూర్ షెడ్యూల్‌కు అనుగుణంగా జరిగే క్షేత్ర పర్యటనలో రెవెన్యూ, పంచాయతీరాజ్, మునిసిపల్, పోలీస్, విద్య, వైద్య ఆరోగ్యం, వివిధ శాఖల అధికారులతో సమావేశాలతో పాటు స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాల సాధన దిశగా క్షేత్రస్థాయిలో ఆయా శాఖల పరిధిలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలపై అవగాహన పెంపొందించేలా నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు వంటి వాటి సందర్శనతో పాటు స్వయం సహాయక సంఘాలు, హస్తకళాకారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తదితరులతో సమావేశాలతో ఆయా ప్రాంతాల సంస్కృతీ సంప్రదాయాలు, సామాజిక ఆర్థిక పరిస్థితులు, సహజ వనరుల నిర్వహణ తదితరాలపైనా అవగాహన పెంపొందించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్ఏప పీడీ ఏఎన్‌ఏవీ నాంచారరావు, డీపీవో పి.లావణ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.




# శ్రీకాళహస్తిలో అభివృద్ధికి అటవీ వివాదాలు తొలగించండి

**డిప్యూటీ సిఎం పవన్‌కు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విన్నపం**

శ్రీకాళహస్తి, నవంబరు 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఏళ్ళ తరబడి జటిలంగా ఉన్న అటవీశాఖకు సంబంధించిన వివాదాలతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని వాటిని పరిష్కరించాలని డిప్యూటి సిఎ, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి విన్నవించారు. శ్రీకాళహస్తి అభివృద్ధిలో భాగమైన ఎస్ఎస్ కెనాల్, అలాగే శ్రీకాళహస్తి మండలంలోని సింహాచల కండ్రిగ గ్రామాల్లో రిజర్వ్ ఫారెస్టు భూ వివాదాలు జటిలంగా మారి శాంతి భద్రతల సమస్యగా పరిణమించిందని ఎంఎల్ఏ డిప్యూటి సిఎంకు విన్నవించారు. కాగా బివిపురంలో అటవీశాఖ భూములు రైతులకు మధ్య వివాదం నడుస్తుందన్నారు. కాగా సింహాచల కండ్రిగలో దళితులకు సంబంధించిన భూములకు పట్టాలిచ్చారని అయితే ఆభూములు రిజర్వ్ ఫారెస్టు అంటూ రైతులను తరిమివేసి వనసంరక్షణ సమితి సారథ్యంలో మొక్కలు నాటే కార్యక్రమాలను అటవీశాఖ చేపట్టగా దళిత రైతులు అడ్డుకున్నారని వారికి చూపుతామన్న అధికారులు చివరకు ఆరుకిలో మీటర్ల దూరంలోని అంజనేయపురం గ్రామానికి సమీపంలో భూములు కేటాయిస్తే ఎలా వెళతారని దాంతో రైతులు కోర్టును ఆశ్రయించి వనసంరక్షణ సమితి పనులను అడ్డుకున్నారని డిప్యూటి సిఎం దృష్టికి తెచ్చారు. కాగా ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకోవటానికి అటవీ పరిధిలో ట్రెంచ్‌లు ఏర్పాటు చేయాలని పవన్ కల్యాణ్ దృష్టికి తెచ్చారు. ఈ వివాదాలకు సంబంధించి సంబంధిత అధికారులతో చర్చించి సత్వరం పరిష్కరించుటకు ప్రయత్నిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ భరోసా ఇచ్చారు.

# వేదోక్తంగా కార్తీకమాస పూజలు



ఇంద్రకీలాద్రి, నవంబరు 9 ప్రభాత వార్త: దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఓ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. కార్తీకమాస పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఓ చైర్మన్లు తెలిపారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు. సకల లోకాలు, సకల జీవరాశులు సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ శ్రీ దుర్గమ్మవారి సన్నిధిలో ఆదివారం సూర్య ఉపాసన సేవ నిర్వహించారు. కార్తీకమాసం ఆదివారం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా ఇఓ వికె శీనానాయక్ మధ్యాహ్నం వరకు అంతరాలయ దర్శనాలు రద్దు చేశారు. భక్తులకు మంచినీరు తదితరాలు అందిస్తూ త్వరితంగా క్యూలైన్లు కదిలేలా చర్యలు తీసుకున్నారు.

**దాతల విరాళాలు**

దుర్గమ్మ ఆలయంలో జరిగే ఉచిత ప్రసాద వితరణ పథకానికి మంగళగిరికి చెందిన పోలవరపు వెంకట సాయి, మనోజ్ చౌదరి, నీరజ వారి కుటుంబీకులు రు.1,00,501ల విరాళాన్ని శనివారం అందించారు. అలాగే విజయవాడకు చెందిన కొడాలి సుబ్బారావు, వారి కుటుంబసభ్యులు రు.1,01,116ల విరాళం ను వారి కుమార్తు కొడాలి నగేష్‌బాబు పేరిట అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి ప్రసాదం, శేషవస్త ్రం, మెమంటోఅందించారు. వేదపండితులు ఆశీర్వచ ^నాలందించారు.

**దుర్గమ్మవారి ఆలయానికి రావాలని కంచిపీఠాధిపతికి ఆహ్వానం**

దుర్గమ్మవారి ఆలయానికి వచ్చి శ్రీ అమ్మవారిని దర్శించుకుని భక్తులకు అనుగ్రహభాషణం ఇవ్వాలని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఓ వికె శీనానాయక్, చైర్మన్ రాధాకృష్ణలు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి వారిని కోరారు. ఆదివారం తాడేపల్లిలో



వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ కంచికామ కోఠిపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారిని కలిసి వారిని ప్రార్థించగా వారు మన్నించారు. ఈ సందర్భంగా ఇఓ మాట్లాడుతూ రెండు రోజుల్లో ఆలయానికి శ్రీ స్వామివారు వచ్చే అవకాశముందన్నారు.



# వాడపల్లి వెంకన్న సేవలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు

ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా బ్యూరో, నవంబరు 9 ప్రభాతవార్త: ఏడు వారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు కుటుంబ సమేతంగా విచ్చేసి దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు, డిప్యూటీ కమీషనర్, ఈఓ, నల్లం సూర్య చక్రదరరావు, చైర్మన్, ముదునూరి వెంకటరాజు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ చైర్మన్, ఆలయ డిప్యూటీ కమిషనర్ బండారు సత్యానందరావు, తనయుడు యువనాయకులు బండారు సంజీవ్, శ్రీస్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. స్పీకర్ వెంట అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# భవన నిర్మాణ పనుల్లో మంత్రి రామానాయుడు శ్రమదానం

పాలకొల్లు, నవంబరు 9 ప్రభాతవార్త: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఆదివారం రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు శ్రమదానం చేశారు. రూ.3 కోట్లతో జరుగుతున్న గౌడ, శెట్టిబలిజ కల్యాణ మండప స్లాబ్ నిర్మాణ పనుల్లో కార్మికులతో కలిసి పనిచేశారు. పారపట్టి ఇసుక, కంకరను గమేళాల్లో వేసుకుని నెత్తి మీద పెట్టుకొని మిల్లర్లలో వేశారు. కాంక్రీట్ పనుల్లోనూ పాల్గొన్నారు. ఎండను సైతం లెక్క చేయకుండా పనిచేశారు. కొద్దిసేపు కార్మికులతోనూ మమేకమై యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు విలేకరులతో మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో రూ.1.50 కోట్లు మంజూరై మొదటి స్లాబు పనులు జరిగాయి అన్నారు. వైసిపి ప్రభుత్వంలో రూపాయి ఖర్చుకు అర బస్తా సిమెంట్ పని నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కల్యాణ మండప నిర్మాణ పనులు మొదలుపెట్టి పూర్తిచేసే బాధ్యత నాదంటూ మాట ఇచ్చానని... నేడు మాట నిలుపుకునేలా కూటమి ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేయడంతో మళ్లీ పనులు మొదలయ్యాయన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, గౌడ శెట్టిబలిజ కల్యాణ మండప కమిటీ నాయకులు మేకా కోటేశ్వరరావు, పితాని వెంకట్, పెచ్చెట్టి బాబు, అప్పారి ఉమామహేశ్వరావు, అంగర చిన్న, బొక్క గంగాధర్ రావు, ఏఎంసి చైర్మన్ కోడి విజయ భాస్కర్, మామిడి శెట్టి పెద్దిరాజు, కడలి గోపాలరావు, గండేటి వెంకటేశ్వరరావు, చిట్టూరి ఏడుకొండలు, కుక్కల సత్యనారాయణ, గోపాలకృష్ణ, గుబ్బల ఏడుకొండలు, రాచమల్ల మీరయ్య, కౌరు సందీప్ కుమార్, కేతరాజు, నున్న బోయిన సత్యనారాయణ, తదితరు నాయకులు పాల్గొన్నారు.

10-11P g7exHMNWJQE 11_10-11P g7exHMNWJQE.qxd 09/Nov/25 11:20 PM Page 1



## నేడు ఏపీకి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్

### 12న సీఎం చంద్రబాబుతో భేటీ



విజయవాడ, నవంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆంధ్రప్రదేశ్ రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. శివరాజ్ సింగ్ చౌహాన్ సోమవారం (నవంబర్ 10) నాడు గుంటూరు జిల్లాకు రానున్నారు. మరుసటి రోజు వాటర్‌షెడ్ జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొంటారు. ఆయన పర్యటన వివరాలను అధికారులు వెల్లడించారు. కేంద్ర మంత్రి చౌహాన్ నవంబర్ 10న రాత్రి 8:40 గంటలకు విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి కారులో బయలుదేరి రాత్రి 9:45 గంటలకు గుంటూరులోని ఐటీసీ హోటల్‌కు చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేయనున్నారు. నవంబర్ 11వ తేదీ ఉదయం 9:30 గంటలకు హోటల్ నుంచి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బయలుదేరి 9:45 గంటలకు గుంటూరు మండలం వెంగళాయపాలెం చేరుకుంటారు. అక్కడ 10:30 గంటల వరకు క్షేత్ర సందర్శన చేస్తారు. అనంతరం ఆయన నల్లపాడులోని లయోల పబ్లిక్ స్కూల్‌కు 11 గంటలకు చేరుకుని, అక్కడ వాటర్‌షెడ్ మహోత్సవ్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అక్కడి నుంచి బయలుదేరి ఉండవల్లిలోని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నివాసానికి శివరాజ్ చౌహాన్ వెళ్లనున్నారు. సీఎం చంద్రబాబు నివాసం నుంచి తిరిగి బయలుదేరి సాయంత్రం 5:30 గంటలకు ఐటీసీ హోటల్‌కు చేరుకుంటారు. అక్కడ జరిగే వాటర్‌షెడ్ జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. సాయంత్రం 6:45 గంటలకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నివాసానికి వెళ్లి భేటీ అవుతారు. రాత్రి 7:45 గంటలకు అక్కడి నుంచి బయలుదేరుతారు. రాత్రి 8:25 గంటలకు విజయవాడ విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి ఢిల్లీకి శివరాజ్ సింగ్ చౌహాన్ తిరిగి ప్రయాణం అవుతారని మంత్రి కార్యాలయం తెలిపింది.

# 'హనుమాన్'ను పకడ్బందీగా అమలుచేయాలి

**- మానవ, ఏనుగుల ఘర్షణ నివారణ, జంతువుల సంరక్షణ లక్ష్యం**

**- ప్రత్యేకమైన కాలపరిమిత, కార్యాచరణ అవసరం - రైతులను ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లించేలా చూడాలి - ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్**



పలమనేరు, నవంబరు 9 ప్రభాతవార్త: మానవులు, ఏనుగుల మధ్య సంఘర్షణ నివారించడంతోపాటు సరి కొత్త సాంకేతికతతో అటవీ జంతువులకు సంరక్షణ చేపట్టేందుకు రాష్ట్ర అటవీశాఖ రూపొందించిన హనుమాన్ ప్రాజెక్టు వివరాలను ఉపముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ తెలుసుకున్నారు. 11 అంశాలతో కూడిన ఈ ప్రాజెక్టును అటవీ శాఖాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పవన్ కల్యాణ్‌కి వివరించారు. హనుమాన్ ప్రాజెక్టులోని ప్రతి అంశాన్ని నిర్ధిష్ట కాలపరిమితి అవసరం అన్నారు. అధునాతన టెక్నాలజీతో కొత్త యాప్‌ను రూపొందించి మార్చి 3వ తేదీ లోపు అందుబాటులోనికి తీసుకురావాలని ఆదేశించారు. అటవీశాఖ, పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. దీనిపై చర్చించేందుకు నవంబర్ 3వ వారంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ మానవులు, జంతువుల మధ్య సంఘర్షణను తగ్గించేందుక తీసుకుంటున్న చర్యల్లో భాగంగా రాష్ట్ర అటవీ శాఖ రూపొందించిన హనుమాన్ ప్రాజెక్టు బాగుంది అయితే ప్రాజెక్టులోని ప్రతి అంశాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు కాల పరిమితి పెట్టుకోవాలన్నారు. ఏనుగులతో తీవ్రంగా దెబ్బతింటున్న పంటల స్థానంలో ప్రత్యామ్నాయాలు ఎలా? దానికి రైతులు ఎలా ఒప్పించాలనే అంశాలపై దృష్టి సారించాలన్నారు.

**ప్రత్యేకయాప్‌ను సిద్ధం చేయండి**

మానవ, వన్యప్రాణి సంఘర్షణను తగ్గించేందుకు ఇప్పటికే అమల్లో ఉన్న గజ ప్రజాయాప్ స్థానంలో నూతన సాంకేతికతో ప్రత్యేకయాప్‌ని సిద్ధం చేయండి, తమ పరిసర ప్రాంతాల్లో సంచరించే జంతువుల సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేలా ఆ యాప్ ఉండాలి. ఏనుగులకు ప్రత్యేక రెడియో కాలర్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు కేంద్రం నుండి అనుమతి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**గ్రామస్థాయిలో సర్పమిత్ర వాలంటీర్లు**

హనుమాన్ ప్రాజెక్టులో భాగంగా పట్టణాల్లో మాదిరి గ్రామాల్లోనూ జనావాసాల్లోకి వచ్చిన పాముల నుంచి ప్రజలకు హానీ కలగకుండా సర్పమిత్రలను ఏర్పాటు చేసేందుకు ప్రతి పంచాయితీ పరిధిలో వాలంటీర్లను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నట్లు అటవీ శాఖాధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. గ్రామస్థాయిలో ముందుకు వచ్చే సర్పమిత్ర వాలంటీర్లకు అటవీ శాఖ నుంచి ప్రోత్సాహకాలందించాలని పవన్ సూచించారు.

**ప్రజల నుండి పార్టీ శ్రేణుల నుంచి అర్జీల స్వీకరణ**

పలమనేరు పర్యటనకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, జనసేన, టిడిపి, బిజేపి నేతలు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రికి ప్రజల నుండి, జనసేన శ్రేణుల నుంచి అర్జీలు వచ్చాయి. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

## తిరుమల అన్నప్రసాదాల నాణ్యత అభినందనీయం

### వైసిపి ఎమ్మెల్సీ అంబటి రాంబాబు ట్వీట్

తిరుమల, నవంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలకు వస్తున్న భక్తులకు రుచిగా శుచిగా అన్న ప్రసాదాలను టిటిడి అందిస్తుండటం అభినందనీయమని వైసిపి ఎంఎల్‌సి అంబటి రాంబాబు తెలిపారు. ఆదివారం ఆయన శ్రీవారి దర్శనానంతరం తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో కుటుంబసభ్యులతో కలసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఎంతో నాణ్యమైన అన్నప్రసాదాలను భక్తులకు అందిస్తోందని, భోజనశాల పరిశుభ్రత, రోజుకు లక్షమంది భక్తులకు భోజనాన్ని అందించడం నిర్వహణ చేస్తుండటం తనకు అర్థంకాలేదన్నారు. తాను అక్కడే భోజనం చేసి యూట్యూబ్‌లో వీడియో పోస్టుచేయడం ఇప్పుడు టిటిడి పనితీరుకు నిదర్శనం అని పేర్కొన్నారు.



## కల్తీనెయ్యి కేసు



# సిట్ ముందుకు మాజీ ఛైర్మన్ వైవి?

### బ్యాంకు ఖాతాల వివరాలపై నేడు హైకోర్టు తీర్పు

తిరుమల, నవంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలేశుని లడ్డూప్రసాదాల తయారీకి కల్తీనెయ్యి సరఫరా జరిగిందనేది దాదాపు నిగ్గుతేల్చేసిన సిబిఐ సిట్ అధికారులు, అక్రమాలకు వంతపాడిన సూత్రధారుల వ్యవహారంపై దృష్టి పెట్టింది. ఇప్పుడు టిటిడి మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డిని సిట్ విచారణ చేయక తప్పదనేది తేలిపోయింది. ఆయన వ్యక్తిగత సహాయకుడు, ఆర్థికలావాదేవీలు పర్యవేక్షించిన చిన్నఅప్పన్నను సిట్ అరెస్ట్‌చేసి కటకటాల్లోకి పంపింది. అతని నుండి ఇటీవల వరుసగా రెండురోజులు రాబట్టిన సమాచారం మేరకు ఇప్పుడు కల్తీనెయ్యి వ్యవహారం వైవి వరకు చేరిందనేది తెలుస్తోంది. వైవి సుబ్బారెడ్డి 2019నుండి 2023వ సంవత్సరం వరకు టిటిడి ఛైర్మన్‌గా రెండు దఫాలు కొనసాగారు. ఆ కాలంలోనే నెయ్యి సరఫరాలో కల్తీ జరిగిందనేది తేలినా ఎందుకు కొనసాగించారు, దానివెనుక ఏ మేరకు లాభపడ్డారనేది అంశాలపై సిట్ విచారణకు వీలుగా వైవి, అతని సతీమణి బ్యాంకు ఖాతాల వివరాలను సిట్ సంబంధిత బ్యాంకుశాఖను కోరింది. అయితే బ్యాంకు లావాదేవీల వ్యవహారాల వివరాలు వెల్లడించలేనని, దీనిపై శనివారం సుబ్బారెడ్డి తరపున న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కల్తీనెయ్యి కేసులో సిట్ దర్యాప్తు వేగంగా సాగుతున్న తరుణంలో సుబ్బారెడ్డి హైకోర్టును ఆశ్రయించడం కీలక పరిణామంగా మారింది. తన వివరాలను సిట్ కోరిందని, దానిపై కొంత సడలింపు కోరుతూ పిటిషన్ వేయడం సంచలనంగా మారింది. ఎవరైనా అనుమానంపై లావాదేవీలపై కొంత సమాచారం రావడానికి బ్యాంకు ఖాతాలు కోరవచ్చనేది హైకోర్టుకు సిట్ కూడా నివేదిక ఇచ్చింది. కల్తీనెయ్యిలో సుబ్బారెడ్డి పాత్రపై వివరాలు రాబట్టేందుకే బ్యాంకు ఖాతాలు వివరాలు కోరామని, సుబ్బారెడ్డి పిటిషన్ కొట్టివేయాలని సిట్ హైకోర్టుకు విన్నవించింది. అయితే నేడు హైకోర్టులో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోనున్నాయనేది వెలువడించనున్న తీర్పుపై ఆధారపడి ఉంది. ఇప్పటికే కల్తీనెయ్యి వ్యవహారం పలు మలుపులు తిరిగి టిటిడి మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పాత్ర వరకు సిట్ అధికారులు ఆధారాలు సేకరించారనేది కీలకంగా మారింది. కొందరు సూత్రధారులతోబాటు టిటిడి అధికారుల పాత్రపై కూడా సిట్ దర్యాప్తు కొనసాగించే అవకాశం స్పష్టంగా తెలుస్తోంది. 2020వ సంవత్సరం నుండి టిటిడికి తిరుమల ఆలయానికి అవసరమైన నెయ్యి సరఫరాకు టెండర్లు పిలవడం, టెండర్లలో పాల్గొన్న డెయిరీ సంస్థల యాజమాన్యం టిటిడి నిబంధనలు ఉల్లంఘించి నాణ్యతలేని నెయ్యి సరఫరా చేశారనేది సిట్ తేల్చిసిన రిపోర్టు. ఈ వ్యవహారంలో గత బోర్డు సభ్యుల పాత్రకంటే అప్పటి టిటిడి అధికారుల పాత్ర కీలకంగా మారిందనేది సంచలనంగా మారింది. ఇప్పటికే అరెస్టయిన తొమ్మిది మంది నిందితుల రిమాండ్ రిపోర్టుల ఆధారంగా టిటిడి అధికారుల పాత్రపై సిట్ ఆరా తీసేందుకు రంగం సిద్ధమైంది. లడ్డూలను కలుషితం చేసిన పాపంలో రానున్న రోజుల్లో ఎవరి పాపం పండుతుందనేది మాత్రం సిట్ అధికారుల చేతిలో కీలకం. ఈ కల్తీ కేసులో క్లైమాక్స్‌లో శిక్ష ఎంతమందికి పడనుందనేది ఈ నెలాఖరులోపు తేలిపోనుంది.




## పట్టణాభివృద్ధిలో ప్రణాళికా విభాగం కీలకం

విజయవాడ కార్పొరేషన్, నవంబరు 9 ప్రభాతవార్త: అభివృద్ధిలో పట్టణ ప్రణాళికా విభాగం కీలకమైందని, ప్రణాళికా విభాగం తోనే ఎలాంటి అభివృద్ధైనా సాధ్యమని, క్షేత్ర స్థాయి విధుల నిర్వహణలో అనేక ఒత్తిడులు, సవాళ్ళను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం నగరంలో నిర్వహించిన అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్‌కు క్షేత్ర స్థాయి సిబ్బంది కొరత ఉందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు భర్తీ కావడం లేదని, పట్టణాల్లో ప్లానింగ్ సెక్రటరీలకు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతులు కల్పిస్తే క్షేత్రస్థాయి సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సభ్యులకు గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులకు నూతనంగా సర్వీస్ రూల్స్ ఏర్పాటుపై ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎపిపి మోహన్‌బాబు, జోనల్ అధ్యక్షుడు వసీంబేగ్, అసోసియేషన్ ఉపాధ్యక్షులు అబ్దుల్ సత్తార్, ఆర్డీడీపీ నాయుడు, నాలుగో జోన్ అధ్యక్షులు రమణమూర్తి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, జి.కృష్ణ, రతన్‌రాజు, టీపీఎస్ సునీత, మతీన్ పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## రాయపూడి వద్ద కృష్ణానదిలో ఇద్దరు యువకులు గల్లంతు

### అధికార యంత్రాంగం గాలింపు చర్యలు

గుంటూరు, నవంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి: తూళ్లూరు మండలం రాయపూడి గ్రామ సమీపంలోని లాంచీల రేవు వద్ద ఇద్దరు యువకులు ఆదివారం నాడు గల్లంతయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. అమలాపురానికి చెందిన పవన్, గిద్దలూరుకు చెందిన దినేష్ రాజధాని పనులు చేసుకుంటూ ఉన్నారు. వీరు పనిచేస్తున్న కంపెనీ వద్దే పనిచేస్తున్న మరో ఇద్దరితో కలిసి ఆదివారం లాంచీల రేవు వదనద కృష్ణానదిలో స్నానం చేసేందుకు అందులోకి దిగారు. స్నానం చేస్తూ పవన్, దినేష్ నీటిలో గల్లంతయ్యారు. కాగా మణికంఠ, పవన్ బయటకు వచ్చారని తెలిపారు. తుళ్లూరు సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కలగయ్య, స్థానిక రెవెన్యూ సిబ్బంది, సమీపంలోని జాలర్లు కలిసి పడవులతో గాలింపు చర్యలు చేపట్టారు.

# గుంతల రహిత రహదారుల రాష్ట్రంగా ఎపిని మారుస్తాం

**రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి**




విజయవాడ, నవంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీని రూ. 1081 కోట్లతో గుంతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దామని రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఏపీఆర్‌డీసీ సభ్యులు పూర్తి సహకారం అందించాల న్నారు. విజయవాడ నగరంలోని ఆర్‌బి ఇఎన్‌సీ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్పోరేషన్ సభ్యులందరితో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం రహదారులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, గత ఐదేళ్లలో రోడ్లను కనీసం రెన్యువల్ కూడా చేయక పోవడంతో రాష్ట్రంలో వేల కి.మీ రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 5 నెలల కాలంలోనే రాష్ట్రాన్ని గుంతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దామన్నారు. దీనివల్ల కూటమి ప్రభుత్వం, ఆర్ అండ్ బి శాఖపై ప్రజల్లో సానుకూలత నెలకొందన్నారు. ఇటీవలి తుపాన్ ప్రభావంతో రాయలసీమ ప్రాంతంలో కొంత మేర రహదారులు బాగానే ఉన్నప్పటికీ, ఉత్తరాంధ్ర, కోస్తా, కృష్ణ, గుంటూరు జిల్లాలలో పాడైన రహదారులపై దృష్టి పెడుతున్నామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రహదారుల అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తమ కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గతంలో అధ్వానంగా ఉన్న రాష్ట్ర రహదారులకు నేడు మహర్దశ వచ్చిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో దాదాపు రూ. 2,500 కోట్ల మేర రహదారుల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మరో రూ.1000 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచి అతి త్వరలో పనులు చేపట్టనున్నామని మంత్రి వివరించారు. ఆర్డీసీ సభ్యులపై రోడ్ల బాధ్యత ఉందని, స్థానికంగా ఆయా సభ్యుల పరిధిలో ఉన్న రహదారుల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆర్థిక సమస్యలను సమన్వయ పరుచుకుంటూ, నిధులను సమీకరించి రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నా మన్నారు. రహదారులకు సంబంధించి అను నిత్యం ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షలు నిర్వహిస్తూ ఎన్ డి బి, నాబార్డ్ వంటి బ్యాంకులు ద్వారా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) మోడల్‌తో ప్రజలపై భారం పడకుండా రహదారులను అభివృద్ధి చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఏపీ ఆర్డీసీ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరావు మాట్లాడుతూ నూతన సభ్యులు వారి పరిధిలో రహదారులను పరిరక్షిస్తూ సమస్యలు ఎదురైతే మంత్రి దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో సభ్యులు భాగస్వామ్యులు అయి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం మంత్రి సమక్షంలో 16 మంది రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఆర్డీసీ) సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలిపి, శాలువాతో సన్మానించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీసీ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వర రావు, ఏపీ ఆర్డీసీ ఎండి ఎల్.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



## కాపు ఉద్యమానికి ఆద్యుడు మిరియాల

విజయవాడ, నవంబరు 9 ప్రభాతవార్త: కాపుల అభ్యున్నతి కోసం అహర్నిశలు పోరాడి ఉద్యమానికి ఆద్యుడుగా నిలిచిన మిరియాల వెంకటరావును స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ అన్నారు. కాపు రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో గాజువాక శ్రీకృష్ణ దేవరాయ కన్వెన్షన్‌లో ఆదివారం కాపునాడు వ్యవస్థాపకుడు మిరియాల వెంకటరావు 11వ వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిధులుగా పల్లా శ్రీనివాస్, పివిఎన్ మాధవ్‌లు పాల్గొని మిరియాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాపులకు రాజకీయంగా అన్యాయంగా జరుగుతోందంటూ 1988లో ఆయన విజయవాడలో ఇరవై లక్షల మందితో సమావేశం ఏర్పాటు చేసి, కాపునాడును ఏర్పాటు చేశారని, నాటి నుంచి కాపునాడు వ్యవస్థాపక అధ్యక్షుడిగా కొనసాగారని కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు, మున్నూరు కాపులను ఏకతాటికిపై తీసుకొచ్చేందుకు కృషి చేసి కాపులకు రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వాలని, విద్య, ఉద్యోగాల్లో 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ పలు సందర్భాల్లో ఉద్యమించారన్నారు. కూటమి ప్రభుత్వం కాపుల అభ్యున్నతికి తగిన ప్రాధాన్యత కల్పిస్తుందని చెప్పారు. సామాజిక న్యాయం కోసం అలుపెరుగని పోరాటం సాగించిన వెంకటరావును అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కెఆర్‌పిఎస్ రాష్ట్ర ఛైర్మన్ చనమళ్ల ప్రసాదరావు, రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాసరావు, అఖిల భారత కాపు సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర మీడియా ఎనలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు, అడ్‌హక్ కమిటీ ఛైర్మన్ గుడివాడ అమ్మన్న, అప్పల రామ్మూర్తి, గంధం వెంకటరావు, వెంకట రమణ, నీరుకొండ రామచంద్రరావు, కర్రి నాగేశ్వరరావు, రామారావు, సిరసపల్లి నూకరాజు, బోగాది సన్యాసిరావు, కళావతి, అమ్మజీ, రౌతు గోవింద్, మహేష్ పాల్గొన్నారు.



## వెలుగులోకి వచ్చిన 60 కొత్త జాతుల సీతాకోక చిలుకలు

హైదరాబాద్, నవంబర్ 9 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి: ములుగు అభయారణ్యంలో 60 రకాల కొత్త జాతుల సీతాకోక చిలుకలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రంలోనే మొదటిసారి 8 రాష్ట్రాల వైల్డ్ లైఫ్, వరల్డ్ ఫర్ నేచర్ సంస్థలు ఈ సర్వేలో పాల్గొన్నాయి. 60 మంది పరిశోధకులు లక్నవరం, తాడ్వాయి, పస్రా అడవుల్లో 3 రోజులు పర్యటించి 60 రకాల సీతాకోక జాతులను గుర్తించారు. సీతాకోక చిలుకల గుర్తింపుతో జిల్లాకు దేశ వ్యాప్తంగా పేరు వస్తుందని స్థానిక రేంజర్ నరేందర్ తెలిపారు.



## అర్ధరాత్రి లాడ్జిల ఆకస్మిక తనిఖీ

### 6 కిలోల గంజాయి స్వాధీనం

నెల్లూరు క్రైమ్, నవంబరు 9 ప్రభాతవార్త: నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టడంలో భాగంగా నెల్లూరు జిల్లా వ్యాప్తంగా లాడ్జిలు, హోటల్స్‌ను ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని అధికారులు సిబ్బంది ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో గంజాయి స్మగ్లర్లు దొరకడం విశేషం. శనివారం అర్ధరాత్రి సంతపేట పరిధిలోని ఓ లాడ్జీలో సిఐ వీరసోమయ్య తన సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీ చేయగా, ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జిల్లా యస్.పి. అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు గత రాత్రి, తెల్లవారు జాము వరకు లాడ్జీలు, హోటల్స్, డార్మెంటరీలు, గెస్ట్ హౌస్‌లు, రిసార్టులలో రికార్డులు, సిసిటివి, ట్రేడ్ లైసెన్స్, ఫైర్ ఎన్‌ఓసి, జిఎస్‌టి, ఎఫ్‌ఎస్ఎస్ఏఐ లైసెన్స్, విజిటర్స్ ఐడి కార్డులనుఆకస్మిక తనిఖీ నిర్వహించి, అక్కడ పరిస్థితులను పరిశీలించారు. స్థానికేతర పోలీసు అధికారులతో 77 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, ఒక్కొక్క బృందంలో ఒక ఇంచార్జ్ ఆఫీసర్, ఒక ఉమెన్ పీసీతో పాటు మరో ముగ్గురు సిబ్బందితో ఏర్పాటు చేసి ఈ తనిఖీలను జిల్లా ఎస్పీ పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా 77 బృందాలచే హోటళ్ళు, లాడ్జీలను ఆకస్మిక తనిఖీ చేశారు. అధికారుల తనిఖీలలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. హోటళ్ళు లాడ్జీలలో 31 మాత్రమే ఫైర్ ఎన్ఓసి కలిగి ఉన్నవని, 34 మాత్రమే జిఎస్‌టి సర్టిఫికేట్ కలిగి ఉన్నట్లు గుర్తించారు. 36 మాత్రమే ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉన్నట్లు, 23 మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఎఐ సర్టిఫికేట్ కలిగి ఉన్నట్లు పోలీసుల పరిశీలనలో వెల్లడైంది. 59 హోటల్లో మాత్రమే సిసిటివి కెమెరాలు కలిగి ఉన్నట్లు గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘనలకు గానూ సంబంధిత పోలీస్ అధికారులు పబ్లిక్ సేఫ్టీని దృష్టిలో పెట్టుకొని చట్ట పరిధిలో తీసుకోవాల్సిన తగు చర్యల గురించి ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్ ప్రకారం సీసీ కెమెరాలు తప్పని సరిగా అన్ని హోటళ్ళు లాడ్జిలలో ఏర్పాటు చేసుకోవాలని, లేనిచో చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. లాడ్జీల్లో పోలీసులు ప్రతీ గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, రాత్రి వేళల్లో లాడ్జిలులో బస చేసిన వ్యక్తులను ప్రశ్నిస్తూ, వారి వివరాలపై ఆరా తీశారు. లాడ్జి పరిసరాలు స్పష్టంగా కన్పించేలా తప్పనిసరిగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి ఆకస్మిక తనిఖీలు క్రమం తప్పకుండా కొనసాగించబడతాయని, నియమాలు ఉల్లంఘించిన అన్ని స్థావరాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోబడతాయని ఎస్పీ స్పష్టం చేశారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు గురించి సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు గానీ, డయల్ 112కు గానీ తెలియచేయాలని ప్రజలకు ఆమె సూచించారు.

ఆట

# హాంగ్‌కాంగ్ సిక్సస్: ఛాంపియన్‌గా పాకిస్థాన్

## 43 పరుగుల తేడాతో కువైట్‌పై గెలుపు

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ క్రికెట్ జట్టు హాంగ్ కాంగ్ సిక్సస్ ఛాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన 2025 ఎడిషన్ ఫైనల్లో కువైట్‌పై 43 పరుగుల తేడాతో గెలుపొంది, ఆరోసారి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ నిర్ణీత 6 ఓవర్లలో 3 వికెట్లు నష్టానికి 135 పరుగుల భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ అబ్బాస్ అఫ్రిది (11) కువైట్ బౌలర్లను చీల్చి చెండాడాడు. ఓపెనర్లు అబ్దుల్ సమద్ (42), ఖ్వాజా నఫే (22) సైతం చెలరేగిపోయారు. మిగిలిన బ్యాటర్లలో షాహిద్ అజీజ్ డకౌట్ కాగా, మాజ్ సదాకత్ 10, షెహజాద్ 4 పరుగులతో అజేయంగా నిలచారు. కువైట్ బౌలర్లలో మీట్ భావ్సర్ 3 వికెట్లు తీశాడు. ఇక భారీ లక్ష్య ఛేదనలో కువైట్‌కు మెరుపు ఆరంభం లభించినప్పటికీ ఆ తర్వాత




వరుసగా వికెట్లు కోల్పోవడంతో 5.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 92 పరుగులకే పరిమితమైంది. మాజ్ సదాకత్ 3 వికెట్లు తీసి కువైట్ వెన్ను విరిచాడు. ముహమ్మద్ షెహజాద్, అబ్బాస్ అఫ్రిది, అబ్దుల్ సమద్ తలో వికెట్ తీశారు. కువైట్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు అద్నాన్ ఇద్రీస్ (30), మీట్ భావ్సర్ (33) చెలరేగినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఆ తర్వాత వచ్చిన బిల్లాల్ తహిర్ (6), రవీజా సందరువన్ (1), కెప్టెన్ యాసిన్ పటేల్ (14) తక్కువ స్కోర్లకే ఔట్ అయ్యారు. మొహమ్మద్ షఫిక్ డకౌటయ్యాడు. కాగా ఈ టోర్నీలో ఇప్పటికే భారత్ నేపాల్, యూఏఈ, కువైట్, శ్రీలంక వంటి పసికూన చేతుల్లో ఓడి క్వార్టర్ ఫైనల్స్‌కు కూడా చేరకుండానే నిష్క్రమించింది.

# శ్రీలంక చేతిలో టీమిండియా చిత్తు

**న్యూఢిల్లీ:** హాంగ్ కాంగ్ సిక్సెస్-2025 టోర్నమెంట్‌ను భారత్ జట్టు ఓటమితో ముగించింది. ఆదివారం శ్రీలంకతో జరిగిన పౌల్ గ్రూప్ మ్యాచ్‌లో 48 పరుగుల తేడాతో భారత్ ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 6 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 138 పరుగుల భారీ స్కోర్ సాధించింది. లాహిరు సమరకూన్ (14 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లతో 52), కెప్టెన్ మధుశంక (15 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో 52) విధ్వంసకర హాఫ్ సెంచరీలతో చెరేగారు. భారత్ బౌలర్లలో ప్రతీ ఒక్కరూ భారీగా పరుగులు సమర్పించుకున్నారు. అనంతరం 139 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ నిర్ణీత ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 90 పరుగులకే పరిమితమైంది.




భారత్ బ్యాటర్లలో భరత్ చిప్లి (13 బంతుల్లో 41) టాప్ స్కోరర్‌గా నిలవగా, కెప్టెన్ స్టువర్ట్ బిన్నీ (9బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో25) మెరుపులు మెరిపించాడు. ఈటోర్నీలో భారత్‌కు ఇది నాలుగో ఓటమి. అంతకు ముందు కువైట్, యూఏఈ, నేపాల్‌వంటిపసికూన చేతుల్లో మెన్ ఇన్ బ్లూ పరాజయం పాలైంది. దినేష్ కార్తీక్, రాబిన్ ఊతప్ప, బిన్నీ వంటి స్టార్ ప్లేయర్లు ఉన్నప్పటికీ కూడా భారత్ క్వార్టర్ ఫైనల్‌కు చేరడంలో విఫమైంది.



# ఎయిర్ రైఫిల్‌లో వరల్డ్ ఛాంపియన్‌గా రవీందర్

## ఎలావెనిల్‌కు కాంస్యం

**న్యూఢిల్లీ:** పురుషుల50 మీటర్ల పిస్టల్‌లో రవీందర్ సింగ్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచాడు. అలాగే మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో ఎలావెనిల్ వలరివన్ కాంస్యం గెలుచుకుంది. భారత సైన్యంలో 29 ఏళ్ల నాయక్ సుబేదార్ అయిన రవీందర్ పిస్టల్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించడం ద్వారా తన షూటింగ్ కెరీర్‌లో అతి పెద్ద విజయాన్ని సాధించాడు. అలాగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండు సార్లు ఒలింపియన్‌ఎలావెనిల్ వలరివన్ మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించి ఆకట్టుకునే ప్రదర్శనతో ముందు కొచ్చింది. ఫైనల్‌లో ఆధిక్యం సాధించిన తర్వాత 26 ఏళ్ల ఎలావెనిల్ టాప్ పోడియం స్థానాన్ని కైవసం చేసుకునే ప్రయత్నంలో ఆమె 19వ షాట్‌లో 10.0 స్కోరు చేసి 3వ స్థానానికి పడిపోయింది. 22వ షాట్‌లో పేలవమైన 9.9 స్కోరుతో 232.0 పాయింట్లు సంపాదించి మూడవ స్థానంలో నిలిచింది. దక్షిణ కొరియాకు చెందిన 2024 పారిస్ గేమ్స్ ఛాంపియన్ బాన్ హ్యోజిన్ 255 స్కోరుతో స్వర్ణం గెలుచుకుంది. అయితే 19వ షాట్ వరకు ఎలావెనిల్ కంటే వెనుకబడిన చైనా జూనియర్ ప్రపంచ ఛాంపియన్ వాంగ్ జీఫీ 254 స్కోరుతో రజతం సాధించింది. కాగా ఎలావెనిల్, మేఘన సజ్జనార్ మరియు శ్రేయ అగర్వాల్‌లతో కూడిన భారత మహిళల జట్టు 1893.3 పాయింట్లతో కాంస్యం గెలుచుకోగా, చైనా (1901.7) మరియు దక్షిణ కొరియా (1899.9) వరుసగా స్వర్ణం మరియు రజతం గెలుచుకున్నాయి.

# టీమిండియా వైఫల్యాలు

## 100 రన్స్ కూడా చేయలేని స్టార్లు.. పాఠం నేర్పని పరాభవాలు

**న్యూఢిల్లీ:** టీమిండియా తరచూ వైఫల్యాలను మూటగ ట్టుకుంటోంది. గత వైఫల్యాల నుండి పాఠం నేర్వకపోవడంతో ఓనమాలు రాని, పసికూన జట్ల చేతిలో కూడా దారుణంగా పరాభం పాలవుతోంది. తాజాగా క్రికెట్‌లో పసికూన కువైట్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో 5.4 ఓవర్లలో 79 పరుగులకే టీమిండియా ఆలౌటైంది. భారత జట్టు టీ20 చరిత్రలో కొన్ని మ్యాచ్‌లలో 100 పరుగుల మార్కును కూడా చేరుకోలేకపోయింది. మెల్‌బోర్న్‌లో (2008, ఫిబ్రవరి) ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 74 పరుగులు చేసిన టీమిండియా టీ20 చరిత్రలో అత్యల్ప స్కోరుగా నమోదైంది. ఆ మ్యాచ్‌లో ఇర్ఫాన్ పఠాన్ (26) మాత్రమే కొంతసేపు క్రీజులో నిలబడగలిగాడు. జట్టు 17.3 ఓవర్లలోనే కుప్పకూలి, మ్యాచ్‌ను దారుణంగా కోల్పోయింది. అలాగే న్యూజిలాండ్‌తో టీ20 ప్రపంచ కప్









2016 ప్రారంభ మ్యాచ్‌లో భారత్ దారుణంగా ఓడిపోయింది. న్యూజిలాండ్ స్పిన్నర్లు భారత బ్యాట్స్‌మెన్‌లను ఉక్కిరిబిక్కిరి చేశారు. మిచెల్ శాంట్నర్, ఇష్ సోధి బౌలింగ్ ముందు మొత్తం జట్టు 18.1 ఓవర్లలో కేవలం 79 పరుగులకే ఆలౌట్ అయింది. ఇక కొలంబోలో శ్రీలంక (2021)తో జరిగిన మ్యాచ్‌లో 81 పరుగులే టీమిండియా కష్టం మీద చేయగలిగింది. కోవిడ్ కాలంలో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జట్టులో చాలా మంది ఆటగాళ్ల ఐసోలేషన్‌లో ఉన్నారు. యువకులతో కూడిన జట్టు శ్రీలంక బౌలర్ల ముందు కష్టపడి, 20 ఓవర్లలో కేవలం 81 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఇది భారత టీ20 చరిత్రలో అత్యంత బలహీనమైన బ్యాటింగ్ ప్రదర్శనలలో ఒకటిగా నిలిచింది. దక్షిణాఫ్రికా (2015)తో కటక్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత బ్యాట్స్‌మెన్లు విఫలమయ్యారు. దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్లు మొదటి నుంచీ ఒత్తిడి తెచ్చారు. మొత్తం జట్టు 17.2 ఓవర్లలో కేవలం 92 పరుగులకే ఆలౌట్ అయింది. మరోసారి శ్రీలంక (2016) చేతిలో పరాభం చెందింది. పుణెలో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత స్టార్ బ్యాటింగ్ లైనప్ మళ్లీ దారుణంగా కుప్పకూలింది. శ్రీలంక ఫాస్ట్ బౌలర్ కసున్ రజితా తన అరంగేట్ర మ్యాచ్‌లోనే 3 వికెట్లు పడగొట్టి భారత్‌ను షాక్‌కు గురిచేశాడు. మొత్తం జట్టు 18.5 ఓవర్లలో కేవలం 101 పరుగులు మాత్రమే చేయగలిగి మ్యాచ్‌ను కోల్పోయింది.

# మూడో టి20లో న్యూజిలాండ్ విక్టరీ

**న్యూఢిల్లీ:** మూడో టీ20లో ఉత్కంఠ భరితమైన ముగింపులో న్యూజిలాండ్ వెస్టిండీస్‌ను చిత్తుగా ఓడించింది. దీంతో ఐదు ఆటల సిరీస్‌లో న్యూజిలాండ్ 2 -1 ఆధిక్యంలో నిలిచింది. ఆదివారం జరిగిన మూడో టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై న్యూజిలాండ్ 9 పరుగుల తేడాతో విజయం సాధించింది. సీమర్ కైల్ జేమిసన్ వరుసగా రెండో మ్యాచ్‌లో చివరి ఓవర్‌లో చేసిన స్కోరుతో ఈ విజయం సాధ్యమైంది. నెల్సన్‌లో న్యూజిలాండ్ సాధించిన తొమ్మిది వికెట్లకు 177 పరుగుల స్కోరును అధిగమించే అవకాశం ఉన్నా కానీ రొమారియో షెపర్డ్ తన కెరీర్‌లో అత్యుత్తమ 49 పరుగుల కోసం చివరి బంతికి డీప్ బౌలర్‌గా క్యాచ్ ఇచ్చి 168 పరుగుల వద్ద ఔటయ్యాడు. 13వ ఓవర్లో వెస్టిండీస్ ఎనిమిది వికెట్లకు 88 పరుగులు చేసి ఆశలు వదులుకున్నట్లు అనిపించింది. ఆ తర్వాత షెపర్డ్ తోటి సీమర్ షమర్ స్ప్రింగర్ బంతిని క్లీన్ గా బౌండరీకి కొట్టడం ప్రారంభించారు. ఈ జంట కేవలం 6.3 ఓవర్లలోనే 78 పరుగులు జోడించారు. ఆ తర్వాత స్ప్రింగర్ అద్భుతంగా బౌలింగ్ చేసి జాకబ్ డఫీ బౌలింగ్‌లో 39 పరుగులు చేసి ఒక ఓవర్ మిగిలి ఉండగానే బౌలింగ్ చేశాడు.




గెలవడానికి 12 పరుగులు అవసరమైనప్పుడు, చివరి జంట జేమిసన్ వేసిన మొదటి 4 బంతుల్లో కేవలం రెండు మాత్రమే స్కోర్ చేయగలిగింది. ఓపెనర్ డెవాన్ కాన్వే 34 బంతుల్లో 56 పరుగులు చేసి రనౌట్ కావడంతో న్యూజిలాండ్ తన లక్ష్యాన్ని కోల్పోయింది. డారిల్ మిచెల్ మిడిల్ ఆర్డర్‌లో (41) ఆకట్టుకున్నాడు. 31 పరుగులతో అలిక్ అథనాజ్, 24 పరుగులు చేసిన అకీమ్ అగస్టే వెస్టిండీస్ లక్ష్యాన్ని ఛేదించడానికి స్థిరమైన ఆరంభాన్ని అందించినా 35 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోవడం వారి ఆశలను దెబ్బతీసింది. డఫీ 36 పరుగులకు మూడు, ఇష్ సోధి 34 పరుగులకు మూడు వికెట్లు పడగొట్టారు.

# మెహుల్‌చోక్సీ ఆస్తులు వేలానికి కోర్టు అనుమతి

**ముంబయి, నవంబరు 9:** పంజాబ్‌నేషనల్ బ్యాంకులో ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారుగా విదేశాల్లో ఉన్న గీతాంజలి ఆభరణాల వ్యాపారి మెహుల్‌చోక్సీకి చెందిన ఆస్తులు వేలం వేసేందుకు ముంబయి కోర్టు అనుమతులు ఇచ్చింది. మొత్తం 13 అరక్షిత ఆస్తులు మెహుల్ చోక్సీకి చెందినవిగా దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈనెల నాల్గవ తేదీ కోర్టు ఈ ఆస్తులు వేలంద్వారా సమకూరిన సొమ్మును విచారణజరుపుతున్న కోర్టులో డిపాజిట్ చేయాలని ఆదేశించింది. ఎఫ్‌డిలుగా కోర్టుపేరిట డిపాజిట్‌చేయాలని, అన్ని అనుబంధ వ్యయాలు, ఖర్చులను ఈ సొమ్మునుంచి మినహాయించుకున్న తర్వాత డిపాజిట్లుగా మార్చాలని సూచించారు. కేవలం అరక్షిత ఆస్తులు మాత్రమే వేలం వేస్తారని సెక్యూరిటీ ఉన్న రుణదాతలు చెపుతున్న ఆస్తులజోలికి వెళ్లవద్దని దర్యాప్తు



ఏజెన్సీలను ఆదేశించింది. విచారణముగిసిన వెంటనే ఈసొమ్ముపై నిర్ణయం తీసుకుంటామని న్యాయమూర్తి ప్రకటించారు. బీరీవాలిలో నాలుగు ప్లాట్లు ఉన్నాయి. వాటి విలువ 2.6 కోట్లు ఉంటుందని అంచనా. భారత్ డైమండ్ బోర్స్ పేరిట బాంద్రా కుర్లా కాంప్లెక్ససలో ఒక యూనిట్ ఉంది. 14 పార్కింగ్ స్పేస్‌లు మొత్తం 19.7 కోట్ల విలువైనవిగా చెపుతున్నారు. అలాగే గోరేగాంవ్ ఈస్ట్‌ల ఆరు, ఉద్యోగ్‌నగర్‌లో ఒకటి, పారిశ్రాయిక గేలాలు ఉన్నాయి జైపూర్ కేంద్రంగా వెండి ఇటుకల తయారీ, విలువైన రాళ్లుశుద్ధిచేసే యంత్రాలను కూడా వేలానికి ఉంచారు. 2018లో ఈ ఆస్తుల విలువను మదింపుచేసారు. ఈ విలువల ఆధారంగానే ఇపుడు ఈ ఆస్తులు వేలానికి వస్తున్నాయి.

# బెజోస్ మాజీ భార్య రూ.1.70 లక్షల కోట్ల విరాళాలు!

**శాన్‌ఫ్రాన్సిస్కో, నవంబరు 9:** ప్రపంచ కుబేరుడు, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ మాజీ భార్య మెకంజీ స్కాట్ తన ఉదారతతో వార్తల్లో నిలిచారు. విడాకుల తర్వాత లభించిన సంపదలో అధిక భాగాన్ని ఆమె దాతృత్వానికే కేటాయిస్తున్నారు. 2020 నుంచి ఇప్పటివరకు ఆమె ఏకంగా 19.25 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 1.70 లక్షల కోట్లు) విరాళంగా అందించి రికార్డు సృష్టించారు. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం మెకంజీ స్కాట్ తన యీల్డ్ గివింగ్ అనే దాతృత్వ సంస్థ ద్వారా ఈ భారీ విరాళాలను అందిస్తున్నారు. విద్య, విపత్తు నిర్వహణ, ఇతర సామాజిక అంశాలపై పనిచేస్తున్న అనేక స్వచ్ఛంద సంస్థలకు ఆమె ఆర్థిక చేయూతనిస్తున్నారు. ముఖ్యంగా ఆమె ఇచ్చే నిధులు అన్‌రిస్ట్రిక్టెడ్ గ్రాంట్స్ కావడంతో ఆయా సంస్థలు తమ అవసరాలకు



అనుగుణంగా ఆ డబ్బును స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశం ఉంటుంది. 2019లో జెఫ్ బెజోస్‌తో విడాకులు తీసుకున్న సమయంలో అమెజాన్ కంపెనీలో ఆమెకు 4 శాతం వాటా లభించింది. దీని విలువ దాదాపు 139 మిలియన్ షేర్లు. అప్పటి నుంచి తన వాటాను క్రమంగా విక్రయిస్తూ వస్తున్న మెకంజీ, ఆ వచ్చిన డబ్బును పూర్తిగా దానధర్మాలకే కేటాయిస్తున్నారు. ఇప్పటివరకు తన వాటాలో 42 శాతం అంటే దాదాపు 58 మిలియన్ షేర్లను ఆమె విక్రయించారు. ఇంత భారీ మొత్తంలో నిరంతరం విరాళాలు అందిస్తున్నప్పటికీ, మెకంజీ స్కాట్ నికర ఆస్తుల విలువ ఇంకా 35.6 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 3.15 లక్షల కోట్లు)గా ఉంది. సంపదను సమాజ హితం కోసం వెచ్చించడంలో ఆమె ప్రపంచవ్యాప్తంగా ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

# భారత్ స్కాచ్ విస్కీకి గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్

## 19.2 కోట్ల బాటిళ్లకు పైగా ఎగుమతులు



**న్యూఢిల్లీ, నవంబరు 9:** భారత్ స్కాచ్ విస్కీ మార్కెట్ రానున్న కొన్నేళ్లలో ఇతర అన్ని దేశాలను అధిగమించి ప్రపంచ మార్కెట్ లీడర్‌గామారుతుందని స్కాచ్ విస్కీ అసోసియేషన్‌ప్రకటించింది. శరవేగంగా అభివృద్ధిచెందుతున్న దేశంగా ఉన్న భారత్ ఇప్పటికే అగ్రస్థానంలో ఉన్న ఫ్రాన్స్‌ను అధిగమించింది. 192 మిలియన్ల బాటిళ్లు ఎగుమతులుచేసింది. విలువలపరంగా ప్రపంచంలో ఐదో అతిపెద్దదేశంగా భారత్‌నిలిచింది. దిగుమతి సుంకాలు తగ్గి, కొత్త వాణిజ్య దేశాలుకలిసివస్తే ప్రపంచంలోనే అగ్రగామిగా భారత్ విస్కీ ఎగుమతుల్లో నిలుస్తుందని అసోసియేషన్ చెపుతోంది. యుకె,భారత్‌లమధ్య స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందం కూడా ఇందుకు కలిసొస్తున్నదని అసోసియేషన్ చీఫ్ మార్క్ కెంట్ వెల్లడించారు.

భారతీయ మాల్ట్ విస్కీ అసోసియేషన్ ఈసందర్భంగా కొత్త భాగస్వామ్యాలకు వస్తే భారత్ స్కాచ్‌విస్కీకి మరింత మార్కెట్ లభిస్తుందని చెపుతున్నారు. బ్రిటన్‌తో స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందంవల్ల సుంకాలు విస్కీ, జిన్‌లపై 150 శాతంనుంచి 75శాతానికి తగ్గుతాయి. ఆ తర్వాత పదో ఏడాది నాటికి 40శాతానికి తగ్గుతాయని అంచనా. తక్కువ సుంకాలు ఉంటే అంతర్జాతీయంగా మరింత మార్కెట్ పెరుగుతుందని చెపుతున్నారు. ఇప్పటికే యూరోప్ ఇతర దేశాల్లో భారత్‌స్కాచ్ విస్కీకి మంచి మార్కెట్ ఉంది. అమెరికా సుంకాలు ఆదేశంతో వాణిజ్యడీల్‌కొలిక్కివస్తే అమెరికాతోపాటు ఇతర ఆసియా దేశాలకు సైతం మార్కెట్ పెరుగుతుందని అసోసియేషన్ చీఫ్ తెలిపారు.

# టాప్ ఏడు సంస్థల మార్కెట్ విలువల్లో భారీ క్షీణత

వాణిజ్యం

**ముంబయి, నవంబరు 9:** దేశంలోని టాప్ పది సంస్థల్లోని ఏడు సంస్థల మార్కెట్ విలువలు భారీగా క్షీణించాయి. ఈ వారంలో ఈ క్షీణత మొత్తం 88,635.28 కోట్లుగా ఉంది. భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్ సంస్థలు భారీగా దెబ్బతిన్నాయి. బిఎస్‌ఇ బెంచ్‌మార్క్ 722.43 పాయింట్లు క్షీణిస్తే నిఫ్టీ కూడా 229.8 పాయింట్లు ఈ వారంలో క్షీణించింది. అందువల్లనే ఈక్విటీల్లోని టాప్ మార్కెట్ సంస్థల్లో విలువలు కరిగిపోయాయి. అంతర్జాతీయ పరిణామాలు, సుంకాల ఒత్తిళ్లు, డాలర్ రూపాయి మారకం విలువలే కీలకమని తెలుస్తోంది. రిలయన్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, ఐసిఐసిఐబ్యాంకు, ఇన్ఫోసిస్, హిందూస్థాన్ యూనిలీవర్‌లు ఎక్కువ దెబ్బతిన్నాయి. మరోవైపు భారతీయ స్టేట్‌బ్యాంకు, బజాజ్‌ఫైనలన్స్, ఎల్‌ఐసి సంస్థలు మాత్రమే ఈ వారం లాభపడ్డాయి. ఎయిర్‌టెల్ మార్కెట్ విలువలు 30,506.26 కోట్లు క్షీణించి 11,41,048.30 కోట్లకు చేరితే టిసిఎస్ కూడా 23,680.38 కోట్లు క్షీణించి 10,82,658.42 కోట్లకు చేరింది. ఇక హిందూస్థాన్ యూనిలీవర్ 12,253.12 కోట్లుక్షీణించి 5,67,308.81 కోట్లకు చేరింది. అలాగే రిలయన్స్ కూడా 11,164.29 కోట్లు క్షీణించి



20,00,437.77 కోట్లుగా నమోదయింది. ఇక హెచ్‌డిఎఫ్‌సి ఎంక్యాప్‌కూడా 7303.93 కోట్లు తగ్గి 15,11,375.21 కోట్లుగా ఉంది. ఇన్ఫోసిస్ 2139.52కోట్లు క్షీణించి 6,13,750.48 కోట్లకు చేరింది. ఐసిఐసిఐబ్యాంకు 1587.78 కోట్లు క్షీణించి 9,59,540.08 కోట్లకు చేరింది. ఎల్‌ఐసి పరంగా 18,469 కోట్లుపెరిగి 5,84,366.54కోట్లకు మార్కెట్ విలువలుపెరిగాయి. అలాగే ఎస్‌బిఐ కూడా 17,492.02 కోట్లుపెరిగి 8,82,400.89 కోట్లకు చేరింది. బజాప్‌ఫైనాన్స్‌కుడా 14,965.08 కోట్లకుచేరి 6,63,721.32 కోట్లకు పెరిగింది. ఇక మార్కెట్‌విలువలపరంగారిలయన్స్ ఇప్పటికీ టాప్ వన్‌గానే నిలిచింది. ఆ తర్వాత హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, ఐసిఐసిఐబ్యాంకు, ఎస్‌బిఐ, బజాజ్‌ఫైనాన్స్, ఇన్ఫోసిస్, ఎల్‌ఐసి, హిందూస్థాన్ యూనిలివర్‌లు నిలిచాయి.



# అమెరికా దిగుమతులపై 87.82 మిలియన్ డాలర్ల సుంకాలు!

**న్యూఢిల్లీ, నవంబరు 9:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ విధిస్తున్న దిగుమతి సుంకాలకు ధీటుగా భారత్ కూడా అమెరికా ఉత్పత్తులపై 87.82 మిలియన్ డాలర్ల సుంకాలను ప్రతిపాదించింది. ప్రపంచ వాణిజ్యసంస్థకు ఈ ప్రతిపాదనలిచ్చింది. భారతీయ రాగి ఎగుమతులను పరరక్షించుకునేందుకు అమెరికా సుంకాలనుంచి రాయితీలు పొందలేకపోతే ఈ సుంకాలు హెచ్చరించింది. రాగి దిగుమతులపై 50శాతం సుంకాలు విధించడాన్ని అమెరికా సమర్థించుకోవడమేకాకుండా భారత్‌సుంకాలను వ్యతిరేకించింది.

భారత్‌నుంచి అమెరికాకు దిగుమతి అవు తున్న ఉత్పత్తులపై సుంకాలవల్లసుమారు 182. 54 మిలియన్ డాలర్లు భారంపడుతుందని వీటి లోనే సుంకాల వసూళ్ల కింద 87.82 మిలి యన్ డాలర్లు ఉంటాయని వెల్లడించింది. అందుకు అనుగుణంగానే అమెరికా రాయితీలు రద్దుచేస్తే అందుకు అంతేస్థాయిలో అంతే మొత్తంలో సుంకాలను అమెరికానుంచి దిగుమ తయ్యే వాటిపై విధించకతప్పదని స్పష్టంచేసింది. రాగి ఉత్పత్తుల దిగుమతులపై జులై 30 నుంచి కూడా అమెరికా సుంకాలు విధిస్తోంది. 50శాతం సుంకాలపేరిట అన్ని రాగి ఉత్పత్తుల దిగుమతుల పైనా విధిస్తోంది.

# 15 లక్షల టన్నుల చక్కెర ఎగుమతులకు కేంద్రం అనుమతి

**న్యూఢిల్లీ, నవంబరు 9:** కేంద్రం చక్కెర మిల్లులకు 15 లక్షల టన్నుల చక్కెరను ప్రస్తుత సీజన్‌లో ఎగుమతులకు అనుమతించింది. కేంద్ర వినియోగవ్యవహారాలమంత్రి ప్రహ్లాద్‌జోషి వివరాలప్రకారం 50శాతం ఎగుమతి సుంకం మొలాసెస్‌పై విధించిన ఈ సుంకాన్ని రద్దుచేసామని కర్ణాటక సిఎం సిద్ధరామయ్యకు రాసిన లేఖలో వివరించారు. 2025-26 సీజన్‌కు మాత్రమే 15 లక్షల టన్నులు ఎగుమతులు అనుమతిస్తున్నట్లు తెలిపారు. అయితే ఎప్పటినుంచి అనుమతి ఉంటుందన్నది వివరించలేదు. అయితే మిల్లర్లు మాత్రం 20 లక్షల టన్నుల చక్కెరను అనుమతించాలని కోరుతున్నారు. భారతీయ చక్కెర, బయో ఎనర్జీ ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ జనరల్ దీపక్ బల్లాని మాట్లాడుతూ ఈనిర్ణయం వల్ల భారత్‌లో ధరలను క్రమబద్ధీకరించే అవకాశం ఉంటుందని, అంతేకాకుండా ఈసీజన్‌లో మంచి ఉత్పత్తిని సాధించగలుగుతామని అన్నారు. కొంతమేరకయినా నిల్వలు బయటకు పోతాయని, మరికొంత దేశీయ మార్కెట్‌కు సరిపోతుందన్నారు. ఈ సీజన్‌లో 18.5శాతం చక్కెర ఉత్పతినత పెరిగి 30.95 మిలియన్ దన్నులవరకూ ఉంటుందని 3.4 మిలియన్‌టన్నులు ఇథనాల్ ఉత్పత్తికి బదలాయించినా చక్కెర ఉత్పత్తి ఈసీజన్‌లో పెరుగుతుందన్నారు. రాష్ట్రాల్లో కూడా మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రాంతాల్లో చెరకు దిగుబడి భారీగాపెరిగిందని తెలిపారు.



ఎక్స్ మిల్లుధరలు కింద క్వింటాలుకు ధరలు 3370నుంచి 37003.930కి పెంచారు. ఈసారి దిగుబడి పెరగడంతో మిగులు చెరకును ఇథనాల్ ఉత్పత్తికి వినియోగించాలని కేంద్రం సూచిస్తోంది. ఇథనాల్ 20శాతం బ్లెండింగ్‌లో 1001కోట్ల లీటర్లకు పెరిగిందని తెలుస్తోంది. ఇథనాల్ వడ్డీరాయితీ పథకం కింద కేంద్రం ఇప్పటికే 435.42 కోట్లు కేటాయించింది. ఒక్క కర్ణాటకలోనే ఇథనాల్ కేటాయింపులు డిస్టిలరీలకు 85 కోట్ల లీటర్లుగా ఉంది. ఈసారి 133 కోట్ల లీటర్ల కేటాయింపు జరిగింది. దీనివల్ల చక్కెర మిల్లులకు ప్రత్యామ్నాయ రాబడులు పెరుగుతాయని కేంద్ర మంత్రి కూడా అంచనావేసారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14